మార్చి
2023

సంపుటి :18 సంచిక : 10

203

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం కోసం అధికార దుర్వినియోగం

ఆది నుంచి అదే కథ

అదానీ ప్రదేశ్‌గా ఆంధ్ర ప్రదేశ్

విస్తరిస్తున్న పెట్టుబడిదారీ సంస్కృతి

శుంగ, కళింగ, శాతవాహన సామ్రాజ్యాలు, దక్షిణాపథం

మీడియాపై బిగుస్తున్న రాజకీయ బంధనాలు

2021 జనగణను ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోంది?

ఉగ్రవాదం సాకుతో కొత్త ప్రచ్ఛన్న యుద్ధం

ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అత్యవసరం

ఆర్యులు ఎక్కడి నుండి వచ్చారు? ఋగ్వేదంలో ఏమి ఉన్నది?

# ఆర్యులు ఎక్కడి నుండి వచ్చారు? ఋగ్వేదంలో ఏమి ఉన్నది?

**పిబి చారి**



రచయిత హైదరాబాద్‌లోని ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

ఆర్యులు మొదట దక్షిణ రష్యా నుండి మధ్య ఆసియా వరకూ విస్తరించిన ప్రాంతంలో నివసించి ఉండవచ్చునని భావిస్తున్నారు. మధ్య ఆసియా నుండి అనతోలియా, ఇరాన్, ఇండియాలకు వలన వచ్చిన వారు రూపొందించిన గ్రంథాలైన, ఇరాన్లో రచించబడిన ''జెండ్ అవెస్తా'' లోనూ, భారతదేశంలోని ఋగ్వేదంలోనూ తమను వరుసగా "ఐరేయ" ఆర్య (arya) అని పేర్కొనడంతో, యూరోపియన్ పదం ప్రచారంలోనికి వచ్చింది. ఇండో–ఆర్యన్ భాషలు మాట్లాడే సమూహాలు కాలక్రమంలో ఇండో–ఇరానియన్, ఆఫ్గన్ సరిహద్దు దాటి ఉత్తర భారతంలోకి వచ్చి ఇండో–ఆర్యన్ భాషలను పరిచయం చేశారు. భాషా సంస్కృతుల ప్రకారం చూస్తే ఋగ్వేద ప్రజలకు ముందటివైన, ఇండో–యూరోపియన్ భాష మాట్లాడే పురాతన సామాజిక బృందాలు క్రీస్తుకు పూర్వం 1800–1400 కాలంలో భారత దేశ సరిహద్దు ప్రాంతాలకు వచ్చి అక్కడ నుండి విస్తరించారని పురాతత్వ ఆధారాల ద్వారా చరిత్రకారులు ప్రస్తావిస్తున్నారు. ఋగ్వేదంలో చెప్పబడిన ఆనవాళ్ల ప్రకారం ఆఫ్ఘనిస్తాన్ హిందూ కుష్ పర్వతాల నుండి స్వాత్ లోయ, పంజాబ్, గంగా యమున మధ్య ప్రాంతం (పశ్చిమ ఉత్తర ప్రదేశ్ వరకు), కాశ్మీర్ నుండి సింధు ఉత్తర సరిహద్దు వరకు విస్తృతంగా విస్తరించి ఉన్న దేశం ఋగ్వేద సంకలనకర్తలకు బాగా తెలుసు. ఈ ప్రాంతమే ఆర్యులు విస్తరించి నివసించిన ప్రదేశం. సప్త సింధు భూభాగంగా చెప్పబడింది. అదే సప్తస్వాపార సరస్వతి అంటే ఏడు నదుల ప్రదేశం.

మూలస్థానంలో జనాభా పెరుగుదల కారణంగా ఆహారం, పశువుల మేత కొరకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళవలసి వచ్చింది. ఆర్యులు భారతదేశానికి వస్తూ మొదట ఇరాన్‌లో కనిపిస్తారు. ఈ ఆర్యులు ఇరాన్ మీదుగా మన దేశంలోని వాయువ్య ప్రాంతం గుండా అంటే హిందూ కుష్ పర్వతాలలోని కైబర్, భోలన్ కనుమల ద్వారా మన దేశానికి వచ్చారు.

క్రీస్తుపూర్వం 1500 నుండి 1000 సంవత్సరాల మధ్య సంకలనం చేయబడిందే ఋగ్వేదం. ఇది మన దేశంలో ఇండో–యూరోపియన్ భాషలలో మొట్టమొదటి గ్రంథం. సాంప్రదాయ సంస్కృత సాహిత్యంలో అతి తక్కువ మార్పులకు గురి అయింది వేదాలే. వేదమంత్రాలను దేవుడు రాశాడని, ఋషులందరూ వీటినిని కేవలం దర్శించిన వారేనని విశ్వాసం. అందువలన వేదాలను, ముఖ్యంగా ఋగ్వేదాన్ని మార్పులు చేర్పులు లేకుండా జాగ్రత్తగా కాపాడారు. ఈ వేదాలను మౌఖికంగా (చెప్పటం ద్వారా వినటం లేదా వల్లి వేయడం) ఒక తరం నుండిమరొక తరానికి అందించడం జరిగింది. అందుకే వేదాలను శ్రుతులు అంటారు. బాగా విన్న వాడిని బహుశ్రుతుడనీ, వేదాలను చక్కగా ఉచ్చరించే వారిని ఘనాపాటి,జఠ పాటి అని పిలిచేవారు.

**వేదాలు నేర్చుకునే పద్ధతి**

వేదాలు నేర్చుకోదలచిన విద్యార్థి అడవిలో గురువు దగ్గరకు వెళ్ళేవాడు. 12 ఏళ్లు అంతకన్నా ఎక్కువ కాలం గురువుగారి పశువులు కాసేవాడు. గురువు కోసం కందమూలాలు ఏరి తెచ్చేవాడు. ఈ క్రమంలో గురువు వేదాలు గురించిన పరిజ్ఞానాన్ని శిష్యుడికి అందించేవాడు. మొట్ట మొదటి అడుగు ఆ పవిత్ర గ్రంథాన్ని ఉచ్చరించటంలో శిక్షణ. పవిత్రమైన వేద పఠనానికి ముఖ్య లక్షణం శబ్ద ఉచ్చారణ స్పష్టంగా, స్ఫుటంగా ఉండటం. ఒక్క చిన్న తప్పు లేకుండా అక్షరం వెంట అక్షరం వల్లే వేయాలి. వాటి అర్థాలను గురువు సుదీర్ఘమైన సంభాషణల్లో వివరించేవాడు. మొత్తం గ్రంథం విద్యార్థి బుర్రలో ఉండిపోతుంది. విద్యార్థి సమస్త గ్రంథాన్ని తన తలలో నిక్షిప్తం చేసుకోవాలి. ఆ గ్రంథాన్ని ఉద్దేశ్యపూర్వకంగానే లిఖిత రూపంలోకి తేకుండా ఉండటంతో పురోహితవర్గానికి ఆ గ్రంథం మీద గుత్తాధిపత్యం చేజిక్కింది. ఇందువల్ల పురోహితవర్గానికి ప్రజలలో సాటిలేని గౌరవ ప్రతిపత్తి, తమ పనిలో గట్టి సంఘీభావం దొరికింది. ఒక్క మాటలో చెప్పాలంటే అది వారిని ఒక వర్గంగా మార్చింది. ఆ తర్వాతి కాలంలో భారత చరిత్రను ప్రభావితం చేసిన బలమైన వర్గంగా మార్చింది.

ఋగ్వేదంలోని ఏడవ మండలానికి ద్రష్ట వశిష్ఠుడు. 7–10–5 రుక్కులో వేద పాఠం నేర్చుకునే విధానాన్ని వర్ణించింది. దానిని కప్పల అరుపులతో పోల్చారు. ఒక కప్ప బెకబెక అని అరుపు ప్రారంభిస్తుంది. ఇతర కప్పలు అనుకరిస్తూ బెకబెకలు సాగుతాయి. ఈ కప్పలలో ఒక కప్ప అన్నదానిని మరొకటి గురువును అనుకరించినట్లుగా అనుకరిస్తుంది. ఓ కప్పలారా మీరు బాగా బెకబెకలాడుతున్నప్పుడు మీ అంగాలన్ని అభివృద్ధి చెందుతున్నాయి. వర్షాకాలంలో కప్పలు ఒకదానిని మరొకటి అనుకరిస్తూ అరవటాన్ని రుగ్వేద కాలం గురుశిష్యుల పాఠంతో పోల్చబడింది. అంటే గురువు స్వరయుక్తంగా మంత్రాన్ని ఒకసారి అంటే శిష్యులు దాన్ని రెండు సార్లు అంటారు. ఈ విధంగా, ఒక క్రమపద్ధతిలో ఋగ్వేదంలోని మంత్రాలను పునరుచ్చారణ చేయటం వలన చిన్న వయసులోనే పిల్లలకు వేదం కంఠస్థం అయ్యేది. ఈ విషయం రుగ్వేదంలోవశిష్టుడు చెప్పిన రుక్కులో వర్ణించబడింది.

మనదేశంలో వేదాలకు భాష్యం రాసివాడు సాయన చార్యుడు. ఇతడు క్రీస్తు శకం14వ శతాబ్దానికి సంబంధించిన వాడు. విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించిన హరిహర రాయలు, బుక్క రాయల గురువైన విద్యారణ్యస్వామి కుమారుడు ఈ సాయనుడు. అంటే మనదేశంలో వేదాలు 14వ శతాబ్దంలో లిపిబద్ధం అయినాయి అన్నమాట. వేద

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. ఆర్యులు ఎక్కడి నుండి వచ్చారు? ఋగ్వేదంలో ఏమి ఉన్నది? .... పిబి చారి ......2

2. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం కోసం అధికార దుర్వినియోగం
సీతారామ్ ఏచూరి ........4

3. ఆది నుంచి అదే కథ ఎంవిఎస్ శర్మ.....6

4. అదానీ ప్రదేశ్‌గా ఆంధ్రప్రదేశ్
బి తులసీదాస్ ........9

5. విస్తరిస్తున్న పెట్టుబడిదారీ సంస్కృతి
ఎస్ వీరయ్య........11

6. శుంగ, కళింగ, శాతవాహన సామ్రాజ్యాలు, దక్షిణాపథం
ఎంవిఎస్ శర్మ .........14

7. మీడియాపై బిగుస్తున్న రాజకీయ బంధనాలు
పి సాయినాథ్ ........18

8. 2021 జనగణను ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోంది?
టికె రాజాలక్ష్మి ........24

9. ఉగ్రవాదం సాకుతో కొత్త ప్రచ్ఛన్న యుద్ధం
విజయ ప్రసాద్.......26

10. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అత్యవసరం
ప్రభాత్ పట్నాయక్.......29



**సంపాదకుడు:**
**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# కుక్కమూతి పిందెలు

**చె**ట్టు చచ్చిపోయే దశకు వచ్చినప్పుడు కుక్కమూతి పిందెలు పుడతాయంటారు. ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యంలోని ప్రపంచీకరణ ఆర్థిక వ్యవస్థకు కూడా క్రోనీ-క్యాపిటలిజం అనే కుక్కమూతి పిందెలు పుడుతున్నాయి. మన దేశంలోనూ కార్పొరేట్ పెట్టుబడికీ, హిందూత్వ నయా-ఫాసిజానికీ మధ్య 'సంపర్కం'లో అనేక కుక్కమూతి పిందెలు పుట్టుకొస్తున్నాయి. అందులో ఇటీవల అత్యంత నగ్నంగా బయటపడింది మోడీ-అదానీ 'మోదానీ' వ్యవహారం. కార్పొరేట్ శక్తులు, మితవాద రాజకీయ నాయకులు మిలాఖత్ అయి ఏ విధంగా ప్రజాధనాన్ని లూటీ చేస్తారో గతంలో జర్మనీ లాంటి ఫాసిస్టు దేశాల్లో, ఇటీవల బోల్సనారో హయాంలో బ్రెజిల్ వంటి దేశాల్లో చూశాం. ఇప్పుడు మన దేశంలో ప్రత్యక్షంగా వీక్షిస్తున్నాం.

వాస్తవానికి క్రోనీ-క్యాపిటలిజం సాధారణ పెట్టుబడిదారీ వ్యవస్థలాంటిది కాదు. రెంటిలోనూ దోపిడీ ఉంటుంది. కానీ సాధారణ పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడి పెట్టి పరిశ్రమలు స్థాపించి కార్మికుల శ్రమను దోచుకుంటారు. అందులో కొంతమేరకైనా ఉద్యోగాల కల్పన ఉంటుంది. కానీ క్రోనీ-క్యాపిటలిజంలో పెట్టుబడులూ ఉండవు, ఉద్యోగాల కల్పన అంతకంటే ఉండదు. ప్రభుత్వ ప్రాపకం సంపాదించి కార్పొరేట్లు ప్రజలకు చెందిన వనరులను చేజిక్కించుకోవడమే క్రోనీ-క్యాపిటలిజంలోని మర్మం.

ప్రపంచంలో అత్యంత ధనికుల్లో రెండో స్థానానికి ఎగబాకిన అదానీ వాస్తవానికి చెప్పుకోదగ్గ పరిశ్రమ ఏదీ పెట్టలేదు. నాటి గుజరాత్ ప్రభుత్వ ప్రాపకంతో కోట్లు గడించిన అదానీ ఆస్తులు నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన 2014 నాటికి 710 కోట్ల డాలర్లు. మోడీ పాలనలోని ఈ తొమ్మిదేళ్ల కాలంలో అవి 20,000 కోట్ల డాలర్లకు పెరిగిపోయాయి. మోడీ అధికారంలోకి వచ్చేనాటికి ప్రపంచ కుబేరుల్లో 609 స్థానంలో ఉన్న అదానీ తొమ్మిదేళ్లలో రెండో స్థానానికి ఎలా ఎగబాకాడు అంటే అదంతా మోడీ చలవే. అదానీకి మోడీ 8 విమానాశ్రయాలు అప్పగించారు, ఒక డజను నౌకాశ్రయాలు అప్పగించారు. దేశంలోని బొగ్గు గనులు, చమురు, సహజవాయు క్షేత్రాలు, గ్యాస్, విద్యుత్ పంపిణీ వ్యవస్థలు, రోడ్లు ఇతర అనేక మౌలిక వసతులు అప్పగించారు. అంతటితో ఆగలేదు బ్యాంకులు, బీమా, మ్యూచువల్ ఫండ్స్ నుండి అప్పనంగా రుణాలు ఇచ్చారు. అదానీ షేర్ల విలువ పెంచడం కోసం బ్యాంకులు, బీమాలో ప్రజలు దాచుకున్న సొమ్మును పెట్టుబడిగా పెట్టారు.

పైన చెప్పిన 'మోదానీ' నేరాలకు ఇటీవల అదానీపై హిండెన్ బర్గ్ నివేదిక వెల్లడించిన నేరం అదనం. నిజానికి అదానీ భారత దేశ ప్రజల సొమ్ము దోచుకుంటే హిండెన్ బర్గ్‌కు కోపం వచ్చేది కాదు. ఎందుకంటే ఆ సంస్థ కూడా ఒక దోపిడీ దారే. కానీ అదానీ మొత్తం స్టాక్ మార్కెట్‌నే తొత్తడం చేశారు. దాంతో వ్యాపార వైరం నివేదిక రూపంలో బయటకు వచ్చింది.

కార్పొరేట్లకు మోడీ దోచిపెట్టడం అదానీతోనే ప్రారంభం కాలేదు. అక్కడితో అంతమూ కాదు. ఎయిర్ ఇండియాను టాటాలకు కట్టబెట్టినా, టెలికమ్‌ను అంబానీలకు అప్పగించినా అంతా క్రోనీ-క్యాపిటలిస్టు విధానాల్లో భాగమే. ప్రభుత్వ రంగ బ్యాంకులనుండి సొమ్ము తీసుకుని భారత దేశ సరిహద్దులు దాటిపోయిన విజయమాల్యాలు, లలిత్ మోడీలు నరేంద్ర మోడీ ప్రభుత్వ ప్రమేయం లేకుండా ఆ పని చేయగలరా?

లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని తమకు ఉచితంగా అప్పగిస్తున్నందుకు కృతజ్ఞతగా మోడీ ప్రభుత్వానికి కార్పొరేట్లు అన్ని విధాలా 'సాయం' చేస్తున్నారు. బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ పరివారానికి తాము దోచుకున్న సొమ్ములో కొంత బదిలీ చేయడానికి ఏకంగా పార్లమెంటులో చట్టమే చేయించారు. కార్పొరేట్ మీడియా మోడీ భజన చేస్తోంది. ఏ రాష్ట్రంలోనైనా బిజెపి ఓడిపోతే అక్కడ ఎమ్మెల్యేలను కొంటున్నారు. ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చి బిజెపి ప్రభుత్వాన్ని గద్దెనెక్కిస్తున్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో ఎనిమిది రాష్ట్రాల్లోనూ, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోనూ ప్రతిపక్ష ప్రభుత్వాలను కూలదోసింది.

మోడీ అనుసరిస్తున్న ఈ క్రోనీ-క్యాపిటలిస్టు విధానం, కార్పొరేట్-మితవాద దుష్టబంధం వల్ల దేశ ప్రజల సొమ్ము లూటీ అవుతోంది. తీవ్రమైన ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న సామాన్య ప్రజలపై మరిన్ని పెనుభారాలు పడుతున్నాయి. ఈ దుష్ట విధానాలను ఓడించడం నేడు దేశ ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం. ఈ విధానాలకు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ముందునుండీ పోరాడుతోంది. ప్రజాతంత్ర, లౌకిక శక్తులన్నీ ఈ పోరాటంలో ఏకం కావాలి.

# ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం కోసం అధికార దుర్వినియోగం

సీతారామ్ ఏచూరి



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి

అదానీ గ్రూపు తన కార్పొరేట్ రాజ్యాన్ని ఏ విధంగా విస్తరించినదీ హిండెన్‌బర్గ్ నివేదికలో చేసిన ఆరోపణలు వెల్లడి చేశాయి. ఈ దేశాన్ని 2014 నుంచీ పరిపాలిస్తున్న కార్పొరేట్ – హిందూత్వ కూటమి ఎటువంటి దారుణమైన నీచాలకు ఒడిగట్టిందో ఆ నివేదిక బైటపెట్టింది. తన (అక్రమ) వ్యాపార సామ్రాజ్యం మీద వచ్చిన ఆరోపణలకు స్పందిస్తూ అదానీ "అది భారతదేశం మీద తలపెట్టిన దాడి" అని అభివర్ణించాడు. ఇటీవలే మోడీ ప్రభుత్వం బిబిసి డాక్యుమెంటరీలను నిషేధించినప్పుడు కూడా ఆ డాక్యుమెంటరీలు "వలస పాలకుల ఆలోచనా రీతికి ప్రతిబింబం" అంటూ తన నిషేధాన్ని సమర్థించుకుంది. ఇప్పుడు అదానీ కూడా అదే విధంగా ప్రతిస్పందించాడు. తమపై ఎవరు ఏ విమర్శలు చేసినా, తమ అక్రమాలను ఎవరు బైటపెట్టినా, అదంతా "భారతదేశం మీద దాడి" అంటూ ముద్ర వేస్తున్నారు. కార్పొరేట్ – హిందూత్వ కూటమికి కేంద్రంగా మోడీ – అదానీ జంట వ్యవహరిస్తోంది. భారతదేశం అంటే తామే అన్న ధోరణితో వారు వ్యవహరిస్తున్నారు. తాము అనుసరిస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలు అన్నీ దేశ ప్రయోజనాలకోసమే అని చెప్తూ సమర్ధించుకుంటున్నారు. ఈ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం భారతదేశపు జాతి సంపదను కొల్లగొడుతోంది. సంక్షేమం కోసం చేయవలసిన ఖర్చుకు కోతలు పెట్టి ప్రజానీకం మీద దుర్భరమైన భారాలను మోపుతున్నారు. ఆ సొమ్మును కార్పొరేట్ల లాభాలను పెంచుకోడానికి మళ్ళిస్తున్నారు. ఎవరు అసమ్మతిని వ్యక్తం చేసినా, వారిపై దేశద్రోహులన్న ముద్రవేసి అణచివేతకు పూనుకుంటున్నారు. పూర్తి స్థాయిలో నిరంకుశత్వాన్ని చెలాయిస్తున్నారు. దేశం కోసమే ఇదంతా చేస్తున్నట్టు సమర్ధించుకుంటున్నారు.

ఈ వైఖరిని చూస్తే అడ్డగోలుగా సాగుతున్న అక్రమాలు వేటి గురించీ ఇక ఏ విధమైన విచారణా చేయవలసిన అవసరమే లేదన్నమాట. కోట్లాది ప్రజానీకం కష్టపడి సంపాదించి దాచుకున్న ధనాన్ని జాతీయ ఆర్థిక సంస్థలైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి, జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) నుంచి ఈ పాలక కూటమి, అది అమలు చేస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ఏవిధంగా కొల్లగొడుతున్నదీ పట్టించుకోకూడదన్నమాట. అదానీ గ్రూపు సంస్థలమీద వచ్చిన ఆరోపణలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీని వేయాలన్న డిమాండ్‌ను

## అదానీ వ్యవహారం పై హిండెన్‌బర్గ్ రిసెర్చి

***(ఈ నివేదికను 2023 జనవరి 25న విడుదల చేశారు)***

1. ఈ నివేదిక మా రెండేళ్ళ పరిశోధనలో వెలికి తీసిన విషయాలను తెలియజేస్తుంది. రు.17.8 లక్షల కోట్ల (218 బిలియన్ల డాలర్లు) సంపద కలిగివున్న అదానీ గ్రూపు కొన్ని దశాబ్దాలుగా ఎటువంటి స్టాక్ మార్కెట్ మోసాలకు, జమాఖర్చుల అవకతవకలకు పాల్పడిందో ఈ నివేదికలో తెలియజేస్తున్నాం.
2. అదానీ గ్రూపు వ్యవస్థాపకుడు, చైర్మన్ అయిన గౌతమ్ అదానీ స్వంత ఆస్తి 120 బిలియన్ డాలర్లు. అందులో దాదాపు 100 బిలియన్ డాలర్లు గత మూడేళ్ళలోనే సంపాదించాడు. అదానీ గ్రూపుకు చెందిన కీలకమైన 7 లిస్టెడ్ కంపెనీలషేర్ల ధరలను ఈ కాలంలో 819 శాతం పెంచి ఈ సంపదను పోగేసుకున్నాడు.
3. మా ఈ పరిశోధనలో మేము అదానీ గ్రూపు సంస్థల్లో పని చేసిన మాజీ ఉన్నతాధికారులతో చర్చించాం. వేలకొద్దీ డాక్యుమెంట్లను అధ్యయనం చేశాం. దాదాపు 6 దేశాలలో కంపెనీల సైట్లను సందర్శించాం.
4. మా పరిశోధనలో వెల్లడైన అంశాలను మీరు పక్కన పెట్టి, అదానీ గ్రూపు సంస్థల అధికారిక లావాదేవీలను (అవి వాస్తవాలే వెల్లడిస్తున్నాయని అనుకుని)

గాని, సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఒక ఉన్నతస్థాయి విచారణ కమిటీని నియమించాలన్న డిమాండ్‌ను గాని మోడీ ప్రభుత్వం తిరస్కరించడం ఈ వైఖరినే సూచిస్తోంది.

2014లో మోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిననాటికి అదానీ గ్రూపు సంస్థల మార్కెట్ విలువ 710 కోట్ల డాలర్లు అని (సుమారు రు.56,100 కోట్లు) అని ఫోర్బ్స్ అంచనా వేసింది. అది కాస్తా 2022 నాటికి అమాంతం 20,000 కోట్ల డాలర్లకు (రు. 16,00,000 కోట్లు) ఎగబాకింది! 2014 నాటికి ప్రపంచ ధనవంతుల జాబితాలో 609వ స్థానంలో ఉన్న అదానీ 2022 నాటికి ఏకంగా రెండో స్థానానికి చేరుకున్నాడు. అదానీ గ్రూపు కంపెనీలు స్టాక్‌మార్కెట్‌లో లిస్ట్ అయినవి ఏడ ఉన్నాయి. వాటికి 578 అనుబంధ సంస్థలు ఉన్నాయి. ప్రపంచ ఇంధన అధ్యయన కేంద్రం అంచనా ప్రకారం అదానీ గ్రూపు ప్రపంచంలోనే బొగ్గు - ఆధారిత విద్యుత్ ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉంది. అంతే కాక భారత దేశంలో ఎనిమిది విమానాశ్రయాలను, 13 ఓడరేవులను అది నిర్వహిస్తోంది. బొగ్గు గనులు, చమురు, సహజవాయువు నిక్షేపాలు, గ్యాస్ పంపిణీ, విద్యుత్తు రవాణా, పంపిణీ, నిర్మాణ రంగం, మౌలిక వసతుల కల్పన రంగం, ఆహార ధాన్యాల నిల్వలు, విద్య, రియల్ ఎస్టేట్, వంట నూనెలు, అంతర్జాతీయ వాణిజ్యం తదితర రంగాలలో అదానీ గ్రూపు వ్యాపారం నడుపుతోంది.

> “ఈ కాలంలో అదానీ గ్రూపునకు మోడీ ప్రభుత్వం అత్యంత ఉదారంగా అనేక వరాలను కురిపించింది. ప్రభుత్వ భూములను నామ మాత్రపు : రేటుకే కేటాయించింది. విధ్వంసకర ప్రాజెక్టులకు సైతం పర్యావరణ అనుమతులను ఉదారంగా మంజూరు చేసింది. జాతీయ బ్యాంకులనుంచి, ఆర్థిక సంస్థలనుంచి రుణాలను ఉదారంగా మంజూరు చేయించింది. తక్కిన కార్పొరేట్ల ఆస్తులను సైతం అదానీ గ్రూపు చేజిక్కించుకోడానికి ప్రభుత్వ వ్యవస్థలు ఇతోధికంగా తోడ్పడ్డాయి.”

ఈ కాలంలో అదానీ గ్రూపునకు మోడీ ప్రభుత్వం అత్యంత ఉదారంగా అనేక వరాలను కురిపించింది. ప్రభుత్వ భూములను నామ మాత్రపు : రేటుకే కేటాయించింది. విధ్వంసకర ప్రాజెక్టులకు సైతం పర్యావరణ అనుమతులను ఉదారంగా మంజూరు చేసింది. జాతీయ బ్యాంకులనుంచి, ఆర్థిక సంస్థలనుంచి రుణాలను ఉదారంగా మంజూరు చేయించింది. తక్కిన కార్పొరేట్ల ఆస్తులను సైతం అదానీ గ్రూపు చేజిక్కించుకోడానికి ప్రభుత్వ వ్యవస్థలు ఇతోధికంగా తోడ్పడ్డాయి. విదేశాల్లో బొగ్గు గనులు, పోర్టులు వంటివి చేజిక్కించుకోడానికి కూడా ప్రభుత్వం తన పలుకుబడిని వినియోగించి అదానీకి తోడ్పడింది.

స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూపు ఇన్‌సైడర్ ట్రేడింగ్, రౌండ్ ట్రిప్పింగ్ వంటి అక్రమ పద్ధతులకు పాల్పడినా, అటువంటి పద్ధతులు స్టాక్ మార్కెట్ నిబంధనలకు విరుద్ధమైనా, విదేశాల్లో నిధుల అక్రమ లావాదేవీలు జరిపినా, నియంత్రణ సంస్థలు ఏమాత్రమూ పట్టించుకోలేదు.

హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడైన తర్వాత అదానీ సామ్రాజ్యం మార్కెట్ విలువ దాదాపు 20,000 కోట్ల డాలర్లనుంచి అందులో సగానికి పడిపోయింది. ఆ పతనాన్ని అరికట్టడానికి చేపట్టిన ఫాలో-అప్ పబ్లిక్ ఆఫరింగ్‌లో వాటాల అమ్మకాన్ని అర్ధంతరంగా రద్దు చేసుకోవలసి వచ్చింది. డాలర్ల రూపంలో నిధులను బాండ్ల ద్వారా సేకరించడానికి చేసిన ప్రయత్నాన్నీ విరమించుకోవలసి వచ్చింది. అదానీ కంపెనీల షేర్లలో పెట్టుబడి పెట్టిన అనేకమంది సర్వనాశనమయ్యారు.

ఈ నేపథ్యంలో ఈ కార్పొరేట్ - మతతత్వ కూటమి ఏవిధంగా తన కుట్రలను సాగిస్తున్నదీ తెలుసుకోడానికి అందరూ ప్రయత్నించాలి. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని బలపరచడం కోసం భారత ప్రభుత్వ అధికారాన్ని ఏవిధంగా దుర్వినియోగపరుస్తున్నదీ తెలుసుకోవాలి. అప్పుడే మనముందున్న సవాళ్ళేమిటో సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాం.

❋

# ఫౌండేషన్ నివేదిక - ముఖ్యాంశాలు

పరిశీలించినా, ఆ 7 లిస్టెడ్ కంపెనీల వాటాల విలువ వాస్తవ విలువ కన్నా 85 శాతం అధికంగా చూపడం జరిగిందని గమనించవచ్చు.

5. అదానీ గ్రూపు కంపెనీలు కృత్రిమంగా విలువ పెంచిన తమ షేర్లను తాకట్టు పెట్టి చాలా పెద్ద మొత్తాల్లో బ్యాంకులనుండి అప్పులు తీసుకున్నాయి. ఆ 7 కంపెనీల్లో అయిదింటి లాభాలు ఒక శాతం కన్నా తక్కువగా ఉన్నాయి. అంటే అవి దాదాపు దివాలా తీసే పరిస్థితి ఉందన్నమాట. తలకు మించిన రుణాల వలన అదానీ గ్రూపు కంపెనీల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది.

6. అదానీ గ్రూపు సంస్థలలోని కీలకమైన 22 పదవులకుగాను 8 పదవులు అదానీ కుటుంబసభ్యులే నిర్వహిస్తున్నారు. అంటే ఈ మొత్తం వ్యవహారం అంతా ఒక కుటుంబానికి సంబంధించిన వ్యాపారం మాత్రమే. వారిని కాదని ఏ నిర్ణయమూ తీసుకోవడం సాధ్యం కాదు.

7. అక్రమ హవాలా వ్యాపారం చేసినందుకు, టాక్స్‌పేయర్ల ధనాన్ని దొంగిలించినందుకు, అవినీతికి పాల్పడినందుకు, గతంలో అదానీ సంస్థలు నాలుగు ప్రధానమైన ప్రభుత్వ విచారణలను ఎదుర్కొన్నాయి. వాటిలో దాదాపు 17 బిలియన్ల డాలర్ల (దాదాపు

'మోదానీ' బాగోతం

# ఆది నుంచి అదే కథ


రచయిత ప్రజాశక్తి పూర్వ సంపాదకులు

**ఎం.వి.ఎస్.శర్మ**

అదానీ కంపెనీ షేర్లను వారు సృష్టించిన డొల్ల కంపెనీలే కొన్నాయి. షేర్ల విలువను కృత్రిమంగా పెంచాయి. ఇప్పుడు వాటి విలువ పడిపోవడంతో నష్టపోయింది కూడా ఆ కంపెనీయే గనుక దీంతో జనానికేమి నష్టమని కొందరంటున్నారు. కానీ, అదానీ షేర్ల విలువ పడిపోవడం వెనుక, అతని కంపెనీ ఆస్తులు పెరగడం వెనుక పరోక్షంగా ప్రజాధనం ఏ విధంగా నష్టపోయిందనేదే ఇందులో అసలు కిటుకు.

ప్రస్తుతం జరుగుతున్న మోదీ – అదానీ వ్యవహారం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి మాయని మచ్చగా మిగిలింది. ఇప్పుడు కేంద్రం తూతూ మంత్రంగా విచారణ జరిపించి ప్రజలను మభ్యపెట్టే అవకాశం లేకపోలేదు. ఆ మాయలో దేశ ప్రజలు చిక్కుకోవచ్చు కూడా. కానీ విదేశీ మదుపరులు ఎందుకు నమ్ముతారు, వారెందుకు మోసపోతారు?

అదానీ కుటుంబం మొదట వజ్రాల వ్యాపారం చేసింది. ముడి వజ్రాలను మొదట అదానీ కుటుంబం ఏ ఆఫ్రికా నుంచో దిగుమతి చేసుకున్నది. వాటిని వజ్రాభరణాలుగా మార్చి ఎగుమతి చేసింది. ఎగమతుల ప్రోత్సాహకానికి ప్రభుత్వం కొన్ని రాయితీలు ఇచ్చింది. ఆ రాయితీలను పొందాలంటే సరైన ఆధారాలను చూపించాలి. కానీ, అదానీ కుటుంబం దిగుమతులు, ఎగమతులు జరిగినట్టుగా నకిలీ కాగితాలను సృష్టించింది. అదానీ వ్యాపారం అక్కడి నుంచి ప్రారంభమైంది. మొదటి రాయితీగా అదానీ కుటుంబం రూ. 680 కోట్లు కొట్టేసింది. నయా పైసా పెట్టుబడి లేకుండానే అదానీ వ్యాపారం ఇలా మొదలైందన్నమాట. వాస్తవమేమంటే వజ్రాల దిగుమతి, ఎగుమతి అనేది ఒక భ్రమ. ఇలా ప్రభుత్వ రాయితీలు పొందడం కోసమే డొల్ల కంపెనీలు కోకొల్లలుగా అదానీ కుటుంబం సృష్టించింది.

అదానీ డొల్ల కంపెనీలు పొందిన ప్రభుత్వ రాయితీ సొమ్ము ఎవరిదో కాదు, ప్రజలు చెల్లించిన పన్నులే. అదానీ కుంభకోణానికి సహకరించిన వారు కేతన్ పరేఖ్ లాంటి ఆరితేరిన ఆర్థిక నేరగాళ్లు. ఆర్థిక నేరాలు చేసి ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు దొరకని, పరారీలో ఉన్న నిందితులంతా అదానీకి భాగస్వాములు. పరారీలో ఉన్న ఆర్థిక నేరగాని కుమారుడికి అదానీ తన కూతురునిచ్చి పెళ్లి చేశాడు. వీరి ప్రత్యేకత ఏమంటే ఓవర్ ఇన్వాయిసింగ్. ఉదాహరణకు అదానీ సోలార్ పవర్ ధర, వారు కొనుగోలు చేసిన మెషినరీ ఖరీదు, ఉత్పత్తి వ్యయాన్ని జోడించి లాభసాటిగా విద్యుత్‌ను ప్రభుత్వానికి అమ్ముతారు. ప్రభుత్వం కొనుగోలు చేసే విద్యుత్ ధరను నిర్ధారించడానికి రెగ్యులేటరీ అథారిటీ ఉంటుంది. ఇందులో మోసం ఎక్కడుందంటే, అంతర్జాతీయ మార్కెట్‌లో వారు కొనుగోలు చేసిన సోలార్ ఎక్విప్‌మెంట్ వంద కోట్లు ఉందనుకుందాం. దాన్ని ఒక కంపెనీ రెండు వందల కోట్లకు కొంటుంది. మరో కంపెనీ దీన్నే నాలుగు వందల కోట్లకు కొంటుంది. దాన్నీ కొనుగోలు చేసిన మరో కంపెనీ దాన్ని 800 కోట్లకు అమ్ముతుంది. అదానీ ఆ 800 కోట్ల ఎక్విప్‌మెంట్ వ్యయానికి ఉత్పత్తి వ్యయాన్ని

లక్షా ముప్పైఆరువేల కోట్ల రూపాయలు) మేరకు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. మారిషస్, యుఎఇ, కరిబియన్ దీవులు వంటి దేశాలలో డొల్ల కంపెనీలను స్థాపించి, ఫోర్జరీ చేసిన పత్రాలను సృష్టించి ఎగుమతి, దిగుమతి లావా దేవీలు జరిగినట్టు చూపించి లేని టర్నోవర్ ఉన్నట్టు చిత్రించి లిస్టెడ్ కంపెనీల నుండి నిధులను మాయం చేశారు.

8. భారతదేశపు డైరక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ చేసిన ఆరోపణ ప్రకారం గౌతమ్ అదానీ తమ్ముడు రాజేశ్ అదానీ 2004-2005 కాలంలో వజ్రాల ఎగుమతి-దిగుమతి వ్యాపారంలో అక్రమాలకు కీలక పాత్రధారిగా ఉన్నాడు. ఆ కాలంలో లేని వ్యాపారం జరిగినట్టు చూపించి విదేశాల్లోని డొల్ల కంపెనీలకు సొమ్ము అక్రమంగా తరలించారు. ఫోర్జరీకి, పన్ను ఎగవేతకు పాల్పడిన నేరానికి రాజేశ్ అదానీని రెండు సార్లు అరెస్టు చేశారు. ఇప్పుడు రాజేశ్ అదానీ ఆ గ్రూపు సంస్థలకు ఎం.డి.గా ప్రమోట్ అయాడు.

9. గౌతమ్ అదానీ బావమరిది సమీర్ వోరా. ఇతను కూడా వజ్రాల వ్యాపారంలో అక్రమాలకు రింగ్ లీడర్‌గా వ్యవహరించినట్టు, పదే పదే తప్పుడు పత్రాలను సమర్పించి అధికారులను తప్పుదోవ పట్టించినట్టు డిఆర్ఐ ఆరోపించింది. ఆ తర్వాత సమీర్ వోరాను అదానీ-ఆస్ట్రేలియా డివిజన్‌కు ఎగ్జిక్యూటివ్ డైరక్టర్‌గా ప్రమోట్ చేశారు.

10. గౌతమ్ అదానీ పెద్దన్న వినోద్ అదానీ. విదేశాల్లోని అదానీ గ్రూపునకు చెందిన డొల్ల కంపెనీల లావాదేవీలన్నింటినీ నిర్వహించడంలో ఇతడిదే ప్రధాన పాత్ర. వాటిద్వారానే అక్రమాలన్నీ

జోడించి సోలార్ విద్యుత్‌కు ధర నిర్ణయించి ప్రభుత్వానికి అమ్ముతారు. దీన్నే ఓవర్ ఇన్వాయిసింగ్ అంటారు. ఆ రకంగా బొగ్గును ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేసే మన జెన్‌కో లాంటి కంపెనీకి అదానీ అమ్ముతాడు. ఈ జెన్‌కో కంపెనీలు కనీసం 10 శాతం అదానీ బొగ్గును కొనాలనేది కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధన. అక్కడ రూపాయికి కొన్న దాన్ని ఇక్కడ మన జెన్‌కోకు రూ.10కి అమ్ముతారు. ఆ మొత్తాన్ని విద్యుత్ వినియోగదారులు చెల్లించాలి.

> "ఇక్కడ అండర్ ఇన్వాయిసింగ్, ఓవర్ ఇన్వాయి సింగ్‌ల ద్వారా జరిగే మోసం ముఖ్యమైనది. ప్రభుత్వం అదానీకి చదరపు మీటరుకు రూపాయి చొప్పున భూమి అమ్మితే, దాన్నే అక్కడే ఇంకొకరికి రూ.14 చొప్పున లీజుకు ఇస్తాడు. అలా ప్రభుత్వం నుంచి తీసుకున్న అడవులను ధ్వంసం చేసి పర్యావరణానికి విఘాతం కలిగిస్తారు. ఈ విధ్వంసాన్ని ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేదనేది అసలు ప్రశ్న."

ఇక్కడ అదానీ ఆస్తులు పెరగడం, తగ్గడం ముఖ్యం కాదు. అండర్ ఇన్వాయిసింగ్, ఓవర్ ఇన్వాయిసింగ్‌ల ద్వారా జరిగే మోసం ముఖ్యమైనది. ప్రభుత్వం అదానీకి చదరపు మీటరుకు రూపాయి చొప్పున భూమి అమ్మితే, దాన్నే అక్కడే ఇంకొకరికి రూ.14 చొప్పున లీజుకు ఇస్తాడు. అలా ప్రభుత్వం నుంచి తీసుకున్న అడవులను ధ్వంసం చేసి పర్యావరణానికి విఘాతం కలిగిస్తారు. ఈ విధ్వంసాన్ని ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేదనేది అసలు ప్రశ్న. పర్యావరణానికి అదానీ కంపెనీ కలిగించిన నష్టానికి అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం రూ.200 కోట్ల జరిమానా విధించింది కూడా. కానీ మోదీ ప్రభుత్వం ఆ జరిమానాను రద్దుచేసింది. ఇలా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అదానీకి పలురకాలుగా లబ్ధి చేకూరుస్తూనే వచ్చింది.

ఇక స్టాక్ మార్కెట్, స్టాక్ మ్యానిప్లేషన్ విషయానికి వద్దాం. ఇందులో జరిగే నష్టం ఏమంటే వారి కంపెనీల వాటాలను వారే పెంచి, పెరిగిన వాటాలను వారే కొనుగోలు చేస్తారు. పెరిగిన స్టాక్ వల్ల ఎవరికి నష్టం లేదు కానీ, కృత్రిమంగా పెంచిన స్టాక్‌లను బ్యాంక్‌లు, ఫైనాన్స్ కంపెనీలకు పూచీగా చూపించి బాండ్స్ అమ్మడం. బాండ్స్ అమ్మడమంటే ఏమిటి? అప్పు తీసుకోవడం. బాండ్స్ అమ్మడానికి బ్యాకప్ ఏమిటీ షేర్స్. మరి షేర్ వ్యాల్యూనే పడిపోతే? బాండ్స్ కొన్నవాళ్ల పరిస్థితి ఏమిటి? వీటిని కొన్నవాళ్లలో 34 శాతం బ్యాంకులు, బీమా కంపెనీలే ఉన్నాయి. ఇంకో 34 శాతం విదేశీ మదుపుదార్లది. ప్రైవేట్ వ్యక్తులు కొన్నది చాలా తక్కువ శాతం. ఇందులో హోల్‌సేల్‌గా జరిగిన మోసాలే ఎక్కువ. దీంట్లో విదేశీ మదుపరులకు భారీగా నష్టం వాటిల్లింది.

అదానీ షేర్లు అసాధారణ రీతిలో ఉన్నపళంగా పెరగడంతో విదేశీ మదుపరులకు అనుమానం వచ్చింది. దీంతో వారు హిండెన్‌బర్గ్‌ను రంగంలోకి దింపారు. ఈ సంస్థ షేర్ మార్కెట్లను లోతుగా అధ్యయనం చేస్తూ పెట్టుబడులను పెట్టేవారికి సలహాలు ఇస్తుంది. ఇక్కడ జరిగిందేమంటే పేకాట ఆడటమే తప్పు. అయితే ఆ ఆటలోనూ కొన్ని నిబంధనలు పాటించాలి. పాటించకపోతే.. నిర్వాహకులకు చర్య తీసుకునే అధికారం ఉంటుంది. ఇప్పుడు అంతర్జాతీయంగా స్టాక్‌మార్కెట్ వ్యాపారాల్లోనూ అదానీ నిబంధనలను ఉల్లంఘించాడు. వాటినే హిండెన్‌బర్గ్ బయటపెట్టింది. స్టాక్ మార్కెట్‌లో జూదం ఆడే వారందరిని అదానీ మోసం చేస్తున్నాడని, అంతర్జాతీయ సంస్థలను అప్రమత్తం చేస్తూ హిండెన్‌బర్గ్ తన పరిశోధన నివేదికను బయటపెట్టింది.

ఇది అదానీ వ్యాపార సామ్రాజ్యం. ఇందులో విమానాశ్రయాలున్నాయి, ఓడ రేవులు, రైల్వేలు కూడా ఉన్నాయి. వీటిని లీజుకు తీసుకోవడం, వాటిద్వారా జరిగే ఎగుమతులు, దిగుమతులపై ఒక కమిషన్ ఏజెంట్‌గా చార్జీలు

జరిగాయి. ఇతను ఎప్పుడూ మీడియా దృష్టిలో పడకుండా తప్పించుకుని తిరుగుతాడు.

11. వినోద్ అదానీ గాని అతడి అత్యంత సన్నిహితులు గాని నడుపుతున్న డొల్ల కంపెనీలు ఒక్క మారిషస్ లోనే 38 ఉన్నాయి. ఇవి గాక ఇంకా సైప్రస్, యుఎఇ. సింగపూర్, పలు కరిబియన్ దీవులు – ఈ దేశాల్లో మరికొన్ని డొల్ల కంపెనీలను నడుపుతున్నారు.

12. ఈ కంపెనీలు ఏ విధమైన లావాదేవీలనూ నిర్వహిస్తున్నట్టు ఎక్కడా దాఖలాలు లేవు. ఏ కంపెనీలోనూ పనిచేస్తున్న ఉద్యోగులు లేరు. స్వంత చిరునామాలు గాని, ఫోను నంబర్లు గాని లేవు. అర్థవంతమైన ఆన్‌లైన్ కార్యకలాపాలు కూడా ఏ కంపెనీలోనూ జరుగుతున్నట్టు కనిపించదు. ఎవరెవరితో ఏ విధమైన వ్యాపార లావాదేవీలు జరిపినదీ ఆ వివరాలు ఏవీ లేవు.

13. ఈ డొల్ల కంపెనీల ద్వారా వ్యాపారాలు జరుగుతున్నట్టు నమ్మించడానికి కొన్ని ప్రయత్నాలు జరిగినట్టు మేం గమనించాం. వినోద్ అదానీ అసోసియేట్స్ పేర ఒకే రోజున 13 వెబ్‌సైట్లు పుట్టుకొచ్చాయి. ఆ వెబ్‌సైట్లలో ఏ వివరాలూ లేవు. ఏ ఉద్యోగి వివరాలూ లేవు. కార్యకలాపాలుగా "విదేశాల్లో వినియోగం కోసం" అని, "వ్యాపార అవసరాల నిమిత్తం" అని అర్థం పర్థం లేని సేవలను ప్రస్తావించారు.

షేర్ల ధరలను తారుమారు చేయడానికి, అదానీ స్వంత కంపెనీల నుండి నిధులను లిస్టెడ్ కంపెనీలలోకి బదలాయించి తద్వారా ఆ లిస్టెడ్ కంపెనీల ఆర్థిక పరిస్థితి బాగున్నదని చూపించడానికి ఈ డొల్ల కంపెనీలను వాడుకున్నారు.

> **"తాజాగా అదానీ వ్యవహారంతో కోల్పోయిన ప్రపంచ మదుపరుల విశ్వాసం పొందాలంటే ఆ దిశగా భారత ప్రభుత్వం నమ్మకం కలిగించాల్సిన అవసరం ఉన్నది. లేకుంటే దేశానికి నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉన్నది. మొత్తంగా ప్రభుత్వానికి అదానీ వ్యవహారం గుదిబండలా తయారైంది. అందుకే మోదీ ప్రభుత్వం లోన భయపడుతున్నా, బయటికి మాత్రం మాకేం సంబంధం లేదన్నట్టుగా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నది."**

వసూలు చేయడం వరకే అదానీ సంస్థ పరిమితం. అందుకే టాటా, బిర్లాల మాదిరిగా అదానీ వద్ద ఉద్యోగులు లక్షల సంఖ్యలో ఉండరు. వేలల్లో మాత్రమే ఉంటారు. దీంతో ఖర్చు తక్కువ, లాభాలు ఎక్కువ. ఆ మాటకొస్తే ముందు నుంచి బడా పారిశ్రామికవేత్తలుగా ఉన్న టాటా, బిర్లాల కంటే ఎక్కువ సంపదనను స్వల్ప వ్యవధిలో అదానీ కూడబెట్టాడు.

అదానీ చేసే వ్యాపారాల వల్ల ప్రజలకేం నష్టం అన్నది ఇప్పుడు ప్రజలు అర్థం చేసుకోవాలి. తాను లీజుకు తీసుకున్న ఎయిర్ పోర్టులు, పోర్టులలో హాండ్లింగ్ చార్జీలను పెంచితే ఆ భారాన్ని టికెట్లు, చార్జీల రూపంలో ప్రజల నుంచి వసూలు చేస్తాడు. ఇవేకాకుండా రైల్వే గ్యారేజీలను, ఆహార ఉత్పత్తులను నిలువ చేసే గోదాములను కూడా అదానీ గ్రూప్ లీజుకు తీసుకుంటుంది. ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టకుండా ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థల పెట్టుబడులతో నెలకొల్పిన మౌలిక సదుపాయాలను హస్తగతం చేసుకోవడమే అదానీ పని. సంపద, ఉత్పత్తి సృష్టించే పని చేయకుండా కొల్లగొట్టడమే అదానీ సంస్థ ఏకైక లక్ష్యం. దీనికి ప్రభుత్వ ప్రోత్సాహం, అండదండలు ఉంటాయి.

ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో మన దేశం కూడా ఒక భాగం. మనకూ విదేశీ పెట్టుబడులు వస్తుంటాయి, ఇతర దేశాల్లో మనమూ పెట్టుబడులు పెడుతాం. అదానీకి 30 దేశాల్లో వ్యాపారాలు, పెట్టుబడుల లావాదేవీలున్నాయి. మన దేశంలో అయితే అదానీని కాయడానికి మోదీ ఉన్నాడు. మరి ప్రపంచం మొత్తమ్మీద అదానీని కాయడానికి ఎవరుంటారు?. నిబంధనలకు విరుద్ధంగా అదానీ ఉంటే ఐఎంఎఫ్‌నో, వరల్డ్ బ్యాంకో కాయడానికి సిద్ధంగా ఉండదు కదా? భారత ప్రభుత్వం ప్రపంచ మదుపరులకు విశ్వాసం కలిగించలేని పక్షంలో భారతదేశానికి విదేశీ పెట్టుబడుల రాక తగ్గే ప్రమాదం ఉన్నది. తత్ఫలితంగా విదేశీ మారకద్రవ్యం, ఆర్థిక సంక్షోభాలు తలెత్తుతాయి. భారత ప్రభుత్వానికి అదానీ విశ్వాసం ఉంటే సరిపోదు, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంకుల విశ్వాసం కూడా అవసరం. అప్పుడే ప్రపంచ మదుపరుల విశ్వాసాన్ని పొందగలుగుతాం.

తాజాగా అదానీ వ్యవహారంతో కోల్పోయిన ప్రపంచ మదుపరుల విశ్వాసం పొందాలంటే ఆ దిశగా భారత ప్రభుత్వం నమ్మకం కలిగించాల్సిన అవసరం ఉన్నది. లేకుంటే దేశానికి నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉన్నది. మొత్తంగా ప్రభుత్వానికి అదానీ వ్యవహారం గుదిబండలా తయారైంది. అందుకే మోదీ ప్రభుత్వం లోన భయపడుతున్నా, బయటికి మాత్రం మాకేం సంబంధం లేదన్నట్టుగా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నది. అందుకే, అదానీ వజ్రాల వ్యాపారం మొదలుకొని స్టాక్‌మార్కెట్ దాకా జరుగుతున్న మోసాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలి. వారిని చైతన్యపరచాలి. హిండెన్‌బర్గ్ అదే చేసింది. అదానీ వ్యవహారం మొత్తం బయటపెట్టేసరికి రాజుగారి దేవతావస్త్రాల వలె దేశం ఒక్కసారిగా భగ్గుమన్నది. ఇందులో అసలు దేశంలో ఏం జరుగుతుందనే విషయమై ప్రజలు నిజాలను నిగ్గు తేల్చుకోవాల్సిన అవసరం ఉన్నది. ❋

14. భారతదేశ నిబంధనల ప్రకారం ఏ లిస్టెడ్ కంపెనీలోనైనా ప్రమోటర్ల వాటా **75 శాతం** మించకూడదు. తక్కిన **25 శాతం** ఇతరులు ఉండాలి. కాని ఏడింట్లో నాలుగు కంపెనీలు ఆ నిబంధనను అతిక్రమించాయి. దాంతో వాటిని డీలిస్ట్ చేసే ప్రమాదం దాపురించింది. (అంటే ఆ నాలుగు కంపెనీల షేర్లు ఇకముందు స్టాక్ మార్కెట్‌లో పాల్గొనడానికి వీలుండదు. వాటి షేర్లు కొన్నవారి పని అంతే)
15. మా పరిశోధనలో ఆ నాలుగు కంపెనీల్లో షేర్లను కలిగివున్నవారిలో అధిక శాతం ప్రమోటర్లు కాని ఇతరులే.
16. ఎలారా అనే విదేశీ ఫైనాన్సు కంపెనీకి అదానీ కంపెనీల్లో 3 బిలియన్ల డాలర్ల విలువ గల షేర్లు ఉన్నాయి. ఆ ఎలారా కంపెనీ నిర్వహించే మొత్తం నిధుల్లో ఇది 99 శాతం. అంటే ఆ షేర్లను అదానీ తనగుప్పెట్లో ఉంచుకున్నాడని స్పష్టం అవుతోంది. ఐతే ఆ లావాదేవీలు ఎలా జరిగాయంటే అంతిమంగా వాటి లబ్ధిదారులు ఎవరో బోధపడదు.
17. లీకైన కొన్ని ఇ మెయిల్స్ బట్టి ఈ ఎలారా అనే కంపెనీ సిఇవో పరారీలో ఉన్న ధర్మేశ్ దోషీ అనే ఎకౌంటెంట్ తో లావాదేవీలు నడిపాడు. ఆ ధర్మేశ్ దోషీ కేతన్ పారేఖ్‌తో కలిసి గతంలో స్టాక్‌మార్కెట్ కుంభకోణంలో సహనిందితుడుగా ఉన్నాడు. ఈ లావాదేవీలన్నీ పోలీసులు ధర్మేశ్ దోషీ కోసం వెతుకుతూ అతడు పరారీలో ఉన్నాడని ప్రకటించిన అనంతరమే జరిగాయి.
18. మాంటెరోసా ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ అనే మరో సంస్థ ఐదు వేరువేరు ఫండ్స్ నిర్వహిస్తోంది. వీటిలో 36,000 కోట్ల రూపాయల మేరకు అదానీ కంపెనీల్లో

**'మోదానీ' బాగోతం**

# అదానీ ప్రదేశ్‌గా ఆంధ్ర ప్రదేశ్



రచయిత ప్రజాశక్తి సంపాదకులు

**బి తులసీదాస్**

నరేంద్రమోడీ ప్రభుత్వం అదానీ గ్రూపునకు ఎస్‌బిఐతో సహా ప్రభుత్వరంగ బ్యాంకుల నుండి భారీ రుణాలను సమకూర్చడం, ఎల్‌ఐసి చేత వేలకోట్ల రూపాయల షేర్లను కొనిపించడం గురించి పుంఖాను పుంఖాలుగా కథనాలు మీడియాలో వస్తున్నాయి. అలాగే అదానీ గ్రూపు ఎదుగుదలలో తొలి మెట్టుగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు ప్రభుత్వ భూములను నాటి ముఖ్యమంత్రిగా మోడీ కారు చౌకగా అప్పగించిన వైనం గురించి విన్నాం. ఇంతింతై... అన్న రీతిలో దేశంలోని పలు పోర్టులు, ఎయిర్‌పోర్టులూ అదానీ గ్రూపు వశం కావడంలో బిజెపి ప్రభుత్వ పాత్ర గురించి మిగతా వ్యాసాల్లో పేర్కొన్నారు. అయితే, అదానీ గ్రూపు కోరల్లో ఆంధ్రప్రదేశ్ కూడా చిక్కుకున్న కొన్ని అంశాలు ఇక్కడ చర్చిద్దాం.

### పోర్టుల అప్పగింత

నెల్లూరు జిల్లా కృష్ణపట్నం మేజర్ పోర్టు, దాన్ని ఆనుకొని సెజ్ నిర్మాణానికి వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని, రైతుల నుండి భూసేకరణ జరిపి అప్పగించారు. అంతేగాక మిగతా పోర్టులకు మించి, అసాధారణమైన రీతిలో సముద్ర తీరంపై హక్కులను కూడా కల్పించారు. ఓబుళాపురం గనుల నుండి ముడి ఇనుప ఖనిజం విచ్చలవిడి ఎగుమతికి ఆ ప్రయివేటు పోర్టును అక్రమంగా వాడుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ముడి పామోలిన్, విదేశీ బొగ్గు, ఎరువులు, రసాయనాల దిగుమతి ద్వారా ఈ పోర్టులో విస్తారమైన లావాదేవీలు జరిగాయి. క్రమంగా విస్తరిస్తున్న ఆ మేజర్ పోర్టుపై అదానీ కన్నుపడింది. అంతే... 2018 అక్టోబర్ 10న ఐటి శాఖ కృష్ణపట్నం పోర్టు మీద, నవయుగ సంస్థ ఆఫీసుల మీద దాడులు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నవయుగ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చాయి. ఫలితంగా 2020 అక్టోబర్ 6న పోర్టులోని 75 శాతం వాటాలు అదానీ చేజిక్కించుకున్నారు. ఆ తరువాత దాంతో పాటు భూమి, అనుబంధ మెరైన్ హక్కులు అదానీ పరమైనాయి. ఆంధ్రప్రదేశ్‌లో అదానీ భూయజ్ఞం, మౌలిక వసతుల కబ్జా అలా మొదలైంది.

విశాఖపట్నం పోర్టుకు సమీపంలో ప్రధానంగా విశాఖ ఉక్కు పరిశ్రమ సంబంధిత ఎగుమతి, దిగుమతులు, సహజవాయువు దిగుమతి వంటివాటి కోసం గంగవరం పోర్టును నిర్మించారు. ఇందుకవసరమైన భూమిని ప్రభుత్వమే సేకరించి డివిఎస్ రాజు కుటుంబానికి అప్పగించింది. ఆ భూమి విలువను కూడా తక్కువగానే (నామమాత్రపు ధర) చూపి, పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి పది శాతం వాటా కల్పించారు. తద్వారా సంయుక్త యాజమాన్యంలోని పోర్టుగా రూపు దిద్దుకుంది. ప్రయివేటు పెత్తనంలో నడిచినా డైరెక్టర్లుగా ప్రభుత్వ ఉన్నతాధికారులున్నందున ప్రభుత్వం ఆయా సందర్భాల్లో నియంత్రించేందుకు అవకాశం ఉండేది. క్రమంగా గంగవరం పోర్టు కార్యకలాపాలు విస్తరించి, పూర్తిస్థాయి మేజర్ పోర్టుగా అవతరించింది.

విశాఖపట్నం పోర్టు మీద కూడా అదానీ పంజా విసిరే యత్నం చేశారు. అందులో భాగంగా ఆ పోర్టులో ఒక బెర్తు (ఓడల ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలు సాగించే

షేర్లు ఉన్నాయి. ఈ మాంటెరోసా కంపెనీ సిఇవో పరారీలో ఉన్న ఒక వజ్రాల వ్యాపారితో కలిసి 3 కంపెనీల్లో డైరెక్టర్‌గా ఉన్నాడు. ఆ పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి దాదాపు రు.8000 కోట్ల సొమ్ము ఎగవేసి పరారీ అయాడు. అతగాడి కొడుకుని వినోద్ అదానీ కుమార్తెకు ఇచ్చి వివాహం చేశారు.

19. అమి కార్ప్ అనే మరో సంస్థ 7 విదేశీ నెట్‌వర్క్ లను ఏర్పాటు చేసింది. వాటిద్వారా 17 డొల్ల కంపెనీలు స్థాపించింది. పైకి మ్యూచువల్ ఫండ్ మాదిరిగా కనిపించే ఈ కంపెనీల లావాదేవీలు మోసపూరితంగా మలేసియా వినియోగదారుల నుండి దాదాపు 450 కోట్ల డాలర్లు కాజేశాయి.

20. 2007లో సెబి ఒక రూలింగ్ ఇచ్చింది. దాని ప్రకారం అదానీ కేతన్ పారేఖ్‌తో కుమ్మక్కైనట్టు రుజువైంది. అందువలన అదానీ గ్రూపు సంస్థలను స్టాక్ మార్కెట్ నుంచి బహిష్కరించాలని ఆదేశించారు. కాని ఆ తర్వాత బహిష్కరణ స్థానే అపరాధ రుసుం విధించారు. ప్రభుత్వం ఏ విధంగా అదానీ విషయంలో మొదటినుంచీ మెతకగా ఉందో దీనిని బట్టి తెలుస్తున్నది.

21. అదానీ కంపెనీలు, వాటి అనుబంధసంస్థలు అన్నీ కలిపి 585 వరకూ ఉన్నాయి. ఈ మొత్తం కంపెనీల లావాదేవీలను కేవలం నలుగురు ఆడిటర్లు మాత్రమే చూస్తున్నారు. వారిలో 23, 24 సంవత్సరాల వయసు కలవారు కూడా ఉన్నారు. ఆడిట్ చేసే ఆఫీసులో మొత్తం 11 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. వీరికి అనుభవం లేదన్నది స్పష్టం. అంటే ఇదంతా నామక : జరిగే ఆడిట్ మాత్రమే.

❝ఈ క్రమంలోనే గంగవరం పోర్టును మింగేయాలని అదానీ గ్రూపు పథకం పన్నింది. ఆ పోర్టు డెవలపర్లయిన రాజు కుటుంబంపై ఒత్తిడి పెంచారు. అటు ప్రభుత్వాల నుండి మరోవైపు కార్పొరేట్ల ద్వారా వారిని ప్రభావితం చేశారు. చివరికి షేర్ల అమ్మక ఒప్పందం జరిగిపోయింది. అయితే, గంగవరం సంయుక్త యాజమాన్యంలోని పోర్టు కనుక రాష్ట్ర ప్రభుత్వ వాటాను కూడా తమకు అప్పగించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో మంత్రివర్గం చకచకా ఆ పని ముగించి, ఆ వాటాను కూడా అదానీకి కట్టబెట్టింది.❞

ప్రదేశం) అభివృద్ధి చేస్తానని విశాఖ పోర్టుతో అదానీ గ్రూపు ఒప్పందం చేసుకుంది. ఆ బెర్తు నిర్మాణం నిమిత్తం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి కోట్ల రూపాయల రుణం తీసుకుంది. ఆ బెర్తు ద్వారా సహజ వాయువు దిగుమతులకు ఉపయోగిస్తామని చెప్పిందే తప్ప అవసరమైన నిర్మాణం చేపట్టలేదు. ఏళ్ళు గడుస్తున్నా అటు బెర్తు నిర్మాణం చేయలేదు, ఇటు ఎస్‌బిఐకి చెల్లించాల్సిన రుణ వాయిదాను చెల్లించలేదు. దాంతో బ్యాంకు ఒత్తిడితేగా ఆ బెర్తు నిర్మాణం నష్టదాయకమని నిర్ణయానికొచ్చామని, వెచ్చించిన సొమ్ముకూడా వృధా అయిపోయిందని వాపోతూ విశాఖపోర్టుతో చేసుకున్న ఒప్పందాన్ని అదానీ గ్రూపు రద్దు చేసుకుంది. దాంతో అప్పు తీసుకున్న అదానీని వదిలేసి, భూయజమాని అయిన విశాఖ పోర్టు వారే రుణం తిరిగి చెల్లించాలని ఎస్‌బిఐ వెంటబడింది. మొత్తం మీద ప్రజలు బ్యాంకులో దాచుకున్న సొమ్ము అదానీ పాలు కాగా, ఆ వివాదం మాత్రం రెండు ప్రభుత్వరంగ సంస్థల మధ్య మిగిలిపోయింది.

ఈ క్రమంలోనే గంగవరం పోర్టును మింగేయాలని అదానీ గ్రూపు పథకం పన్నింది. ఆ పోర్టు డెవలపర్లయిన రాజు కుటుంబంపై ఒత్తిడి పెంచారు. అటు ప్రభుత్వాల నుండి మరోవైపు కార్పొరేట్ల ద్వారా వారిని ప్రభావితం చేశారు. చివరికి షేర్ల అమ్మక ఒప్పందం జరిగిపోయింది. అయితే, గంగవరం సంయుక్త యాజమాన్యంలోని పోర్టు కనుక రాష్ట్ర ప్రభుత్వ వాటాను కూడా తమకు అప్పగించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో మంత్రివర్గం చకచకా ఆ పని ముగించి, ఆ వాటాను కూడా అదానీకి కట్టబెట్టింది. ఆ విధంగా గంగవరం మేజర్ పోర్టు అదానీ గ్రూపు ప్రయివేటు ఆస్తిగా మారిపోయింది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి అవసరమైన ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలు దాని పరిధిలోకి వచ్చాయి. విశాఖ ఉక్కును కూడా కొనుగోలు చేయాలని పావులు కదుపుతోంది. తొలుత పోస్కో కంపెనీ గురించి ఊహాగానాలు వచ్చినా, ఇటీవల అదానీ కోసమే మోడీ సర్కారు ఉక్కు ప్రయివేటీకరణ ప్రయత్నమని అంటున్నారు.

మరోవైపున గంగవరం పోర్టు ద్వారా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహజవాయువు దిగుమతికి ఒప్పందం చేసుకుంది. కాని, అందుకు చట్టపరంగా అవసరమైన టెండర్లు పిలవడం, ఇతర నియమ నిబంధనలను కూడా పాటించలేదు. విశాఖపట్నం పోర్టులో బెర్తు అభివృద్ధి పేరిట రుణం పొంది, దాన్ని ఎగ్గొట్టిన అదానీ గ్రూపు నియమ నిబంధనలను ఉల్లంఘించి, ఐఒసితో ఒప్పందం చేసుకుంది. ఆ విధంగా తన లాభార్జన కోసం మరో ప్రభుత్వరంగ సంస్థను వాడుకుంది. చట్ట విరుద్ధంగా జరిగిన గంగవరం పోర్టు ఐఒసిల మధ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని పలువురు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా మోడీ సర్కారు కిమ్మనడం లేదు.

ఇదిలా ఉండగా శ్రీకాకుళం జిల్లాలోని భావనపాడు పోర్టు కూడా సింగిల్ టెండర్‌తో రాష్ట్ర ప్రభుత్వం అదానీ గ్రూపునకు అప్పగించింది. అక్కడి మత్స్యకార్లు భావనపాడులో ఫిషింగ్ హార్బర్ కావాలని కోరుతున్నారు. కీ॥శే॥ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శంకుస్థాపన చేయడమేగాక కొన్ని పనులు కూడా చేపట్టారు. తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు స్థానిక మత్స్యకారుల ప్రయోజనాలు కాకుండా కార్పొరేట్ల వ్యాపార ప్రయోజనాల కోసం పోర్టు నిర్మాణానికి ప్రయత్నిస్తున్నాయి. అందు కోసం తమ భూముల్ని కోల్పోవడమేగాక ఊళ్లు కూడా ఖాళీ చేయాల్సి రావడంతో స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. అయినా, పోర్టు నిర్మాణానికి భూములు ఇవ్వాల్సిందేనని సర్కారు పట్టుబడుతోంది.

**విద్యుత్ పేరిట...**

రాష్ట్రంలో సోలార్, విండ్ పవర్ పేరిట ప్రభుత్వం అనంతపురం, కడప, కర్నూలు, ప్రకాశం మొ॥ జిల్లాల్లో వేలాది ఎకరాల భూముల్ని కంపెనీలకు అప్పగిస్తోంది. ఇందులో అత్యధిక భాగం అదానీ గ్రీన్ పవర్‌కే దక్కుతోంది. చిత్రమేమిటంటే హిండెన్‌బర్గ్ రిసెర్చ్ నివేదిక వెల్లడయ్యాక మొత్తం అదానీ గ్రూపు అతలాకుతలం అయిపోయి షేర్ల విలువ అమాంతం పడిపోయిన నేపథ్యంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం వారికి భూములు కట్టబెడుతోంది. జనవరి 25న హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడికాగా ఫిబ్రవరి 8న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అనంతపురం జిల్లాలో 406 ఎకరాలు, కడప జిల్లాలో 470 ఎకరాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 362 ఎకరాలను అదానీ గ్రీన్‌కు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఊరందరిది ఒకదారీ ఉలిపికట్టెది మరోదారి అన్న చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

పంప్ట్ స్టోరేజి పవర్ ప్రాజెక్టుల పేరుతో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రాంతంలోనూ అదానీ గ్రూపునకు భూముల్ని, జలవనరుల్ని అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణం. ఏజన్సీ (5వ షెడ్యూలు) ప్రాంతంలో గిరిజనులకున్న ప్రత్యేక హక్కులను కూడా సర్కారు కాలరాయడం శోచనీయం. అటవీ హక్కుల చట్టాన్ని కూడా తొత్తడం చేస్తున్నారు. అక్కడ ఎలాంటి ప్రాజెక్టు నిర్మించాలన్నా స్థానిక గిరిజనులతో కూడుకున్న గ్రామసభ ఆమోదం ముందుగా పొందాలని పీసా చట్టం స్పష్టంగా పేర్కొంది. ఏజన్సీ ప్రాంతంలోని సహజ వనరులపై గిరిజనులకు, వారితో కూడుకున్న సహకార సంస్థలకు తప్ప వేరెవ్వరికీ ఆస్తి హక్కు వుండబోదని సమతా కేసు తీర్పులో సుప్రీం కోర్టు పేర్కొంది. రాజ్యాంగాన్ని, చట్టాలను, సుప్రీం కోర్టు తీర్పులను కాదంటూ ప్రభుత్వం అదానీ పట్ల అంతగా మక్కువ చూపుతోంది.

అయితే, ఈ పంప్డ్‌స్టోరేజి ప్లాంట్ల వల్ల కేవలం ఏజన్సీ ప్రాంతాలకు, పర్యావరణానికి, గిరిజనులకేగాక దిగువనున్న తాండవ ఆయకట్టుకు, రైవాడ రిజర్వాయర్‌పైనా ప్రతికూల ఫలితాలు వస్తాయని తాజాగా నీటి పారుదల శాఖ నివేదిక రూపొందించింది. అటు గిరిసీమల ప్రకృతి వనరులకు ముప్పుతోపాటు దిగువన పంటలకు కూడా ప్రమాదం పొంచి వుందన్న విషయం తెలిసినా అదానీ కోసం సర్కారు మరింత వేగం పెంచడం గమనార్హం.

అదానీ గ్రూపు కోసం రాష్ట్రంలోని భూములు, సహజవనరులను ధారపోయడమేగాక ఆర్థిక వనరులను సమకూర్చడానికీ సర్కారు పూనుకుంది. ఎక్కడో రాజస్థాన్‌లో అదానీ గ్రూపు సోలార్ పవర్ ఉత్పత్తి చేస్తుంటే దానికి మార్కెట్ కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం నడుం

(మిగతా 21వ పేజీలో)

**ప్రత్యామ్నాయ సంస్కృతి-1**

# విస్తరిస్తున్న పెట్టుబడిదారీ సంస్కృతి



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

**ఎస్ వీరయ్య**

కార్మికవర్గం, కమ్యూనిస్టు ఉద్యమం ప్రత్యామ్నాయ సంస్కృతి నిర్మించాలన్న చర్చ జరుగుతున్నది. దేనికి ప్రత్యామ్నాయం? ఇప్పుడు ప్రజలను ఆవహించి ఉన్న సంస్కృతి స్వభావం ఏమిటి? ఈ ప్రశ్నలకు జవాబు అవసరం. అప్పుడే దీని వల్ల కార్మికవర్గానికీ, కష్టజీవులకు నష్టమేమిటో అర్థం చేసుకోగలం. ప్రత్యామ్నాయం అవసరమేమిటో కూడా స్పష్టత వస్తుంది. అనేక సందర్భాలలో ప్రత్యామ్నాయ సంస్కృతి కావాలన్న ఆకాంక్ష ఉన్నా స్పష్టత ఉండటంలేదు.

ప్రస్తుతం ఆధిపత్యంలో ఉన్న సాంస్కృతిక విలువలు అర్థం కావాలంటే, మన నిత్య జీవితం నుంచే అనేక అనుభవాలు పరిశీలించవచ్చు. ప్రతినెలా మొదటివారంలో వేతనం అందగానే సరుకులు కొనటం ఆనవాయితీ. కుటుంబానికి అవసరమైన సరుకుల చిట్టా రాసుకుని, కిరాణం దుకాణంలో కొనుగోలు చేయటం ఒకప్పటి పద్ధతి. ముప్పయి ఏండ్ల క్రితం ప్రతి కుటుంబానికి ఇది సహజ ప్రక్రియ. రైతు కుటుంబాలలో మొదటి వారానికి ప్రాధాన్యత లేదు. కానీ ఏ సరుకు ఎంత అవసరమో రాసుకుని కొనుగోలు చేయటం, అవసరమైతే ఖాతా తెరవటం కూడా మామూలే. అవసరాలూ, ఆదాయం పరిమితుల్లో కుటుంబానికి అవసరమైన సరుకులు కొనుగోలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి వేగంగా మారుతున్నది. షాపింగ్ ఒక అలవాటుగా మారుతున్నది. కొందరు డబ్బున్నవారికి అది వ్యామోహం (ఫ్యాషన్) కూడా. 'షాపింగ్‌కు పోదాం... వస్తావా?' అని సినిమాకు పోదామా అన్నంత సహజంగా అడగటం చూస్తున్నాం. 'ఓ... దాందేముంది? పోదాం' అని పోతున్న తీరూ చూస్తున్నాం. తిరిగి వచ్చేటపుడు మాత్రం తోడుగా వెళ్ళినవారు కూడా కొన్ని సరుకులతో రావటం మామూలైంది. ప్రత్యేకమైన అవసరం లేకపోయినప్పటికీ, వ్యాపార ప్రకటనలూ, పెద్ద పెద్ద మాల్స్‌లో సరుకులు చూసి ఆకర్షితులై కొనుగోలు చేస్తున్నారు.

సమాజంలో పండుగలు, సంప్రదాయాల పేరుతో రకరకాల వేడుకలు, సంబురాలు జరుపుకోవటం సహజం. వాటి పుట్టుక, ప్రాసంగికత (రెలవెన్స్), శాస్త్రీయతలతో నిమిత్తం లేకుండా పెరుగుతున్నాయి. సమాజంలో విద్య, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో నిమిత్తం లేకుండా, ఉచితానుచితాల విచక్షణ లేకుండా విస్తరిస్తున్నాయి.




కొనడం కోసమే పుట్టాడు

ఆడంబరాలుగా మారుతున్నాయి. శక్తికి మించిన ఖర్చులు చేస్తున్నారు. దర్పం ప్రదర్శించేందుకు అప్పులకైనా వెనుకాడటం లేదు. వీటన్నింటిలో దండలో దారంలాగా పెరుగుతున్నది సరుకుల అమ్మకాలే!

మనుషుల అవసరాలు తీర్చే సరుకులు ఉత్పత్తి చేసి లాభం గడించటం ఒక పద్ధతి. కానీ ఇప్పుడు సరుకులు ఉత్పత్తి చేస్తూ, వాటికి కొనుగోలుదార్లను సృష్టించటం, తయారుచేయటం చూస్తున్నాం. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్నకొద్దీ క్రమంగా రెండవ పద్ధతి కూడా ముందుకొస్తుందని పెట్టుబడి గ్రంథంలో మార్క్స్ చెప్పాడు. ఇప్పుడు ఉదారవాద ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ కాలంలో జరుగుతున్నది అదే కదా!

ఏడాదిలో ప్రతి రోజుకూ ఏదో ఒక ప్రత్యేకత ఆపాదించే ప్రయత్నం జరుగుతున్నది. అదొక వేడుకగా ప్రోత్సహించటం కూడా చూడవచ్చు. ప్రసార సాధనాలు, సామాజిక మాధ్యమాలు వీటికి వేదికలుగా మారుతున్నాయి. పుట్టినరోజు, పెండ్లిరోజు వంటివి సమాజంలో కొన్ని కుటుంబాలు మాత్రమే జరుపుకునేవి. కానీ ఇప్పుడు అవే కాదు.. ప్రేమికుల రోజు, తల్లుల రోజు, తండ్రుల రోజు, స్నేహితుల రోజు, షష్టి పూర్తి.. ఒక్కటేమిటి? అనేక పేర్లతో సమాజంలో శుభాకాంక్షలు చెప్పుకోవటం నుంచి బహుమతులు ఇవ్వటం, సంబురాలు జరుపుకోవటం కూడా విస్తరిస్తున్నది. ఇవేనా! పిల్లలను గడప దాటించే రోజు, చీర కట్టించే రోజు, ఓణీలు వేసే రోజు, పంచె కట్టే రోజు.. ఇట్లా గతంలో అత్యధిక కుటుంబాలలో కనీసం ఆచరించనివి కూడా ఇప్పుడు అలవాటుగా మారుతున్నాయి. వీటన్నింటిలోనూ అంతర్లీనంగా ఉన్నదీ.. వృద్ధి చెందుతున్నదీ సరుకుల అమ్మకాలే.

సరుకుల పట్ల ఆకర్షితులను చేయటం, మోజు పెంచటం, తహతహలాడేటట్టు పురికొల్పటం ఒక ధోరణిగా మారుతున్నది. ఆదాయం సరిపోదు కదా! ఆదాయపు వేటలో ఒక వృత్తికి లేదా నిర్ణీత సమయానికి పరిమితం కాకుండా అదనపు సమయం పనిచేయటం, అదనపు వృత్తులు లేదా ఉపాధి అవకాశాలు వెతుక్కోవాల్సిన స్థితికి నెట్టబడుతున్నారు. ఆదాయపు వేటలో కుటుంబ జీవితం కూడా ప్రభావితమవుతున్నది. అయినా ఆదాయం చాలదు. అప్పులైనా చేయాలి. చిట్టీలు వేయాలి. ముందే ఎత్తుకోవాలి. సరుకులు కూడా వాయిదా పద్ధతిలోనైనా కొనాలి. 'అప్పులు' అనే పేరు స్థానంలో ఇప్పుడు గౌరవప్రదమైన 'సులభ వాయిదాలు' అనే కొత్త పదం వాడుకలోకి వచ్చింది. అవి చిట్టీలు కట్టడమైనా, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లైనా, వాహనాల కొనుగోళ్ళయినా.. అన్నీ వాయిదాలే కదా! డబ్బు చేతికి

> **"ఎంత సంపాదిస్తే అంత గొప్ప! అంత సమర్థుల కింద లెక్క! ఎంత సంపాదించావన్నదే ముఖ్యం... ఎట్లా సంపాదించావన్న దానితో సంబంధం లేదు. నీతీ, నిజాయితీలకు స్థానం లేదు. ఇంకా చెప్పాలంటే పాత నీతీ, నియమాలకు విలువ లేదు. ఇప్పుడు సంపాదించటమే నీతి! ఒకప్పుడు పొదుపు చేయటం, పొదుపుగా ఖర్చు పెట్టటం 'తెలివైన' కుటుంబం అనుసరించే పద్ధతి. గౌరవప్రదమైన జీవన విధానం. ఇప్పుడు ఖర్చు చేయటమే నీతి."**

వచ్చినట్టే వచ్చి వాయిదాల రూపంలో మాయమవుతుంది.

విద్య, వైద్యం కుటుంబంలో అతి పెద్ద ఖర్చుగా మారాయి. ప్రయివేటు వైద్యం పెరిగి, ఇన్సూరెన్స్ లేకుండా బతకలేమన్న వాతావరణం ఏర్పడుతున్నది. విద్యా రంగంలోనూ ప్రయివేటీకరణతో భారం పెరిగింది. ఈ రెండూ ప్రభుత్వ బాధ్యతగా భావించటంలేదు. ఎవరి అవసరాలు వారే చూసుకోవాలి. డబ్బు చెల్లించి కొనుగోలు చేయాలి. సామాజిక బాధ్యతగా ఉండవల్సిన విద్యా, వైద్యం కూడా సరుకులుగా మారాయి. విద్యార్థులు కూడా సెలవుల్లో సంపాదించాలి. ఖాళీ సమయాలలో ఏదో ఒక తాత్కాలిక వృత్తి చేయాలి. పాకెట్ మనీ కూడా సమకూర్చుకోవాలి. ఇప్పుడు స్విగ్గీ, జొమాటో, ర్యాపిడో, ఓలా, ఉబర్ లాంటి రంగాలలో విద్యార్థుల సంఖ్య, పోటీ పరీక్షలు రాసేవారి సంఖ్య గణనీయంగా ఉన్నది. వీరికి చదవటం, ఇందుకోసం సంపాదించటం తప్ప... ఇక విశ్రాంతి, వినోదం, ఆటపాటలకు సమయమే దొరకదు.

పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన ప్రాధాన్యత గురించి ప్రపంచమంతా చర్చ జరుగుతున్నది. మన దేశంలో కూడా ఈ చర్చ ఊపందుకుంటున్నది. ఇది మంచిదే. కానీ దీపావళి సందర్భంగా మాత్రం పర్యావరణ చైతన్యం పని చేయదు. దాని గురించిన చర్చ కూడా వెనక్కి పోతుంది. ప్లాస్టిక్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వంటివి వాడకం మీద కూడా చర్చ బాగానే జరుగుతుంది. తీరా వినాయక చవితి సమయానికి ఈ విషయం వెనక్కి పోతుంది. బాణాసంచా, ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ఉత్పత్తి చేసే పెట్టుబడిదారులకూ, సరఫరా చేసే వ్యాపారులకూ పర్యావరణం సమస్య పట్టదు. వారికి కావల్సింది లాభం. పాలకులకూ, పోలీసులకూ లంచం ఇచ్చి సర్దుబాటు చేసుకోగలరు. చట్టాలు కూడా వారి చుట్టాలే. వారినేమీ చేయజాలవు. ఇంతెందుకు? యువతనూ, విద్యార్థులనూ పక్కదారులు పట్టిస్తున్న డ్రగ్స్, మద్యం తదితర మత్తు పదార్థాలు ఉత్పత్తి చేసే పెట్టుబడిదారులకూ, సరఫరా చేసే వ్యాపారులకు సామాజిక బాధ్యత ఏమాత్రం పట్టదు. వారికి కావల్సింది లాభం. అందుకే ఉత్పత్తి చేసి అమ్మకానికి పెడతారు. సమాజం ఏమైనా వీరు పట్టించుకోరు. వారి దృష్టిలో ఇవన్నీ సరుకులు. ఉత్పత్తి చేసి, మార్కెట్‌లోకి వదిలి లాభాలు దండుకోవటమే వారి లక్ష్యం.

సరుకుల కొనుగోలుకు డబ్బు కావాలి. అందుకే.. సంపాదించటం, ఖర్చు చేయటం 'స్టేటస్ సింబల్'గా మారింది. డాబుసరి ప్రదర్శించటం, గొప్పలు పోవటం హోదాగా గుర్తింపు పొందుతున్నది.

ఎంత సంపాదిస్తే అంత గొప్ప! అంత సమర్థుల కింద లెక్క! ఎంత సంపాదించావన్నదే ముఖ్యం... ఎట్లా సంపాదించావన్న దానితో సంబంధం లేదు. నీతీ, నిజాయితీలకు స్థానం లేదు. ఇంకా చెప్పాలంటే పాత నీతీ, నియమాలకు విలువ లేదు. ఇప్పుడు సంపాదించటమే నీతి! ఒకప్పుడు పొదుపు చేయటం, పొదుపుగా ఖర్చు పెట్టటం 'తెలివైన' కుటుంబం అనుసరించే పద్ధతి. గౌరవప్రదమైన జీవన విధానం. ఇప్పుడు ఖర్చు చేయటమే నీతి. అందుకోసం తగిన వనరుల వేటలో పడటమే 'తెలివైన' వారి లక్షణం! ఎంత ఖర్చు పెడితే అంత గొప్ప.. అంతటి హోదా! మార్కెట్లో సరుకులు అమ్ముడుపోవాలి. అందుకు ఖర్చు చేయటమే ప్రోత్సహించాలి. అప్పుడే లాభాల పంట పండుతుంది. అందుకే సరుకుల వ్యామోహం పెంచటమే పెట్టుబడిదారీ నీతి. ఈ క్రమంలోనే సగటు మనిషి ఆలోచనా విధానంలో కూడా మార్పులు గమనించవచ్చు. ఇంట్లో పడకగదీ, వంటగదీ, హాల్ ఉంటే... మొదటి ప్రాధాన్యత హాల్‌ను తీర్చిదిద్దటం మీదనే ఉంటున్నది. వేలు ఖర్చు చేస్తున్నారు. పదిమంది వచ్చిపోతుంటారనీ, తమ హోదా తక్కువగా వారు భావించకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. తమకు అత్యవసరంగా ఉండి, సౌకర్యాలిచ్చే పడకగది, వంటగదిలో ఏర్పాట్లకు ద్వితీయ ప్రాధాన్యత గమనించవచ్చు.

సంపాదించే డబ్బు మాత్రమే ఈ సరుకుల కొనుగోళ్ళకు చాలదు. అప్పు చేయాలి. అప్పులిచ్చే సౌకర్యాలు పెరగాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ అవసరమిది. పాతకాలపు ఫ్యూడల్ సమాజంలో అప్పులు చేయటం చేతగానితనం... అవమానకరం. అప్పులపాలైతే అసమర్ధుని జీవనయాత్రగానే పరిగణించేవారు. ఆ లక్షణం ఇప్పటికీ రైతులలో కనిపిస్తుంది. అప్పు ఇచ్చినవారు ఇంటిముందు నిలవేస్తే... అవమాన భారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అప్పు తీర్చలేనపుడు పెట్టుబడిదార్లు అవమానకరంగా భావించరు. ఎగ్గొట్టడానికి ఏమాత్రం సిగ్గుపడరు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అప్పులు చేయటం కూడా గొప్పతనమే! దేశంలో సుమారు రు.19 లక్షల కోట్లు అప్పు ఎగవేసిన ఘనులంతా బడా బాబులే కదా! వేలకోట్ల అదానీ కుంభకోణంతో జనమంతా ప్రశ్నిస్తున్నా అదానీ ఏమాత్రం బిడియం ప్రదర్శించటం లేదు కదా. ఎగ్గొట్టే సౌకర్యం బడా బాబులకు మాత్రమే సుమా! వారికి ఎగ్గొట్టే సౌకర్యం లేకపోతే అభివృద్ధి కుంటుబడుతుందంటారు ఆర్థికవేత్తలు. సాధారణ ప్రజలు ఎగ్గొడితే సోమరితనం వస్తుందని కూడా వీరే అంటారు. అందువల్ల కొనుగోళ్ళకు అలవాటు పడటం, అప్పులు చేయటమే తప్ప ఎగ్గొట్టే సౌకర్యం వీరికి ఉండదు. ఇప్పుడు అప్పు చేయటం కూడా గొప్పతనమే. అప్పు చేసైనా ఖర్చు చేయాలి. సరుకుల అమ్మకాలు పెరగాలి. అందుకు మార్కెట్లో డబ్బు చలామణీ పెరగాలి. అందుకోసమే అప్పు సౌకర్యాలు కూడా ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. సాధారణ ప్రజలు ఇప్పుడు రోజువారీ అవసరాల కోసం, అప్పుకోసం వడ్డీ వ్యాపారుల చుట్టూ లేదా బ్యాంకుల చుట్టూ తిరగనవసరం లేదు. క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు జేబులోనే మకాం పెడుతున్నాయి. ఎంత వడ్డీ కడుతున్నామన్న స్పృహ లేదు. సమయానికి డబ్బు అందుబాటులోకి వస్తున్నది. అంతే చాలు! జేబులో నగదు లేదన్న భయం కూడా లేదు. డిజిటల్ చెల్లింపులు సౌకర్యవంతంగా ఉన్నాయి. అప్పుల సౌకర్యం కల్పించటం, సరుకులు కొనిపించటం... అప్పు ఒక అలవాటుగా మారుతున్నది.

పెట్టుబడిదారులూ, వ్యాపారులూ, కాంట్రాక్టర్లూ, బూర్జువా పార్టీల నాయకులూ

తమ కుటుంబాలలో వేడుకలు కూడా తమ హోదా ప్రదర్శనకు వేదికలుగా మలుచుకుంటు న్నారు. వ్యాపార సామ్రాజ్య విస్తరణకు, రాజకీయ ప్రయోజనాలకు అవసరమైన సంప్రదింపులకు కూడా ఈ సందర్భాలను వినియోగించుకుంటున్నారు. ఇలాంటి ప్రభావాలు సమాజాన్ని ఆవహిస్తున్నాయి. సాధారణ ప్రజల సంప్రదాయ సాంస్కృతిక సంబంధాల స్థానంలో వ్యాపార సంబంధాలు చొరబడుతున్నాయి.

సమాజంలో ప్రతిదీ సరుకుగా మారుతున్న కొద్దీ పెట్టుబడిదారీ ప్రయోజనమే కేంద్ర బిందువుగా మారుతున్నది. 'లాభం' ప్రధాన మవుతున్నది. డబ్బుతో ఏమైనా కొనవచ్చునన్న ధీమా ఏర్పడుతున్నది. డబ్బే సర్వం.. అంతా డబ్బుమయం! అందుకే సంపాదించటమే నీతిగా మారుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థలో 'లాభం' చట్టబద్ధమైంది. అంటే శ్రమదోపిడీ చట్ట బద్ధమైంది.

లాభం సంపాదించటం ప్రజామోదం పొందింది. డబ్బు సంపాదించటమే నీతిగా మారింది. ఫలితంగానే పెట్టుబడిదారీ వ్యవస్థ అవినీతికి మూలంగా మారింది. స్త్రీ పురుష సంబంధాలతో సహా, అన్నీ డబ్బు సంబంధాలు గానే మారుతున్నాయి. 'సెక్స్' కూడా ఒక సరుకుగా మారింది. ఒళ్ళు అమ్ముకుని పొట్ట పోసుకునే అవసరం లేని సమాజం నిర్మించటం పెట్టుబడిదారులకు అవసరం లేదు. సెక్స్ వర్కర్ల పేరుతో లైసెన్స్ ఇవ్వటమే వారికి ప్రయోజన కరం. వ్యభిచారాన్ని చట్టబద్ధం చేయటం పెట్టు బడిదారీ వ్యవస్థ లక్షణం. ఓటు సరుకుగా మారింది. ఎన్నికల్లో పోటీకి 'టికెట్', పార్టీలో, ప్రభుత్వంలో పదవి కూడా సరుకుగా మారు తున్నది. అన్ని వ్యవస్థలనూ అవినీతి ఆవహిం చింది. 'లంచం తిననివారెవరు?' అన్నది సాధారణ ప్రజల మాటగా మారింది. 'తిన్నా.. పని చేసిపెట్టేవారు కావాలన్న' ధోరణి విస్తరిస్తున్నది. అవినీతి సహజం అని ప్రజలు నమ్మే విధంగా ప్రభావితం చేసే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. మారుమూల ప్రాంతాలకు కూడా పెట్టుబడిదారీ, వ్యాపార సంబంధాలు విస్తరిస్తున్న కాలం ఇది. అన్ని రంగాలనూ వ్యాపార ధోరణులు పెనవేసుకుంటున్న రోజులివి. అందుకే అన్నిరకాల అవలక్షణాలు విస్తరిస్తున్నాయి. ఈ పరిస్థితులన్నీ పెట్టుబడి దారుల ప్రయోజనాలనే కాపాడుతున్నాయి. ఇందుకనుగుణంగానే నీతీ, నియమాలు మారుతున్నాయి. ప్రజామోదం పొందేవిధంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇదే పెట్టుబడిదారీ సంస్కృతి. ఇదే వినిమయదారీ సంస్కృతి (కన్స్యూమరిజం). "సంపాదించు.. అను భవించు.. ఆనందించు.." ఇదే వినిమయదారీ సంస్కృతి. దీని విస్తరణలో పత్రికలూ, ప్రసార సాధనాలూ, సాహిత్యం, సినిమా వంటి రంగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తరణలో ఇవి సాధనాలుగా ఉన్నాయి. వీటి ప్రభావం ప్రజల మీద తీవ్రంగా ఉంటుంది కదా! ప్రజల మీదనే కాదు.. సమాజాన్ని మార్చాలని ప్రయత్నించే సామాజిక కార్యకర్తలు కూడా ఈ ప్రభావాల నుంచి దూరంగా వెళ్ళటం సాధ్యం కాదు. వీటిని అర్థం చేసుకుని, తట్టుకుని నిలబడటం ఎట్లా అన్నదే పరీక్ష.

> **"సమాజంలో ప్రతిదీ సరుకుగా మారుతున్న కొద్దీ పెట్టుబడి దారీ ప్రయోజనమే కేంద్ర బిందువుగా మారు తున్నది. 'లాభం' ప్రధాన మవుతున్నది. డబ్బుతో ఏమైనా కొనవచ్చునన్న ధీమా ఏర్పడుతున్నది. డబ్బే సర్వం.. అంతా డబ్బుమయం! అందుకే సంపాదించటమే నీతిగా మారుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ లో 'లాభం' చట్ట బద్ధమైంది. అంటే శ్రమదోపిడీ చట్ట బద్ధమైంది."**



లాభార్జన కోసం పురుషాధిక్యతను వాడుకోవటం కూడా పెట్టుబడిదారీ నీతిగా మారింది. స్త్రీలకు తక్కువ వేతనం ఇస్తున్నారు. భవన నిర్మాణరంగం లాంటి అసంఘటిత రంగంలోనే కాదు, అనేక పరిశ్రమలలో కూడా మహిళలకు తక్కువ వేతనాలు ఇవ్వటం గమనించవచ్చు. సినిమా రంగంలో కొట్టొచ్చినట్టు దీని ప్రభావం కనిపిస్తుంది. కంపెనీలలో అధికారులూ, కాంట్రాక్టర్లూ ఉపాధి అవకాశం కల్పించే పేరుతో లైంగిక దోపిడీకీ వెనుకాడటం లేదు. ఇందుకోసం 'లైంగిక స్వేచ్ఛను' ప్రోత్సహించడానికీ ఈ వ్యవస్థ వెనుకాడదు. పబ్బుల సంస్కృతిని పెంచిపోషి స్తున్నది ఈ వ్యవస్థే కదా! 'స్త్రీ'ని వ్యాపార సరుకుగా మార్చుతున్నదీ, వ్యాపార ప్రకటనలలో సాధనంగా ఉపయోగించుతున్నదీ ఈ పెట్టుబడి దారీ వ్యవస్థే కదా!

ఈ సమాజంలోనే కమ్యూనిస్టు పార్టీ, అభ్యుదయవాదులూ పని చేస్తున్నారు కదా! ఈ విలువల ప్రభావం పడటం సహజం. కమ్యూ నిస్టు, వామపక్ష, ఇతర అభ్యుదయవాదులను ఇవి ఏయే రూపాలలో ప్రభావితం చేస్తున్నాయో పరిశీలించాలి. ఆ ప్రభావాలు దోపిడీ వ్యవస్థ మీద చేస్తున్న పోరాటాలకు ఎలాంటి ఆటంకాలు కలిగిస్తున్నాయో అధ్యయనం చేయాలి.

❋

చరిత్ర

# శుంగ, కళింగ, శాతవాహన సామ్రాజ్యాలు, దక్షిణాపథం



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

ఎం.వి.ఎస్.శర్మ

మౌర్యవంశ రాజుల్లో చివరివాడు బృహద్రధుడు. క్రీ.పూ. 185 ప్రాంతంలో ఇతడి సేనానిగా ఉన్న పుష్యమిత్రుడు బృహద్రధుడిని కూలదోసి తనను రాజుగా ప్రకటించుకున్నాడు. అక్కడినుంచి శుంగవంశ పాలన మొదలైంది. ఈ వంశంలో ఆరోవాడైన ధనదేవుడి కాలంలో (క్రీ.పూ.ఒకటవ శతాబ్దం) అయోధ్యలో లభించిన శాసనంలో పుష్యమిత్రుడు రాజైన తర్వాత రెండు అశ్వమేధయాగాలను నిర్వహించాడని ఉంది. క్రీ.పూ.150లో జీవించిన వ్యాకరణ పండితుడు పతంజలి తన రచనల్లో పుష్య మిత్రుడు నిర్వహించిన అశ్వమేధ యాగాల గురించి ప్రస్తావించాడు. కాళిదాసు రచించిన కావ్యం 'మాళవికాగ్నిమిత్రం'లో కూడ పుష్య మిత్రుడి యాగాల ప్రస్తావన ఉంది.

గ్రీకు రాజులు, శక రాజులు తమ తమ పాలనా కాలాల్లో తమ పేర్లతో నాణేలు ముద్రించారు. కనుక వారి పాలనాకాలం గురించి స్పష్టమైన ఆధారాలుగా అవి పని చేశాయి. కాని శుంగ వంశపు రాజులు ముద్రించిన నాణేలమీద వారి వ్యక్తిగత వివరాలు ఏవీ లేవు. కాబట్టి దొరికిన శిలా శాసనాలే ప్రధాన ఆధారాలు అయాయి. వాటిని పురాణాల గాథలతో సరిపోల్చి చరిత్రకారులు కొన్ని నిర్ధారణలకు రాగలిగారు. విదిశ పట్టణం (ప్రస్తుతం బేస్‌నగర్) లో క్రీ.పూ. 115-83 మధ్య కాలంలో శుంగవంశపు రాజు భగభద్రుడు పరిపాలించాడు. ఇతని కాలంలో గ్రీకు రాజు ఆంటియాల్సిడాస్ తరఫున రాయబారిగా వచ్చిన హీలియోడొరస్ విదిశలో ఒక శిలాశాసనం స్థాపించాడు. ఆ విదిశ శుంగ రాజ్యానికి రాజధానిగా ఉండేది. ఇది సాంచీ సమీపంలో ఉంది. అక్కడే శుంగరాజులు జారీ చేసిన శిలాశాసనాలు కూడా దొరికాయి. అప్పటికే శుంగ రాజ్యం క్రమంగా బలహీనపడడం మొదలైంది. ఎక్కడికక్కడ స్థానిక రాజులు తయారయ్యారు.

శుంగ రాజులు బౌద్ధం పట్ల వ్యతిరేకతను కలిగివుండేవారనీ, కొన్ని బౌద్ధ ఆరామాలను కూడా ధ్వంసం చేశారనీ బౌద్ధగ్రంథం దివ్యవాదనలో ప్రస్తావించారు. ఐతే దీనిని ధృవపరిచే ఇతర ఆధారాలేమీ లభించడం లేదు. శుంగ రాజుల కాలంలోనే బర్హుత్ వద్ద బౌద్ధ స్తూపం, దాని చుట్టూ ప్రాకారం నిర్మించడం జరిగిందనడానికి మాత్రం దాఖలాలు ఉన్నాయి. ఈ కాలం నాటికి కనపడిన ఒక కొత్త ధోరణి ఏమంటే రాజు తాను పుట్టిన కులం పవిత్రమైనదని చెప్పుకోడానికి ఆరాటపడేవాడు. ఉన్నత బ్రాహ్మణ కులానికి చెందిన స్త్రీ గర్భాన జన్మించడం పాలకుడి అర్హతకు సంకేతంగా పరిగణించబడేది. తల్లి కులం తర్వాతనే తండ్రి కులానికి ప్రాధాన్యత వచ్చేది. భగభద్రుడు కౌతశి గోత్రానికి చెందిన బ్రాహ్మణ స్త్రీకి జన్మించాడని బేస్‌నగర్ శాసనాలలో ఉంది. అతని యువ రాజు ధనభూతి, వత్స గోత్రానికి చెందిన బ్రాహ్మణ స్త్రీకి జన్మించినట్టు నమోదైంది. మౌర్యుల అనంతర కాలంలోబ్రాహ్మణ మతం, కుల వ్యవస్థ మరింత విస్తరించిన దాఖలాలు దీనిని బట్టి తెలుసుకోవచ్చు.

## కళింగ సామ్రాజ్యం

క్రీ.పూ. 262 లో జరిగిన కళింగ యుద్ధంలో అశోకుడు కాళింగులను ఓడించి రాజ్యాన్ని కైవసం చేసుకున్నాడు. ఆ తర్వాత మళ్ళీ కాళింగులు ఎప్పుడు స్వతంత్ర రాజ్యాన్ని సాధించుకున్నదీ స్పష్టమైన ఆధారాలు లేవు.

ఒడిశా లోని హాథిగుంప వద్ద బైటపడిన ఖారవేలుడి శిలా శాసనం చాలా విలువైన సమాచారాన్ని అందజేసింది. ఒక బలమైన కళింగ సామ్రాజ్యం గురించిన వివరాలు దాని ద్వారా లభ్యమయ్యాయి. 'కళింగాధిపతి' అయిన ఖారవేలుడి రాజ్యంలో వరుసగా పదమూడు సంవత్సరాలపాటు జరిగిన ముఖ్యమైన చారిత్రిక ఘట్టాలు అందులో పొందుపరచబడ్డాయి. ఆ శాసనం క్రీ.పూ. 20 నాటిది.

తాను మహామేఘవాహన వంశానికి చెందినవాడినని ఖారవేలుడు ప్రకటించుకున్నాడు. కళింగ ప్రాంతాన్ని పాలించడానికి మౌర్యులు తోశాలి ని కేంద్రంగా చేసుకున్నారు. అది మహానది డెల్టా ప్రాంతంలో ఉంది. దాని సమీపంలో ఉదయగిరి కొండలు ఉన్నాయి. అదే ఉదయగిరి కొండల సమీపం లోనే వాకాదపుడు అనే ఇంకొక కళింగరాజు కాలంలో రూపొందిన ఇంకో శిలా శాసనం కూడా దొరికింది. అతను కూడా తాను కళింగాధిపతిని అని, తానూ మహామేఘవాహన వంశానికి చెందినవాడినని ప్రకటించుకున్నాడు. గోదావరి నదికి దక్షిణాన గుంటుపల్లి వద్ద దొరికిన ఇంకొక శిలా శాసనంలో సాదుడు అనే ఇంకొక కళింగాధిపతి గురించిన వివరాలు దొరికాయి. వీరు ముగ్గురూ వేరు వేరు కాలాల్లో పాలించివుండవచ్చు. వీటన్నింటిని బట్టి చూస్తే కళింగ సామ్రాజ్యం గోదావరి డెల్టా వరకూ విస్తరించివుండేదని భావించవచ్చు. ఖారవేలుడు కళింగపట్నాన్ని తన రాజధానిగా చేసుకుని పాటించాడు. ఆ పట్టణం ఇప్పుడు శ్రీకాకుళం జిల్లాలో ఉంది.

ఖారవేలుడు భారత ఉపఖండంలోని తక్కిన ప్రాంతాలను కూడా తన స్వాధీనంలోకి తెచ్చుకుని చక్రవర్తి అనిపించుకోవాలని ప్రయత్నించాడు. దక్కను ప్రాంతంలో అప్పుడున్న శాతవాహన సామ్రాజ్యంలోకి చొరబడి కృష్ణానది ఉత్తర ప్రాంతంలోని అశిక వరకూ చొచ్చుకుపోయాడు. విదర్భ ప్రాంతంలోని ఉత్తర గోదావరి పరివాహక ప్రదేశంలో ఉన్న భోజకులను, రథికులను ఓడించాడు. బీహార్ లోని రాజగృహ వరకూ అతని యాత్ర సాగింది. అప్పటికి మధుర ప్రాంతంలో అధికారంలో ఉన్న యవనులను తరిమివేసినట్టు ఖారవేలుడు తన శిలా శానంలో చెప్పుకున్నాడు. దక్షిణాన పాండ్యులు పాలిస్తున్న ప్రాంతం వరకూ జైత్రయాత్ర సాగించి అక్కడినుంచి విలువైన

ఆభరణాలను, ముత్యాలను దోచుకుని వచ్చాడు. ఇదంతా ఖారవేలుడి శిలా శాసనంలో ఉంది. ఐతే వీటిలో ఎంతవరకూ వాస్తవం, ఎంత వరకూ అతిశయోక్తి అన్నది తేల్చడానికి వేరే ఆధారాలు ఏమీ లేవు.

తాను కొల్లగొట్టి తెచ్చిన సంపదతోబాటు ఓడించిన రాజులనుండి వసూలు చేసిన కప్పం, ప్రజలనుండి వసూలు చేసిన పన్నులు, వ్యాపారులనుండి వసూలు చేసిన సుంకాలు కళింగ రాజ్యానికి ఆర్థిక వనరులుగా ఉండేవి. కొంత మంది సంపన్నులు, ప్రముఖులు, స్థానిక అధికారులతో కూడిన పౌర జనపదం కొన్ని ప్రత్యేకమైన హక్కులు, సదుపాయాలు పొందుతూ వుండేది. ఈ పౌర జనపదంలో సభ్యులుగా ఉండేవారు ఆనాటి వివిధ కులాలకు ప్రాతినిధ్యం వహించేవారు. దీనిని బట్టి ఆనాడు కులవ్యవస్థ బాగా విస్తరించిందని చెప్పవచ్చు.

అశ్వదళం, గజ దళం, పదాతిదళం, రథ బలగం – ఈ నాలుగు రకాల సైన్యం ఉండేది. రథ దళానికి ప్రాధాన్యత బాగా తగ్గింది. సైన్యాన్ని పోషించడంతోబాటు ఖారవేలుడు తన రాజ్యపు ఆదాయాన్ని మహావిజయ భవనాన్ని నిర్మించడానికి, కళింగపట్నం లో తుఫానులను తట్టుకునే భవంతులను, అక్కడి నదులకు కరకట్టలను నిర్మించడానికి, చెరువులు తవ్వించడానికి వినియోగించాడు.

ఖారవేలుడు జైన మతాన్ని అనుసరించాడు. అదే సమయంలో అన్ని మతాలనూ ఆదరించాడు. ఆనాటి తక్కిన రాజులు తాము బ్రాహ్మణ కులంనుండి పుట్టినట్టు చెప్పుకోడానికి తాపత్రయ పడినట్టు ఖారవేలుడు గాని, అతని మహారాణి గాని ప్రయత్నించలేదు.

ఈ కాలానికి ఉత్తరాన శుంగవంశ రాజ్యం బలహీనపడింది. అక్కడ కణ్వులు, కొంత ప్రాంతంలో పాలిస్తే, మధుర ప్రాంతంలో గ్రీకు రాజులు పాలించారు. కోసల, పాంచాల, విదిశ వంటి ప్రాంతాలను స్థానిక రాజులే పాలించారు.

**శాతవాహన సామ్రాజ్యం**

శాతవాహనులు ఆంధ్రులు అనీ, ఆంధ్ర జాతికి చెందినవారనీ అంటారు. శాతవాహన వంశ మూలపురుషుడు శిశుకుడు (శ్రీశుకుడు?) అని పురాణాల్లో ఉంది.

ఉత్తర మహారాష్ట్ర లోని నానాఘాట్ కనుమ వద్ద ఉన్న గుహల్లో చెక్కబడిన వివరాలను బట్టి శ్రీముఖ శాతవాహనుడు శాతవాహన వంశానికి ఆద్యుడు. ఇతని కుమారుడు సిరి శాతకర్ణి. ఇతని భార్య, మహారాణి అయిన నయనిక ఈ గుహల్లో చిత్రాలను, శాసనాలను చెక్కించింది. ఆమె కుమారుడు వేది సిరి తరఫున కొంతకాలం

> “ క్రీ.పూ. 262 లో జరిగిన కళింగ యుద్ధంలో అశోకుడు కాళింగులను ఓడించి రాజ్యాన్ని కైవసం చేసుకున్నాడు. ఒడిశా లోని హథిగుంప వద్ద బైటపడిన ఖారవేలుడి శిలా శాసనం చాలా విలువైన సమాచారాన్ని అందజేసింది. ఒక బలమైన కళింగ సామ్రాజ్యం గురించిన వివరాలు దాని ద్వారా లభ్యమయ్యాయి. ‘కళింగాధిపతి’ అయిన ఖారవేలుడి రాజ్యంలో వరుసగా పదమూడు సంవత్సరాలపాటు జరిగిన ముఖ్యమైన చారిత్రిక ఘట్టాలు అందులో పొందుపరచబడ్డాయి. ”




నయనిక రాజ్యభారం వహించింది. సిరిముఖ శాతకర్ణిని దక్షిణాపథ పతి అని ఆ శాసనాల్లో అభివర్ణించారు.

ఆ శాసనాలు క్రీ.పూ. మొదటి శతాబ్దపు చివరి భాగానికి చెందినవని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. పురాణాల్లో సిరి శాతకర్ణిని శ్రీ శాతకర్ణి అని పేర్కొన్నారు. శ్రీ శాతకర్ణి రాజ్యం ఉత్తర మహారాష్ట్ర నుండి దక్షిణాన కర్నాటక సరిహద్దు వరకూ కృష్ణా నదీ పరీవాహక ప్రాంతం అంతా విస్తరించివుండేది. శ్రీ శాతకర్ణి తరఫున సాంచీలో విరాళం ఇచ్చినట్టు సాంచీలోని ఆధారాలు వెల్లడి చేస్తున్నాయి. కళింగ రాజు ఖారవేలుడు దాడిచేసి జయించినట్టు చెప్పుకున్నది ఈ శ్రీ శాతకర్ణి రాజ్యం మీదనే.

గౌతమీపుత్ర శాతకర్ణి రాజ్యాధికారం చేపట్టిన తర్వాత శాతవాహనుల దశ తిరిగింది.

> ‘‘ గుజరాత్ (సౌరాష్ట్ర) ప్రాంతాన్ని అప్పటికి పాలిస్తున్న శక రాజు రుద్ర దమనుడితో గౌతమీపుత్ర, అతని తర్వాత శాతవాహనరాజులు పలు ఘర్షణల్లో పాల్గొన్నారు. వాటన్నింటి ఆధారంగా గౌతమీపుత్ర శాతకర్ణి ఒకటో శతాబ్దపు చివరి సంవత్సరాలలో అధికారానికి వచ్చాడని చెప్పవచ్చు. గౌతమపుత్ర శాతకర్ణి కుమారుడు పులుమావి. ఇతడు ‘వాసిష్టీపుత్ర’ అన్న పేరు ముందు కలిగివున్నాడు. ’’



FIGURE 2.2 (1) Lead coin of Vāsiṭhiputa Siri Pulumāvi (P.L. Gupta); (2) Silver coin of Gotamiputa Siri Yāna Sātakaṇi: note portrait and 'irregular Tamil' legend (C.J. Brown).

ఆంధ్రజాతి అని శాతవాహనుల గురించి ప్రస్తావన ఉన్నప్పటికీ, గౌతమీపుత్ర శాతకర్ణి కాలానికి ఆ తెగ కూడా బ్రాహ్మణీకరణకు లోనైంది. శుంగ వంశస్థుల మాదిరిగానే శాత వాహనులు కూడా తాము బ్రాహ్మణ కుల స్త్రీలకు జన్మించినవారిమేనని చెప్పుకునే ఆచారాన్ని అనుసరించారు. గౌతమి బాలసిరి అనే బ్రాహ్మణ స్త్రీ గౌతమ గోత్రానికి చెందినది. ఆమెకు జన్మించినవాడే గౌతమీపుత్ర శాతకర్ణి. ఇతని రాజ్యంలో కుల వ్యవస్థ సంకరం కాకుండా కఠిన నిబంధనలను అమలు చేశారు.

నాసిక్ ప్రాంతం తమ అధీనంలో ఉంచుకున్న శక రాజు నహపాణుడిని గౌతమీపుత్ర శాతకర్ణి ఓడించి నర్మద నదిదాటి మాళ్వ ప్రాంతం వరకూ చేజిక్కించుకున్నాడు. నహపాణుడు ముద్రించిన వెండి నాణేలు దాదాపు 9000 నాసిక్ వద్ద త్రవ్వకాలలో దొరికాయి. వాటిపై ఉండిన నహపాణుడి ముద్రను చెరిపి మళ్ళీ వాటిని గౌతమీపుత్ర ముద్రించాడు.

గుజరాత్ (సౌరాష్ట్ర) ప్రాంతాన్ని అప్పటికి పాలిస్తున్న శక రాజు రుద్ర దమనుడితో గౌతమీపుత్ర, అతని తర్వాత శాతవాహనరాజులు పలు ఘర్షణల్లో పాల్గొన్నారు. వాటన్నింటి ఆధారంగా గౌతమీపుత్ర శాతకర్ణి ఒకటో శతాబ్దపు చివరి సంవత్సరాలలో అధికారానికి వచ్చాడని చెప్పవచ్చు. గౌతమపుత్ర శాతకర్ణి కుమారుడు పులుమావి. ఇతడు ‘వాసిష్టీపుత్ర’ అన్న పేరు ముందు కలిగివున్నాడు. వశిష్ట గోత్రానికి చెందిన బ్రాహ్మణ స్త్రీకి పుట్టిన కుమారుడు అని దానర్థం. భారతదేశంలో పర్యటించిన టాలెమీ (క్రీ.శ.146–170) పులుమావి రాజ్యాన్ని గురించి వర్ణించాడు. అతని గ్రంధంలో పైధన్, నాసిక్, కార్లే, అమరావతి, మైయాకదోని, సన్నాతి, బనవాసి, వాసన వంటి నగరాల వర్ణనలు ఉన్నాయి. పులుమావి కాలంలో దాదాపు మహారాష్ట్ర, ఆంధ్ర, ఉత్తర కర్నాటక ప్రాంతం అంతా శాతవాహన సామ్రాజ్యం విస్తరించింది. ఇతను దాదాపు 28 సంవత్సరాలపాటు పాలించాడు. యుద్ధంలో ఇతడిని శకరాజు రుద్ర దమనుడు ఓడించినప్పటికీ, తన కుమార్తెను పులుమావికి ఇచ్చి వివాహం చేశాడు. పులుమావి రాణి కన్హేరి రుద్ర దమనుడి కుమార్తెనని తన శాసనాలలో పేర్కొంది.

(చూ. మ్యాప్ 2.1 క్రీ.పూ.200 నుండి క్రీ.శ.200 మధ్య కాలంలో ద్వీపకల్పం)

పులుమావి అనంతరం అంత విశాల సామ్రాజ్యం మీద ఆధిపత్యాన్ని కొనసాగించినవాడు యజ్ఞశ్రీ శాతకర్ణి. ఇతడి అసలు పేరు గౌతమీపుత్ర స్వామి శ్రీ యజ్ఞ శాతకర్ణి. ఇతడి పాలనాకాలం క్రీ.శ. రెండో శతాబ్దం రెండవ భాగం. ఇతడి పాలన తర్వాత మరో 23 సంవత్సరాలకు శాతవాహన సామ్రాజ్యం అంతం అయింది.

శాతవాహనులు రాగి నాణేలతోబాటు వెండి నాణేలను కూడా విరివిగా ముద్రించారు. వాటిపై వారి చిత్రాలతోబాటు బ్రాహ్మీ, ప్రాచీన తమిళ లిపులలో అక్షరాలు ముద్రించారు.

(చూ. ఫిగర్ 2.2- శాతవాహనుల కాలం నాటి నాణేలు)

నాసిక్, కార్లే గుహలలోదొరికిన పరిమిత సమాచారం బట్టే శాతవాహనుల పాలనా వ్యవస్థ గురించి కొంత ఊహించవచ్చు. శాతవాహన రాజ్యంలో ముఖ్య అధికారులను అమాత్యులు అనేవారు. వివిధ ప్రాంతాలలో స్థానిక పాలన నిర్వహణ బాధ్యతలు, రాజ్య అధికారిక పత్రాల నిర్వహణ, భూమి దానం చేసిన వివరాలు వంటివి నిర్వహించడం వీరి బాధ్యతలుగా ఉండేవి. వీరిపై ఉండే ఉన్నతాధికారిని మహారథి అనేవారు. మహారాష్ట్ర అనే పేరు కూడా ఈ పదం నుంచే వచ్చి వుండవచ్చు. ఈ ఉన్నతాధికారులకు ఆదాయం సమకూర్చడం కోసం కొన్ని ప్రాంతాలను వీరికి కేటాయించారు. బళ్ళారి జిల్లా ప్రాంతం మహాసేనాపతికి కేటాయించినట్టు ఒక శాసనంలో ఉంది. సామాన్య రైతులను నాలుగు రకాల పన్నుల భారానికి గురి చేసేవారు.

**" నాసిక్, కార్లే గుహలలోదొరికిన పరిమిత సమాచారం బట్టే శాతవాహనుల పాలనా వ్యవస్థ గురించి కొంత ఊహించవచ్చు. శాతవాహన రాజ్యంలో ముఖ్య అధికారులను అమాత్యులు అనేవారు. వివిధప్రాంతాలలో స్థానిక పాలన నిర్వహణ బాధ్యతలు, రాజ్య అధికారిక పత్రాల నిర్వహణ, భూమి దానం చేసిన వివరాలు వంటివి నిర్వహించడం వీరి బాధ్యతలుగా ఉండేవి. వీరిపై ఉండే ఉన్నతాధికారిని మహారథి అనేవారు. మహారాష్ట్ర అనే పేరు కూడా ఈ పదం నుంచే వచ్చి వుండవచ్చు. "**

శాతవాహనులు బ్రాహ్మణ మతాన్ని అవలంబించినప్పటికీ బౌద్ధాన్ని కూడా ఆదరించారు. ఈ రెండింటికీ మధ్య వైరుధ్యం ఉన్నట్టు పరిగణించేవారు కాదు.

**దక్షిణ భారతదేశం**

దక్షిణ భారతదేశ రాజ్యాల గురించిన తొలి ఆధారం మెగస్తనీసు ఇండికా గ్రంధం. (క్రీ.పూ. 300) దక్షిణ భారతదేశంలో పండైయా అనే మహారాణి రాజ్యంలో విస్తృతంగా ముత్యాల సాగు జరిగేదని ఆ గ్రంధంలో పేర్కొన్నాడు. అతను ప్రస్తావించినది ట్యుటికొరిన్ ప్రాంతంలోని ముత్యపు చిప్పలు లభ్యం అయే ప్రాంతం. క్రీ.పూ. 258లో అశోకుడు తన శిలా శాసనంలో రాయబారులను చోడ, పాండ్య, సాతియపుత్ర, కేరళపుత్ర రాజ్యాలకు పంపినట్టు ప్రస్తావించాడు. అదే క్రీ.పూ. 257 నాటి శాసనంలో కేవలం చోళ, పాండ్య రాజ్యాలగురించి మాత్రమే ఉంది. దానిని బట్టి ఆ కాలంలో ఈ రెండు రాజ్యాలే ప్రధానమైనవి అని అనుకోవచ్చు. కావేరి డెల్టా ప్రాంతం చోళుల ఆధీనంలో ఉంటే, మదురై ప్రాంతం పాండ్యరాజుల పాలనలో ఉండేది. పాండిచేరి ప్రాంతంలో సాతియపుత్ర రాజ్యం ఉండేది. కేరళపుత్రుల రాజ్యం చేర రాజ్యంగా పిలువబడేది. కోయంబత్తూరు నుండి పశ్చిమం వైపు ప్రాంతం వీరి ఆధీనంలో ఉండేది. తమిళ బ్రాహ్మీ లిపిలో ఉన్న కొన్ని శాసనాలు దొరికినప్పటికీ వాటిపై ఉన్నదానిని బట్టి ఈ రాజ్యాల చరిత్ర క్రీ.పూ .రెండో శతాబ్దం నాటికి ఎక్కువగా తెలుసుకోవడం సాధ్యం కాదు. ఆయా రాజులు జైన సన్యాసులకు విరాళాలు ఇచ్చిన శాసనాలు వీటిలో ఎక్కువగా ఉన్నాయి.

క్రీ.శ. ఒకటో శతాబ్దం నుండి మూడో శతాబ్దం దాకా ఉన్న కాలానికి సంబంధించి సంగం (తమిళంలో చంకం) పత్రాలు లభించాయి. వీటిలో దక్షిణాపథాన ఉన్న రాజ్యాల వివరాలు లభిస్తున్నాయి. వాటిలోని అతిశయోక్తులను పక్కన పెడితే ఆ కాలంలోని వివరాలు ఈ సంగం పత్రాల ద్వారా సేకరించవచ్చు. చేర రాజులు కరూర్ ను రాజధానిగా, పాండ్య రాజులు మదురై ను రాజధానిగా చేసుకుని పాలించినట్టు తెలుస్తోంది. పాండ్య రాజ్యానికి కళింగరాజు ఖారవేలుడితో దౌత్య సంబంధాలు ఉండినట్టు తెలుస్తోంది. విజేతలైన పాండ్య రాజులు నెడుం జెరియన్ అనే బిరుదు ఉపయోగించేవారు.

సంగం పత్రాలద్వారా క్రీ.శ. 190 లో కరికాలుడు అనే చోళ రాజు చేర, పాండ్య రాజులిద్దరినీ ఒకే యుద్ధంలో ఓడించాడని తెలుస్తోంది. సంగం పత్రాల ఆధారంగా మనకి ప్రధానంగా ఆనాటి పాలకుల గురించి తెలిసినట్టు అప్పటి వివిధ తెగల ప్రజలజీవితాల గురించి తెలియడం లేదు. సైన్యానికి, యుద్ధాలకు, యోధులకు అధిక ప్రాధాన్యత ఉండేది. యుద్ధంలో మరణించిన సైనికుల భార్యలు సతి ఆచారాన్ని పాటించినట్టు, దానిని చాలా గొప్ప ఆచారంగా ఆ కాలంలో పరిగణించినట్టు తెలుస్తోంది. ప్రజలను దొంగల నుండి, క్రూర మృగాలనుండి కాపాడడం రాజుల విధిగా పరిగణింపబడేది. వ్యవసాయ భూములకు సాగు నీరు అందించడం కూడా రాజుల కర్తవ్యంగా భావించేవారు.

❋

**కాల పట్టిక**

| | | |
|---|---|---|
| చోళ, పాండ్య రాజ్యాలు ఉనికిలో ఉన్న కాలం | **క్రీ.పూ.** | 258 నుండి |
| తమిళ-బ్రాహ్మీ లిపి వాడుక ఉన్న కాలం | | 200 నుండి |
| పుష్యమిత్రుడు శంగ వంశాన్ని స్థాపించినది | | 185లో |
| వ్యాకరణ పండితుడు పతంజలి పేరు పొందిన కాలం | | 150 |
| శాతవామన సామ్రాజ్యం ఏర్పడిన కాలం | | 100 |
| ఖారవేలుడు-కళింగ రాజు- హథిగుంప శాసనం కాలం | | 20 |
| సంగం పత్రాల కాలం | **క్రీ.శ.** | 1 నుండి 300 సం |
| గౌతమీపుత్ర శాతకర్ణి పాలనాకాలం | | 100 |
| అతని కుమారుడు పులుమావి పాలనాకాలం | | 130 |
| కరికాల చోళుడి కాలం | | 190 |
| శాతవాహన వంశ పాలన అంతం | | 200 |

**మీడియా వాచ్**

# మీడియాపై బిగుస్తున్న రాజకీయ బంధనాలు



రచయిత ప్రముఖ పాత్రికేయుడు

**పి సాయినాథ్**

(గత సంచిక తరువాయి)

కోవిడ్ మహమ్మారి తొలినాళ్లలో ప్రైవేట్ రంగం ప్రకటనలు తగ్గుముఖం పట్టాయి. కానీ ఈ ఇబ్బందిని కార్పొరేట్ మీడియా అధిగమించగల్గింది. ప్రభుత్వంతో తమకున్న సంబంధాల ద్వారా సమకూరిన శక్తితో కార్పొరేట్ మీడియా ఆ ఇబ్బంది నుండి గట్టెక్కగల్గిగంది.

అది 2020 మార్చి 24 నిశిరాత్రి. దేశంలోని 140 కోట్ల ప్రజానీకాన్నుద్దేశించి భారత ప్రధాని ఒక ఆకస్మిక ప్రకటన చేశారు. కేవలం నాలుగు గంటల వ్యవధిలో, తమ జీవనాధారలన్నింటినీ మూసేయవలసిందిగా ఆ ప్రకటన ప్రజలను ఆదేశించింది. అనంతరం ఒక సానుకూల ప్రకటన కూడా ప్రసారమైంది : అత్యంత కఠినమైన లాక్‌డౌన్ కాలంలో కూడా పనిచేసేందుకు అనుమతించిన కొన్ని అత్యవసర విభాగాల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఆసుపత్రులు, పోలీస్, అగ్నిమాపక విభాగము వంటి అనేకానేక రంగాలు ఆ జాబితాలో చోటుచేసుకున్నాయి.

ప్రింటు – ఎలక్ట్రానిక్ మీడియా, టెలీ కమ్యునికేషన్స్, ఇంటర్‌నెట్ సర్వీసులు, ప్రసారము మరియు కేబుల్ రంగాలు కూడా పై జాబితాలో చేర్చబడ్డాయి. బహుశా ఈ రంగాలకు ఇలాంటి మినహాయింపు లభించటం ఇదే తొలిసారి కావచ్చు. అత్యవసర సేవలుగా ముద్రవేయబడిన రంగాలకు, కొన్ని చిక్కులతో పాటు ప్రత్యేక హక్కులు కూడ సమకూరాయి.

మొదటి లాక్‌డౌన్ మూడు మాసాల్లో బడా మీడియా సంస్థలు, ముఖ్యంగా కార్పొరేట్ల అధీనంలోని మీడియా సంస్థలు 1500 మంది జర్నలిస్టులను తొలగించాయి. ఢిల్లీ జర్నలిస్టు యూనియన్ విడుదల చేసిన సమాచారం ప్రకారం : మే 2022 నాటికి కనీసం 3000 మంది జర్నలిస్టులు పని కోల్పోయారు. వీరితోపాటు మీడియా రంగంలోని జర్నలిస్టులు కాని కార్మికులు కూడా పెద్ద సంఖ్యలో తొలగించబడ్డారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం మాత్రం మౌనముద్రలో గడిపింది.

ప్రభుత్వ మౌనం పట్ల కార్పొరేట్ మీడియా కొన్ని సార్లు హర్షం వ్యక్తం చేసింది. అంతేకాదు, అదే కార్పొరేట్ మీడియా ప్రభుత్వానికి అనుకూలమైన పద్ధతిలో తాను కూడా మౌనాన్ని పాటించి బదులు తీర్చుకుంది. ఈ కాలంలో మోడీ ప్రభుత్వం స్వతంత్ర భారతదేశంలో గతంలో ఏనాడూ కనీవినీ ఎరుగని రీతిలో కార్మికవర్గంపై దాడికి తెగబడింది. అమల్లో వున్న లేబరు చట్టాలన్నింటినీ రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మొదట ఆర్డినెన్స్‌లు తెచ్చింది. తర్వాత కేంద్ర ప్రభుత్వమే వాటిని నాలుగు కోడ్‌ల స్థాయికి కుదించివేసింది. ఆ కోడ్‌లు, కార్మికవర్గ హక్కుల్లో స్వర్ణ పతాకం వంటి ఎనిమిది గంటల పని దినాన్ని రద్దుచేశాయి. తద్వారా భారత కార్మికవర్గాన్ని ఒక శతాబ్దకాలం పాటు వెనక్కు నెట్టేశాయి. కార్పొరేట్ల అధీనంలోని మీడియాలో సిబ్బంది పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నారు. మీడియా యాజమాన్యాలు గెంటేసినందున వారిలో అనేకమంది జర్నలిస్టులు, నిరుద్యోగులుగా మిగిలారు.

'ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా', జర్నలిస్టుల తొలగింపులను పరిశీలించేందుకు ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీలో నేనొక సభ్యుడిని. తమ సంస్థలో ఎంత మందిని తొలగించారో తెల్పమని ఎక్కువమందిని తొలగించిన పెద్ద మీడియా సంస్థలకు ఒక ప్రశ్నావళిని పంపాము. ఆ ప్రశ్నావళిలో, "ఎందరిని లే ఆఫ్ చేశారు ? అకస్మాత్తుగా, స్వచ్ఛంద( వత్తిడి కారణంగా) పదవీ విరమణ చేసి ఎందరు తొలగిపోయారు ?" ఇలాంటి కొన్ని ప్రశ్నలున్నాయి. అనేక సంస్థలు సమాధానమిచ్చేందుకే ఆసక్తి చూపలేదు. ఒక పెద్ద కార్పొరేట్ మీడియా సంస్థ తన లాయరు ద్వారా మాకు ప్రత్యుత్తరమిచ్చింది.

ఈ సమస్యపై జోక్యం చేసుకునేందుకు 'ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా'కు ఎలాంటి హక్కూ లేదని ఆ సంస్థ తన ప్రత్యుత్తరంలో ధిక్కారపూర్వకంగా తెలియజెప్పింది. వారి ప్రత్యుత్తరం ఇలా ఉంది : " కౌన్సిల్ పరిధి కేవలం 'పత్రికా స్వేచ్ఛ'కు మాత్రమే పరిమితమై ఉంటుంది. తొలగింపులు, పదవీ విరమణలు లేదా అలాంటివే మరేవైనా లేబరు, ఉపాధి సంబంధిత సమస్యలు మాత్రమే. అవన్నీ మరి కొన్ని సంస్థలకు, చట్టాలకు సంబంధించిన అంశాలే. వాటికీ పత్రికా స్వేచ్ఛకూ ఎలాంటి సంబంధమూ లేదు."

జర్నలిస్టులను తొలగించటమనేది ఏవిధంగానూ పత్రికా స్వేచ్ఛను ఉల్లంఘించటం కాదన్న వాదన ఉండేది. తొలగించటమనేది కేవలం ఉపాధి సంబంధిత అంశమన్న భావన ప్రచారంలో పెట్టారు. ఆ సమస్య కేవలం వర్కింగ్ జర్నలిస్టు చట్టం, ట్రిబ్యునళ్లకు పరిమితమై ఉండవచ్చని వక్రభాష్యం చెప్పారు. ప్రెస్ కౌన్సిల్‌కు ఎలాంటి సంబంధంలేదన్న వాదనను ముందుకు తెచ్చారు.

పత్రికా స్వేచ్ఛపై దాడిచేసేందుకు కార్పొరేట్ మీడియా పై వాదనలను ఉటంకిస్తున్నది. 1960ల్లో, 'న్యూయార్కర్ పత్రికలో, ఎజె లైబ్లింగ్ సుప్రసిద్ధమైన ఉటంకింపు ఇలా ఉంది : "పత్రికా స్వేచ్ఛ అనేది కేవలం ఒక పత్రికకు యజమానిగా ఉన్నవారికి మాత్రమే ఖరారు చేయబడింది,"

యుపిఎ ప్రభుత్వం కార్పొరేట్ మీడియాకు మాత్రమే చాలా సన్నిహితంగా ఉండేది. నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ కార్పొరేట్లకు అనుకూల సంస్కరణల ఎజండాకు తెరలేపారు. అందుకే మీడియా కార్పొరేట్లు తమ స్థాయిని దిగజార్చుకుని అతని కాళ్లపై మోకరిల్లారు. ఆ తీరును వారు చాలా సులభంగా మరచిపోయి ఉండవచ్చు. కానీ ప్రస్తుత బిజెపి ప్రభుత్వం వారికి మరింతగా చేరువైంది. గత 10–15 సంవత్సరాల కాలంలో రాజకీయాలు, ఆర్థికాంశాలు రెండూ పరిణామం చెందిన క్రమం వారి

సాన్నిహిత్యానికి అద్దం పడుతున్నది.

నేటి భారతదేశాన్ని మతోన్మాదులు, మార్కెట్ ఆర్థిక ఛాందసవాదుల కూటమి పాలిస్తున్నది. శుభప్రదమైన వీరి సహజీవనానికి కార్పొరేట్ మీడియా అంపశయ్యగా వ్యవహ రిస్తున్నదని చెప్పవచ్చు. అనేకమంది కార్పొరేట్ నాయకులు, దాదాపు కార్పొరేట్ మీడియా ప్రధాన అధిపతులందరూ ఒకరు లేదా పలువురు బాబాలు లేదా మాతలు, లేదా అవతార పురుషు(గాడ్_మెన్)లను అనుసరిస్తు న్నారు. వారికి అన్ని విధాలా దన్నుగా నిలు స్తున్నారు. పైతెల్పిన నేతల్లో అనేకమంది కాషాయ శిబిరంలోనే లోతుగా దిగబడి ఉన్నారు. అలాంటి వ్యక్తుల గురించి మీడియా వ్యాఖ్యలు, విశ్లేషణలు క్రమంగా తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో తమకేం కాదన్న భరోసాతో వారు కొనసాగుతున్నారు.

> ❝సారాంశంలో శక్తివంతమైన మీడియా సంస్థలు రాజకీయ పార్టీలు, పోటీచేస్తున్న అభ్యర్థుల ప్రచారాలనే వార్తలుగా మార్చా యి. అందుకుగాను ఆ సంస్థలు వారి నుండి కోట్లాది రూపాయలు దండుకున్నాయి. నాటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ చౌహాన్ తన గురించి వందలాది పూర్తి నిడివి పేజీల ప్రకటనలను 'న్యూస్' కోసం మీడియా సంస్థలకు అందించారు. (అలాంటివి, 'ది హిందు' పత్రిక తన పరిశోధలో 89 సేకరించింది). ఈ పేజీల్లో, ఎక్కడా చవాన్ పై విమర్శనాపూర్వకమైన పదం ఒక్కటి కూడా కన్పించలేదు.❞

2018లో 'కోబ్రా పోస్టు', 'ఆచార్య అటల్' పేరిట సంచలనాత్మకమైన స్టింగ్ ఆపరేషన్‌లను నిర్వహించింది. సదరు ఆపరేషన్ రిపోర్టుల సమాచారం ఇలావుంది : ప్రధాన రెవెన్యూ అధికారులతో పాటు, ముఖ్యమైన మీడియా సంస్థల యజమానులు కూడా లాభదాయకమైన కల్పిత ప్రకటనల కోసం చొంగకార్చుతూ ఎదురు చూశారు. ఒక రిపోర్టరును, 'వెంటబడి తిరిగే అవతార పురుషుడి'లా మారి, తమ ముందు ప్రత్యక్ష మైనట్లు వారు ఆశగా చూడసాగారు. కానీ ఆచరణలో వారు ఆశించిన దేమీ సమకూరలేదు. పైగా 2009-11 మధ్య కాలంలో జరిగిన 'పెయిడ్ న్యూస్' కుంభకోణాన్ని ది హిందు పత్రిక వెలువరించింది. ఆ ఆ కుంభకోణంలో ప్రమేయమున్న వారి పేర్లను చూసి దేశపు అత్యున్నత మీడియా సంస్థలు సిగ్గుతో తలదించుకున్నాయి.

భారతదేశంలో వర్తమాన 'పెయిడ్ న్యూస్' కుంభకోణానికి, 'లాభమే పరమార్థం' అనబడే కార్పొరేట్ల నీతి సూత్రమే మాతృకలా నిలచింది. 'పెయిడ్ న్యూస్' అంటే ఏకాభిప్రాయాన్ని సాధిం చటం కాదు. సంతృప్తిని వండివార్చటం. కేవలం 'విషయం' కు మాత్రమే పరిమితం కాదు -ప్రకటనల్లో కూడా చెల్లింపు 'విషయం' (కంటెంట్) ఉంటుంది. పెయిడ్ న్యూస్‌లో అంతకంటే ఎక్కువే ఉంటుంది.

2009 లోక్‌సభ ఎన్నికల్లోనూ, తర్వాత జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ పెయిడ్ న్యూస్ అనేది వేలాది కోట్ల రూపాయల విలువైన పూర్తిస్థాయి పరిశ్రమగా ఆవిర్భవిం చింది. జర్నలిస్టుల అంచనా ప్రకారం 2009లో ఆంధ్రప్రదేశ్‌లో దాని విలువ రు.1500ల కోట్లకు చేరింది. పెయిడ్ న్యూస్‌లో పలు రకాలున్నాయి. బహుశా అవి : ముందస్తు చెల్లింపులు. తదనంతర చెల్లింపులు. ఇంకా చెల్లించవలసినవి (ఎన్నికల్లో ఓడినందున అభ్యర్థులు ఆ బిల్లులను చెల్లించగల స్థితిలో లేరు.)

సారాంశంలో శక్తివంతమైన మీడియా సంస్థలు రాజకీయపార్టీలు, పోటీచేస్తున్న అభ్యర్థుల ప్రచారాలనే వార్తలుగా మార్చాయి. అందుకుగాను ఆ సంస్థలు వారి నుండి కోట్లాది రూపాయలు దండుకున్నాయి. అలాంటివారిలో నాటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ చౌహాన్ తన గురించి వందలాది పూర్తి నిడివి పేజీల ప్రకటనలను 'న్యూస్' కోసం మీడియా సంస్థలకు అందించారు.(అలాంటివి, 'ది హిందు' పత్రిక తన పరిశోధలో 89 సేకరించింది). ఈ పేజీల్లో, ఎక్కడా చవాన్‌పై విమర్శనాపూర్వకమైన పదం ఒక్కటి కూడా కన్పించలేదు. అతని ప్రత్యర్థి పేరును ఒక్కసారి కూడా ప్రస్తావించలేదు.( ప్రత్యర్థికి వ్యతిరేకంగా సమాచారం రావాలంటే అందుకు సదరు మీడియాకు అదనంగా చెల్లించుకోవాలి).

పెయిడ్ న్యూస్ సమస్యపై విచారణ జరి పేందుకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పిసిఐ) ఒక ద్విసభ్య కమిటీని నియమించింది. ప్రరంజయ్ గుహ ఠాకుర్తా, కె. శ్రీనివాసరెడ్డిగారలు ఆ కమిటీ సభ్యులుగా నియమితులైనారు. వారు క్షుణ్ణమైన విచారణ తర్వాత ఆ అంశంపై మరింత 'దిగ్భ్రాంతికరమైన సమాచారం'తో నివేదికను రూపొందించారు. కానీ కార్పొరేట్ శక్తులు కూడా ఆ విచారణ కమిటీలోకి ప్రవేశించాయి. ప్రెస్ కౌన్సిల్ తన నివేదికను తానే నిర్వీర్యం చేసింది. తన నివేదిక నిడివిని పదవ వంతుకు కుదించింది. ఆ సిఫార్సుల్లోని చివరి భాగాన్ని మాత్రమే బహిరంగపరచింది. ఫలితంగా నేరస్తుల పేర్లు కనుమరుగైపోయాయి.

అనేక మాసాల తర్వాత కేంద్ర సమాచార కమీషన్ పూర్తి నివేదికను బహిరంగ పరచవలసిందిగా పిసిఐని ఆదేశించారు. ఆమేరకు పూర్తి నివేదిక బహిరంగంగా ప్రచు రించబడింది. కానీ ఆపాటికే పరిస్థితి మారి పోయింది. మచ్చలేని మహోన్నతమైనవిగా కార్పొరేషన్‌లు బైటపడ్డాయి. పెయిడ్ న్యూస్ దురాచారంపై పార్లమెంటులో తీవ్రమైన ఖండనమండనలు జరిగాయి. కానీ పార్లమెంటు లో జరిగిన చర్చలకు మీడియాలో స్థానం లేకుండాపోయింది. ఈ ఘటన యుపిఎ అధికారంలో ఉన్న కాలంలో జరిగింది.

బిజెపి అధికారానికి రావటంతోనే కార్పొరేట్ మీడియా, జర్నలిస్టుల అసమ్మతిని తొక్కేయగల శక్తిని సంపాదించింది. తన ఇష్టంవచ్చినట్లు 'హైర్ అండ్ ఫైర్' విధానాన్ని వినియోగించింది. పాలకులను నిస్సిగ్గుగా బలపరచేందుకు పూనుకుంది. ఆ బరితెగింపు క్రమంగా పెరుగుతున్నది. మతోన్మాదులు, మార్కెట్ వాదు(ఫండమెంటలిస్టు)ల కూటమికి 'లాభమే పరమార్థం' సూత్రం ఆరాధ్య దైవంగా మారింది. ప్రజాస్వామ్యానికి మూల స్థంభంగా నిలవాల్సిన మీడియా తన పాత్రను విస్మరించింది.

వాస్తవాలను విమర్శనాత్మకంగా విశ్లేషణ చేయటాన్ని మీడియాలో అత్యధిక భాగం నిలిపేసింది. ప్రధాని మోడీ స్వంత పార్టీకి చెందిన పిఆర్ వ్యక్తులు కూడా కొన్ని అంశాలను వెలువరించేందుకు ఇబ్బందిపడతారు. అతని ప్రభుత్వాన్ని సంతృప్తిపరచేందుకు, అలాంటి అంశాలను కూడా కొన్ని ఛానళ్లు ప్రసారం చేస్తున్నాయి.

1991 తర్వాత దేశంలో అసమానతలు, ముఖ్యంగా ఆర్థిక అసమానతలు నిరంతరం పెరుగుతున్నాయి. గత కొద్ది సంవత్సరాల్లో అసమానతలు శరవేగంతో పెరుగుతున్నాయి. కేవలం మీడియా వార్తల ద్వారా మాత్రమే అయితే వాటిని స్పష్టంగా తెల్సుకోలేము.

వర్తమాన భారతంలో 168 మంది డాలర్ శతకోటీశ్వరులున్నారు. భారీ సంఖ్యలో డాలర్

**❝ ఫోర్బ్స్ సూచిక ప్రకారం : 121 దేశాలతో కూడిన ప్రపంచ ఆకలి సూచిలో మనదేశం 107వ స్థానంలో ఉంది. ఐక్యరాజ్య సమితి మానవాభివృద్ధి సూచిలో 191 దేశాల్లో మనం 132వ స్థానంలో ఉంది. అలాగే పత్రికా స్వేచ్ఛ సూచిలో, 180 దేశాల్లో భారత్ 150వ స్థానంతో గతంకంటే అధమ స్థాయికి దిగజా రింది. ❞**

శత కోటీశ్వరులున్న దేశాల్లో మన దేశం మూడవ స్థానంలో ఉంది. వారి సంపద స్థాయి, సంఖ్య పెరగటాన్ని మీడియా పారవశ్యంతో కీర్తిస్తున్నది. ఈ 168 మంది వ్యక్తిగత సంపద దేశ స్థూల జాతీయ ఆదాయంలో నాల్గవ వంతుకు మించి పోయింది. అదే మీడియా ఈ వాస్తవాన్ని తన ప్రేక్షకులకు తెల్పేందుకు విముఖత చూపుతున్నది. భారత్‌లో బ్రిటీష్ పాలన ఉచ్ఛస్థితిలో కూడా ఇంతటి అసమానతలు లేవు. ప్రస్తుత అసమానతల పర్యవసానాలు ఎలా ఉంటాయన్న సమస్యపై సలహాలిచ్చేందుకు కూడా ఆ మీడియాకు తగిన ఆసక్తి లేదు.

ఫోర్బ్స్ సూచిక ప్రకారం : 121 దేశాలతో కూడిన ప్రపంచ ఆకలి సూచిలో మనదేశం 107వ స్థానంలో ఉంది. ఐక్యరాజ్య సమితి మానవాభివృద్ధి సూచిలో 191 దేశాల్లో మనం 132వ స్థానంలో ఉంది. అలాగే పత్రికా స్వేచ్ఛ సూచిలో, 180 దేశాల్లో భారత్ 150వ స్థానంతో గతంకంటే అధమ స్థాయికి దిగజారింది. 2022 పర్యావరణ పరిరక్షణ అధ్యయన ప్రాజక్టును 'ఏల్ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ లా అండ్ పాలసీ' మరియు కొలంబియా యూనివర్శిటీలోని 'ఎర్త్ ఇన్‌స్టిట్యూట్'లు నిర్వహించాయి. ఆ పర్యావరణ పరిరక్షణ సూచిలో, 180 దేశాల్లో 180వ స్థాయికి మన దేశం చేరుకుంది.

కానీ ప్రధాన స్రవంతి మీడియాలో పై అంశాలపై నిష్కపటమైన చర్చ జరగటం లేదు. లాభం కోసమే ఆ సంస్థలు మనుగడ సాగిస్తున్నాయి. పేదలు, అట్టడుగు ప్రజల సమస్యల ప్రసారము, ప్రచురణలతో వారికి రాబడి సమకూరదు.

మీడియా స్వేచ్ఛపై ఈ ప్రభుత్వం వైఖరి ఏమిటి? ఈ అంశంలో ప్రభుత్వ వైఖరిపట్ల నా ప్రత్యక్ష అనుభవాన్ని పంచుకుంటాను. ప్రపంచ పత్రికా స్వాతంత్ర్యం సూచిలో భారత్ 142వ స్థానంలో నిలవటం అవమానకరంగా పరిణమించింది. భారత్‌లో పత్రికా స్వేచ్ఛను పున:ప్రతిష్ఠించేందుకు ఒక 'ఇండెక్స్ మానిటరింగ్ సెల్' ను ఏర్పాటు చేయాలని, అందుకు ఒక కమిటీని నియమించాలని యూనియన్ క్యాబినెట్ సెక్రెటరీ కోరాడు. ఆ కమిటీలో ఒక సభ్యుడిగా వుండేందుకు నేను అంగీకరించాను. అందుకు ప్రపంచ పత్రికా స్వాతంత్ర్యం సూచి ర్యాంకును తిరగగొట్టవద్దని చెప్పాను. దేశంలో వాస్తవమైన పత్రికా స్వాతంత్రంపై దృష్టి సారించాలన్న హామీని కోరాను. నా ప్రతిపాదనలకు వారు ఆమోదించటంతో ఆ కమిటీలో పని చేసేందుకు అంగీకరించాను.

13 మంది సభ్యులున్న కమిటీలో 11 మంది అధికారులు, ప్రభుత్వ సంస్థల పరిశోధకులున్నారు. పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన కమిటీలో ఇద్దరే జర్నలిస్టులు. వారిలో ఒకరు హాజరైన కొద్ది కమిటీ సమావేశాల్లో అసలు నోరు తెరవలేదు. నేనొక్కడినే మాట్లాడేవాడిని. ప్రశ్నలడిగేవాడిని. అయినా ఆ సమావేశాలు ప్రశాంతంగా నడిచాయి. వర్కింగ్ గ్రూపు ఒక ముసాయిదా పత్రాన్ని రూపొదించింది. ఆ పత్రంలో 'ముసాయిదా' అన్న పదమే కనుమరుగైపోయింది. సమావేశాల్లో లేవనెత్తిన ముఖ్యమైన అంశాలేవీ రిపోర్టులో ప్రతిబింబించ లేదు. అందుకే అందులో కలిపేందుకు, నేనొక స్వతంత్రమైన లేదా భిన్నాభిప్రాయంగల నోట్‌ను తయారుచేశాను.

అంతే ఆ రిపోర్టు, కమిటీ అన్నీ క్షణంలో మాయమైపోయాయి. దేశపు అత్యున్నత అధికారి ఆదేశాలపై ఏర్పడిన కమిటీ అది. సదరు అధికారిచే దేశంలోనే అతి శక్తివంతులైన ఇరువురికి మాత్రమే నివేదించవలసిన ఆ రిపోర్టు కనుమరుగైంది. పత్రికా స్వేచ్ఛపై రూపొందించబడిన సదరు రిపోర్టు భూస్థాపితం కాకుండా నిరోధించేందుకు చేసిన ఆర్‌టిఐ విచారణలు కూడా విఫలమైనాయి. అయితే ఆ ముసాయిదా నకలును మాత్రం నావద్ద భద్రపరచుకున్నాను. ఆ తొలి కసరత్తు, ఒక పరిశోధనాత్మక జర్నలిజం కాదు. ఆ కసరత్తు కేవలం, భారత్‌లో పరిశోధనాత్మక జర్నలిజం అమలౌతున్న తీరును గురించి మాత్రమే. ఒక అసమ్మతి నోట్‌తోనే అది అంతర్ధానమై పోయింది.

2022 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచి – 180 దేశాల్లో, భారత్ స్థానం 142 నుండి 150కి దిగజారింది. నాడు ఈ అంశం ఎవరినీ ఆశ్చర్యపరచలేదు. అనేక సూచికల్లో భారత్ స్థాయి దిగజారటాన్ని(ఫోర్బ్స్ లో శత కోటీశ్వరుల సంఖ్య పెరుగుదల అంకెలు తప్ప) భారత్‌కు వ్యతిరేక కుట్రగా ప్రభుత్వం బహిరంగంగా నిందించింది. ఈ అంశమూ మా జర్నలిస్టుల్లో ఆశ్చర్యం కల్గించలేదు. కానీ కార్పొరేట్ మీడియా పిరికిపందలా మౌనం పాటిస్తూ, పై తెల్పిన అంశాలన్నింటినీ తిరస్కరిస్తున్నది. వారి వైఖరితో మేము సిగ్గుపడవలసి వచ్చింది.

**ఏమిటి ఆ అనివార్య పరిస్థితి ?**

1980 –90ల్లో భారత్‌లోని బడా మీడియా అత్యంత సంపన్నవంతమైనది. ప్రస్ఫుటంగా కన్పించే అనేక రియల్ ఎస్టేట్ ఆస్తులకు అవి అధిపతులుగా ఉన్నాయి. వాటిలో అనేకం 1960ల్లో ప్రభుత్వం నుండి బహుమతులుగా స్వీకరించబడ్డాయి. కొన్ని సదుద్దేశంతో ఇవ్వబడ్డాయి. పత్రికారంగం ఆర్థిక పరిస్థితి పట్ల నాటి నాయకత్వం ఆందోళన చెందింది. ఆ రంగాన్ని పరిరక్షించేందుకు ఉదారంగా వ్యవహరించింది. స్వాతంత్రోద్యమ కాలంలో నిర్వహించిన ధీరోచితమైన పాత్రనే మీడియాలోని కొంత భాగం నేటికీ కొనసాగిస్తున్నది. నాడు అత్యధిక పత్రికా యాజమాన్యాలు ప్రభుత్వం కేటాయించిన భూములను నామమాత్రపు ధరలకు, లేదా అద్దెలకే దండుకున్నాయి. అలాంటి వారికీ, పత్రికా స్వాతంత్ర్యానికి సంబంధం లేదు. ఆ శతాబ్దపు అంతానికి, 'రియల్ ఎస్టేట్'– 'ఫోర్త్ ఎస్టేట్'గా రూపాంతరం చెందిందని చెప్పటం కష్టమౌతుంది.

ఈ కాలంలో వారి కేంద్రీకరణ ఆస్తుల రూపం నుండి షేర్ బజారును ప్రభావితం చేే స్థితికి చేరింది. ఇప్పటికీ పెద్ద సంపన్నుల ఆస్తులు గుట్టలుగా పేరుకున్నాయి. వారు గతము, వర్తమానంలో కూడా స్టాక్ మార్కెట్‌లో లోతుగా మమేకమై పోయారు. ఆ రూపంలోని వారి ఆస్తులు, త్వరగా ఆవిరై (తరచూ తొత్తడమై) దుర్బలమౌతున్నాయి. 2008లో వాల్‌స్ట్రీట్ పతనమైనపుడు, దాని ప్రభావంతో భారతదేశపు స్టాక్ మార్కెట్లు, ఆర్థిక వ్యవస్థ పతనమయ్యాయి. ఆ సందర్భంగా మన

> **“ మహాశక్తి సంపన్నమైన డిజిటల్ సంస్థలు ఒక అంశంలో అపూర్వమైనవి. అవి, మన వ్యక్తిగత సమాచారాలను స్వంతం చేసుకుని, నిషేధిత సరుకులతో వ్యాపారం చేస్తున్నాయి. సూక్ష్మంగా చెప్పాటంటే అవి నిషేధిత మానవ సమాచారాలతో వ్యాపారం చేస్తున్నాయి. ”**

కార్పొరేట్ మీడియా నిరంతరం అబద్ధాలు వల్లిస్తూ నిస్సిగ్గుగా వ్యవహరించింది.

వాస్తవంగా దశాబ్దాలుగా నష్టాలను చవిచూడని అనేక గ్రూపులు, వాల్ స్ట్రీట్ ప్రభావంతో భారీ నష్టాలతో చదును చేయబడ్డాయి. కరోనా మహమ్మారి లాక్‌డౌన్‌లు ప్రారంభమైన తర్వాత కూడా వేలాది జర్నలిస్టులను తొలగించారు. వివేకవంతమైన ద్రవ్య నిర్వహణ వల్ల భారత మార్కెట్లు, ఆర్థిక రంగం ఎక్కువగా ఒడిదుడుకులకు గురికాలేదంటూ ప్రచార ఆర్భాటాన్ని ప్రదర్శించారు. అనంతర కాలంలో కాంగ్రెస్ నేత పి.చిదంబరం నాటి అభినయం పట్ల తమను, తమ పార్టీని అభినందిస్తూ వెన్ను తట్టుకుంటూ ప్రగల్భాలు పలికాడు.

కానీ, ఆ సంక్షోభం సృష్టించిన వినాశనాన్ని వారే విధంగానూ అంగీకరించలేదు. ( పశ్చిమ దేశాలతో పోల్చినపుడు ఇక్కడి వినాశనం కొంత తక్కువగా ఉండవచ్చు). కానీ ఆ పరిణామంతో, వారి అధీనంలోని లక్షలాది షేర్‌ల విలువలు మరింతగా పతనమై ఉండవచ్చు. గతంలో కంటే ఇపుడు మరింత పెద్ద దెబ్బ వారికి తగిలి వుండవచ్చు. ఈ సందర్భంగా వారి మనుగడ వ్యూహంలో భాగంగా పరిశ్రమ స్థాయిలో ‘పెయిడ్ న్యూస్’ భారీగా వండి వార్చబడ్డాయి. అవి రికార్డుల్లో నమోదు కాలేదు. వాటిపై ఆదాయపు పన్ను చెల్లించనవసరం లేదు. వారికి అలాంటివే అనేక అదనపు సౌకర్యాలు సమకూరాయి.

స్వాతంత్రోద్యమం నాడు భారత మీడియా బాల్యావస్థలో ఉంది. నేడది పెరిగి పెద్దదై కార్పొరేట్ ప్రపంచపు లాభాపేక్షతో కూడిన సైద్ధాంతిక ఆయుధంగా రూపాంతరం చెంది, వికృత రూపం ధరించిందన్నది వాస్తవం. ఇపుడది మార్కెట్లలో పొదుగుతున్నది. అది తన సామాజిక బాధ్యతను పూర్తిగా విస్మరించింది.

కనీసం గత 20 సంవత్సరాలుగా భారత మీడియా నిర్మాణపరమైన(స్ట్రక్చరల్) అనివార్యతలతో అబద్ధాలకు_ఆలవాలమై పోయింది.

“ఇంటర్‌నెట్, సోషల్ మీడియా వేదికలు ఉగ్రవాదులు, మిలిటెంట్ గ్రూపుల అంబుల పొదిలో శక్తివంతమైన సాధనాలుగా మారాయి. అవి సమాజాన్ని అస్థిరపరచే లక్ష్యంగల సమరశీలత, కుట్ర సిద్ధాంతాల ప్రచారాన్ని వెదజల్లుతున్నాయి.....” – విదేశాంగ మంత్రి యస్. జయశంకర్

ఈసారి మంత్రి జయశంకర్ మరో అంశం చెప్పారు. అయితే దాన్ని భిన్నంగా వ్యక్తీకరించాడు. ‘నెట్’ని వ్యూహాత్మకంగా తలకిందులు చేయటంలో భారత్‌ను మించిన దేశం మరొకటి లేదని స్పష్టంగా రుజువౌతున్నది. బెదిరింపులు, భయభ్రాంతుల కల్పనతో ప్రజలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దుష్ప్రచారాలు, విద్వేషపూరిత ఉపన్యాసాలతో ప్రత్యర్థులను బెదిరించేందుకు, వెంటాడేందుకు హింస ద్వేషాలను వెదజల్లతున్నారు. ఈ ప్రక్రియలన్నింటికీ సోషల్ మీడియాను దుర్వినియోగం చేయటంలో భారత్‌తో మరే దేశమూ పోటీపడలేదు. ప్రపంచంలోని అతి పెద్ద ‘దుష్ట (ట్రోల్) సైన్యం’ కూడా భారత్‌లోనే మనుగడలో ఉంది. బహుదా వర్థిల్లుతున్నది. ఆ సైన్యానికి రాజ్యము, ప్రభుత్వం విభాగాలు మద్దతుగాను, రక్షణగాను నిలుస్తున్నాయి.

ఈ సైన్యం రాజకీయ ప్రత్యర్థులను దునుమాడుతుంది. మైనారిటీలపైకి ఉసిగొల్పుతుంది. సినిమాలను బలవంతంగా ఉపసంహరించుకునేలా వత్తిడిచేస్తుంది. పాలక వ్యవస్థను, హిందుత్వ సిద్ధాంతాలను విమర్శనాత్యకంగా విశ్లేషించే నాటకాలు, ప్రదర్శలను రద్దుచేయిస్తుంది. అలాంటి దుష్కార్యాలు చేయకుండా ఈ దుష్ట సేనకు ఒక గంట కూడా గడవదు.

1990లలో అద్భుత ప్రేమ కావ్యమైన ‘నెట్’ను గుర్తుచేసుకుందామా? కమ్యునికేషన్ వ్యవస్థను, ‘స్వేచ్ఛా గళం(ఫ్రీ స్పీచ్’)ను ప్రజాస్వామ్యబద్ధం చేయటమెలా ?

దుష్ట స్వభావం గల గుత్త సంస్థల ఏర్పాటుతో ప్రజాస్వామ్య వ్యవస్థలు నిలదొక్కుకోలేకపోయాయి. అందుకు సంతోషించాల్సిందేమీ లేదు. గుత్తాధిపతులను సంతృప్తిపరచేందుకు జాతీయ ప్రభుత్వాల మద్దతును కూడగట్టారు. దానితో గుత్తాధిపతులకు అవసరమైన, మార్కెట్లపై ఆధిపత్యం చలాయించేందుకు వాక్ స్వాతంత్ర్యాన్ని అణచేందుకు పూనుకున్నారు.

ఈ కాలమంతా ‘ నెట్’ అద్భుత ప్రేమ కావ్యంగా మారింది. దానితో భవిష్యత్‌లో ప్రపంచవ్యాపితంగా జరగబోయే పరిణామాల గురించి కొందరు హెచ్చరించారు. ఇపుడు గతకాలపు గుత్తసంస్థల కంటే పూర్తిగా భిన్నమైన, మరింత శక్తివంతమైన ‘డిజిటల్ గుత్త సంస్థలు’ ఆవిర్భవించాయి.

మహాశక్తి సంపన్నమైన డిజిటల్ సంస్థలు ఒక అంశంలో అపూర్వమైనవి. అవి, మన వ్యక్తిగత సమాచారాలను స్వంతం చేసుకుని, నిషేధిత సరుకులతో వ్యాపారం చేస్తున్నాయి. సూక్ష్మంగా చెప్పాటంటే అవి నిషేధిత మానవ సమాచారాలతో వ్యాపారం చేస్తున్నాయి.

రాజకీయ, సామాజిక రంగాల్లో పలు రూపా ల్లో వారు జోక్యం చేసుకోగల్గుతున్నారు. అందుకొక ఉదాహరణ : 2018లో ‘ఫేస్‌బుక్– కేంబ్రిడ్జి ఎనలిటికా’ కుంభకోణం జరిగింది. బీహార్ ఎన్నికల్లో తాము శక్తివంతంగా జోక్యం చేసుకున్నట్లు ‘కేంబ్రిడ్జి ఎనలిటికా’ సగర్వంగా ప్రకటించింది. ఎలాంటి ‘భారతీయ డాటా’ కూడా తమ అధీనంలోలేదని ‘ ఫేస్‌బుక్ ’ మొదట ప్రకటించింది. కానీ అదే సంవత్సరం ఏప్రిల్ 5న ఆ విషయాన్ని ఆమోదిస్తూ, కంపెనీ విడుదల చేసిన సమాచారాన్ని ‘ఇండియా టుడే’ పత్రిక ఇలా ప్రచురించింది : “ షుమారు 5,62,455 మంది భారతీయుల సమాచారం ‘కేంబ్రిడ్జి ఎనలిటికాకు’ అందుబాటులో ఉంది. జియన్ఆర్‌చే అభివృద్ధి చేయబడి, భారతీయులచే ఏర్పాటు చేయబడిన ‘యాప్’ను ప్రతిష్టించటం ద్వారా ‘ఎనలిటికా’ ఆ పని చేయగల్గింది.”

2022 సెప్టెంబరు 14న అనేక మీడియా సంస్థలు, ‘ట్విట్టర్’ మాజీ సెక్యూరిటీ చీఫ్ “ముడ్గే జట్కో” అభిప్రాయాలను వెల్లడించాయి. అతని ఆరోపణ : “అవసరమైన ఏజంట్లను నియమించేందుకు భారత్ వంటి విదేశీ ప్రభుత్వాలను మా కంపెనీ అనుమతించింది. మా సోషల్ మీడియా కంపెనీకి అన్నీ తెలిసే ఆ పనిచేసింది. తద్వారా ట్విట్టర్ వినియోగదారుల సున్నితమైన సమాచారం ఆయా ప్రభుత్వాలకు అందుబాటులోకి

> "కాశ్మీర్ అంతటి విశాల ప్రాంతంలో 'నెట్'కు ఊపిరాడని స్థితి ప్రపంచంలో మరెక్కడా లేదు. ఈ ప్రాంతంలో నెలల పర్యంతం ఇంటర్ నెట్ మూతబడింది. ఈ పరిస్థితి సాధారణ ప్రజలను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్నది. పత్రికలు, ప్రచురణ సంస్థలకు వినాశకరంగా మారింది. కరోనా మహమ్మారి కాలంలో, మీడియాపై అణచివేతలు పెంచారు. ఉరితాళ్లు బిగించారు."

వస్తుంది.'' ఆయన వక్కాణింపులు సాక్ష్యాధారాలతో సహా యునైటెడ్ స్టేట్స్ (యుయస్) సెనెట్ ముందుకొచ్చాయి.

తమ విధానాలకు తలవంచని వ్యక్తులు, ప్రముఖులను భారతదేశంలో వేటాడుతున్న విషయం జగద్వితం. ఆ విషయాన్ని పదేపదే పునరుద్ఘాటించాల్సిన పనిలేదు. కానీ గందరగోళం సృష్టించేందుకు సోషల్ మీడియాను కూడా సమర్ధవంతంగా వినియోగిస్తున్నారు. ఢిల్లీ దాడుల దుర్ఘటనలను పరిశోధించేందుకు ప్రయత్నించిన పలువురితో పాటు జర్నలిస్టులపై కూడా తారు పూశారు.

డిజిటల్ దిగ్గజాలు మరియు సోషల్ మీడియా సమీకరణలన్నీ ప్రభుత్వము - గుత్తసంస్థలకు అనుగుణంగానే నిరంతరం సాగుతున్నాయి. వాణిజ్యపరంగా తమకు లాభదాయకమైన సందర్భాలన్నింటా ప్రభుత్వ డిమాండ్లకు గుత్తసంస్థలు తలొగ్గుతున్నాయి. మోడీ ప్రభుత్వం నొసలు చిట్లిస్తేచాలు, ఎకౌంట్లను స్తంభింపజేస్తున్నారు. లేదా తొలగిస్తున్నారు. తమకు అనుకూలం కాని కొన్ని మీడియా సంస్థలపై ప్రభుత్వాలు - ముఖ్యంగా భారత ప్రభుత్వం కసితో సెన్సార్ కొరడా ఝుళిపించింది.

2020-21 రైతాంగ ప్రతిఘటనలకు తగుస్థానం కల్పించేందుకు డిజిటల్ దిగ్గజాలు తిరస్కరించాయి. కానీ మోడీ ప్రభుత్వపు వక్ర రాగాలకు మాత్రం ఫిడేలు వాయించాయన్నది స్పష్టం. ఆ దిగ్గజాలు ఎవరి పనుపున తమ పన్నుగడలో నైపుణ్యాన్ని ప్రదర్శించాయన్న అంశం ఊహకందనిదేమీ కాదు. అసంబద్ధమైన దిశా రవి "టూల్ కిట్" కేసులో తాము కోరిన సమాచారం 'గూగుల్' నుండి అందుకున్నట్లు ఢిల్లీ పోలీసులు చివరకు ట్వీట్లు కూడా చేశారు.

ట్విట్టర్ కొత్త యజమాని ఎలెన్ మస్క్‌కు సంబంధించిన ఒక విషయాన్ని ఆమోదించాలి. ట్విట్టర్ వంటి మీడియా వేదికల చర్యల్లో హేతుబద్ధమైన కారణాలుంటాయన్న భ్రమలు ఇప్పటికీ మారుమోగుతున్నాయి. కానీ ఆ కంపెనీని స్వాధీనం చేసుకోవటంలో మస్క్ అవలంబించిన వ్యూహం, ఆ భ్రమల బండారాన్ని బైటపెట్టింది. ప్రకటనల పద్ధతిని తాను అసహ్యించుకుంటున్నట్లు మస్క్ ఒకసారి ట్వీట్ చేశాడు. కానీ 2022 అక్టోబరులో ఇలా ప్రకటించాడు : "ప్రపంచంలో అత్యంత గౌరవప్రదమైన అడ్వర్‌టైజింగ్ వేదికగా ఉండాలని ట్విట్టర్ కాంక్షిస్తున్నది. తద్వారా ఆ సంస్థ తన బ్రాండ్‌ను బలపరచుకోవాలి. అభివృద్ధి చెందాలి."

సూక్ష్మంగా చెప్పాలంటే అదొక వాణిజ్య అడ్వర్‌టైజింగ్ వేదిక. అక్కడ, ప్రభవిల్లుతున్నది వాక్ స్వాతంత్ర్యం కాదు. వర్ధిల్లుతున్నది స్వేచ్ఛా వాణిజ్యం మాత్రమే.

భారత ప్రభుత్వంతో, శక్తివంతమైన మీడియా సంస్థలు రాజీ ఒప్పందం చేసుకున్నాయి. ప్రభుత్వం, డిజిటల్ స్పేస్‌లోని ప్రజాస్వామిక వేదికలన్నింటినీ నిర్దాక్షిణ్యంగా అణిచేసింది. అందుకు 'ద వైర్'పై ప్రభుత్వం జరిపిన దాడి తాజా ఉదాహరణ. పెగాసస్ కుంభకోణం వంటి పలు అంశాలపై ఆ సంస్థ అసాధారణమైన పరిశోధనలు నిర్వహించింది.

ది వైర్ సంస్థపై ఢిల్లీ క్రైమ్ బ్రాంచి పోలీసులు దాడి చేశారు. దానికి వ్యతిరేకంగా ఫోర్జరీ, చీటింగ్, నేరపూరిత కుట్ర, అపనమ్మకం వంటి హాస్యాస్పదమైన ఆరోపణలు గుప్పించారు. ప్రధానంగా ఆ సంస్థ ఉన్నత నాయకత్వం లక్ష్యంగా ఈ ఆరోపణలు చేశారు. పరిశోధనలకు పూనుకున్న ఒక పత్రికకు వ్యతిరేకంగా కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు చేశారు. అనంతరం ఆ పత్రికకు బహిరంగ క్షమాపణ చెప్పుకున్నారు. ఆ పరిశోధనకు వ్యతిరేకంగా వండివార్చిన కల్పిత కథనాలను కూడా ఉపసంహరించుకున్నారు.

బిజెపి ఐటి విభాగం జాతీయ కన్వీనర్ అమిత్ మాలవ్యా ఫిర్యాదు ఆధారంగా 'ది వైర్'పై మరోసారి దాడి చేశారు. ఆ సంస్థకు చెందిన అనేక పరికరాలను, హార్డ్ డిస్కులను పోలీసులు నిష్కారణంగా స్వాధీనం చేసుకున్నారు.

ఒక వైపున, అసమ్మతిని అణిచేయటానికి డిజిటల్ ప్రపంచపు 'స్వేచ్ఛా గళం' వేదికలు ప్రభుత్వంతో షరీకైనాయి. వేరొక వైపున స్వతంత్ర జర్నలిజానికి పరిమితమైన 'నెట్ స్పేస్' (సోషల్ మీడియా_మాత్రమే కాదు) కుదించుకుపోతున్నది. అది భారత్‌లో బహిరంగ దాడులకు గురౌతున్నది.

కాశ్మీర్ అంతటి విశాల ప్రాంతంలో 'నెట్'కు ఊపిరాడని స్థితి ప్రపంచంలో మరెక్కడా లేదు. ఈ ప్రాంతంలో నెలల పర్యంతం ఇంటర్ నెట్ మూతబడింది. ఈ పరిస్థితి సాధారణ ప్రజలను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్నది. పత్రికలు, ప్రచురణ సంస్థలకు వినాశకరంగా మారింది.

కరోనా మహమ్మారి కాలంలో, మీడియాపై అణచివేతలు పెంచారు. ఉరితాళ్లు బిగించారు.

స్థానిక ఆసుపత్రుల్లోని పరిస్థితులను వివరిస్తూ కేవలం కథనాలు ప్రచురించినందుకే, 'మహమ్మారి వ్యాధుల చట్టం 1897' కింద అనేక మంది జర్నలిస్టులను అరెస్టు చేశారు. తమిళనాడులో ఆండ్రూ శ్యామ్‌రాజ్ పాండ్యన్‌కు కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. కోయంబత్తూరు మెడికల్ కాలేజిలో డాక్టర్లు ఇతర అంశాలతో పాటు ఆహారము, పిపిఇ కిట్ల కొరతనెదుర్కొంటున్నారని, తన పోర్టల్ 'సింప్లిసిటీ' లో ఒక చిన్న వార్తను ప్రచురించినందుకే అతడు అంతటి వేధింపులకు గురికావలసివచ్చింది.

2020 ఏప్రిల్‌లో అండమాన్ ద్వీపానికి చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ జుబేర్ అహమ్మద్ స్వల్ప ట్వీట్ చేసినందుకు అరెస్టు చేయబడ్డాడు. అతని ట్వీట్ ఇలా ఉంది :" కోవిడ్ రోగులతో ఫోన్‌లో మాట్లాడిన కారణంగా వారి కుటుంబ సభ్యులను హోం క్వారంటైన్‌లో పెట్టారు. అలా ఎందుకు జరిగిందో ఎవరైనా వివరించగలరా ?"

ఆ దీవుల్లో దీనికే సంబంధించిన మరొక ఆశ్చర్యకరమైన పరిణామం జరిగింది. కరోనా వైరస్ పోకిందన్న నిర్ధారణ జరిగిన కొందరు, తమ బంధువులతో, ఎలాంటి భౌతికపరమైన సంబంధం లేకుండా, కేవలం ఫోన్‌లో మాత్రమే సంభాషించారు. అలాంటివారిని క్వారంటైన్‌పాలు చేశారు. అహమ్మద్ భయాందోళనలు వ్యాప్తిచేశాడని, మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టాడని అధికారులు ఆరోపించారు. ఇలాంటి పర్యవసానాలకు దారితీసిన మరొక పరిణామం జరిగింది. అహమ్మద్ ట్వీట్ రాక ముందే, అదే సమస్యలపై స్థానిక దినపత్రిక 'అండమాన్ క్రానికల్' నకిలీ వార్తలను వ్యాప్తిచేసిందన్న ఆరోపణకు గురైంది. కానీ ఆ పత్రికపై ఎలాంటి చర్యలూ లేవు.

కలకత్తా హైకోర్టు ఆ కేసును చెత్తబుట్టలో

వేస్తూ ఇలా వ్యాఖ్యానించింది : ఈ విధమైన క్రిమినల్ కార్యకలాపాలకు యఫ్ఐఆర్‌ను కూర్పుచేయటమంటే "న్యాయ ప్రక్రియను నిందించటమే. కోర్టు అధికారాలను దుర్వినియోగపర్చటమే..."

ఏకపక్షమైన అరెస్టులు, కేసులు బనాయింపులు వంటి పలు అక్రమ చర్యలు కొల్లలుగా జరిగాయి. 2019లో మీడియా దృష్టిని ఆకట్టుకున్నవి, ఇబ్బందులకు గురిచేసిన ఇలాంటి కేసులు 50కి పైగా ఉన్నాయి. కానీ కరోనా మహమ్మారి కాలంలో అనేక మంది జర్నలిస్టులు అరెస్టు చేయబడ్డారు. అందుకు ప్రభుత్వం ఎక్కువగా 'ఎపిడమిక్ డిసీజెస్ ఆక్ట్'వంటి వలస కాలపు చట్టాలనే వినియోగించింది.

ప్రజలు –సోషల్ మీడియాలో గాని, ఇంటర్‌నెట్ ఆధారిత ఇతర ప్రచురణల ద్వారాగానీ, ప్రభుత్వంపై ఎలాంటి రెచ్చగొట్టే ఉపన్యాసాలకూ పాల్పడ లేదు. ఎలాంటి హింసనూ ప్రేరేపించ లేదు. ఎవరినీ ఇబ్బంది పెట్ట లేదు.

నీవు ఏ విధంగానైనా పరిశీలించు. మనం ప్రాధమికంగా కార్పొరేట్ మీడియా గుత్తాధిపత్యపు యుగంలోకి తిరిగి ప్రవేశించాము. ప్రపంచంలో అత్యాధునిక సాంకేతికత గల గుత్త సంస్థలన్నీ, అతిపెద్ద కార్పొరేషన్‌లేనని మరచిపోవద్దు. ఈ కార్పొరేషన్‌లు మరియు నిరంకుశ ప్రభుత్వాల కూటమి ప్రాణాంతకమైన సంయోగమేనని గుర్తించాలి. ఆ కూటమి ప్రజాస్వామ్యానికి వినాశనకరంగా పరిణమిస్తుంది.

"నీవు ఏ విధంగానైనా పరిశీలించు. మనం ప్రాధమికంగా కార్పొరేట్ మీడియా గుత్తాధిపత్యపు యుగంలోకి తిరిగి ప్రవేశించాము. ప్రపంచంలో అత్యాధునిక సాంకేతికత గల గుత్త సంస్థలన్నీ, అతిపెద్ద కార్పొరేషన్‌లేనని మరచిపోవద్దు. ఈ కార్పొరేషన్‌లు మరియు నిరంకుశ ప్రభుత్వాల కూటమి ప్రాణాంతకమైన సంయోగమేనని గుర్తించాలి. ఆ కూటమి ప్రజాస్వామ్యానికి వినాశనకరంగా పరిణ మిస్తుంది."

మొత్తం మీద మీడియా కార్పొరేటీకరణ ప్రభావాలు :

'మాస్ మీడియా' అనేది వాస్తవికత నుండి విడిపోవటమే మన కాలపు ప్రాథమిక లక్షణం. పేదలు, బలహీనుల సమస్యలను కప్పిపెట్టే విధానాన్ని కార్పొరేట్ మీడియా అమలు చేస్తున్నది. ఆదాయం సమకూర్చే అంశాలను వ్యాప్తిచేయటం, ఆదాయం రాకుంటే ప్రధానమైన అంశాలను కూడా వ్యాప్తి చేయరాదన్నదే ఇక్కడి సూత్రం. జాతీయ దిన పత్రికలు గ్రామీణ భారతం వార్తలకు తమ మొదటి పేజి స్థలంలో సగటున 0.67శాతానికి మించకుండా మాత్రమే కేటాయిస్తున్నాయి. ఈ సమాచారాన్ని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్– ఢిల్లీ సంస్థ సమాచార విశ్లేషణ అందజేస్తున్నది.

జర్నలిజం, ప్రజా సంబంధాలు, ప్రకటనల విధానం, రాజకీయ ప్రచారాల మధ్య సరిహద్దులు అదృశ్యమైపోయాయి. మీడియా రంగంపై కార్పొరేట్‌ల అదుపు బలపడేకొద్దీ జర్నలిజం కుదించుకుపోతున్నది. 1980ల నుండి యుయస్ఎ లోను, 90వ దశకం చివరి నుండి భారత్‌లోనూ జర్నలిజంలో కంటే, ప్రజా సంబంధాల (పిఆర్) విభాగంలో ఉద్యోగాలు మరింత వేగంగా పెరిగాయి.

అదే కాలంలో పిఆర్ రంగం, కార్పొరేట్‌ల 'సమాచార వ్యవస్థ'గా ఘనంగా పిలువబడుతున్నది. వాటి మధ్య సరిహద్దులు చెరిపేయబడుతున్నాయి. తద్వారా పరిశ్రమలో, పిఆర్ మరియు జర్నలిజం రంగాల మధ్య నిరంతరం తిరుగాడే 'రివాల్వింగ్ డోర్' ఏర్పాటయింది.

భారత్‌లో మతము, మార్కెట్ వాదాల కలయికతో ఒక కూటమి రూపొందింది. దానితో కార్పొరేట్ యాజమాన్యం మరింత సంక్లిష్టంగా మారింది. ఆవిధమైన ప్రత్యేక కలయికతో బడా వ్యాపార కుటుంబాలు, మీడియా గ్రూపులు కలగలిశాయి. ఫలితంగా రాజకీయ రాజవంశాలు, వాటి పాలనలు అవతరించాయి. దానితో కార్పొరేట్ మీడియా శక్తి ప్రజాస్వామ్యానికి మరణ హేతువుగా మారింది.

జర్నలిస్టులు సంఖ్య రీత్యా ఆశావహంగా పెరుగుతున్నారు. వారు కూడా సమాజంలోని మరి కొందరివలే అవే శక్తులకు వ్యతిరేకంగా నిలవటాన్ని గమనించవచ్చు : కార్పొరేట్ శక్తిని ప్రతిఘటించకుండా, వారు భారతీయ మీడియా మూలాల్లోకి తిరిగివస్తారన్న ఆశ లేదు. ఏవిధమైన అభివృద్ధికరమైన మార్పులకు అవకాశం లేదు. కార్పొరేట్‌ల నాయకత్వంలోని రాజ్యంగా భారత్ రూపొందుతున్నది. దానితో దేశంలో సిండికేట్ల రూపంలో కార్పొరేట్ల శక్తి పెరుగుతున్నది. ఈలోగా మీడియా పైనా, జర్నలిస్టుల పైనా నిర్హేతుకమైన దాడులు జరుగుతున్నాయి. 'హవాలా' (మనీ లాండరింగ్) నెపంతో వారిని జైళ్లకు లాగే దుశ్చర్యలు మాత్రం పెరుగటం ఖాయం.

పది సంత్సరాల క్రితం వరకూ, భారతీయ మీడియా రాజకీయ పరంగా స్వేచ్ఛాయుతంగా మనగల్గింది. నాడది కేవలం లాభార్జనకే బందీయై వుండేది. దానితోపాటు నేడది రాజకీయంగా కూడా బందీగా మారే క్రమం ఊపందుకుంది.

(అనువాదం: వై సిద్ధయ్య)

# అదానీ ప్రదేశ్‌గా ఆంధ్ర ప్రదేశ్

(10వ పేజీ తరువాయి)

బిగించింది. అక్కడి సోలార్ విద్యుత్‌ను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి) ద్వారా కొనుగోలు చేయించి, మన రాష్ట్రానికి సరఫరా చేయాలన్నది పథకం. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 'సెకి'తో ఒప్పందం చేసుకొని, ఇక్కడ వ్యవసాయ పంప్‌సెట్లకు ఉచిత విద్యుత్ సరఫరాకు వినియోగిస్తామని చెబుతోంది. మన రాష్ట్రంలోనే అంతకన్నా చౌకగా ఉత్పత్తి చేసే అవకాశం వున్నా, ప్రసార, పంపిణీ నష్టాలు తగ్గించుకునేందుకు వీలున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రాజస్థాన్‌లో అదానీ గ్రూపు ఉత్పత్తి చేసే సోలార్ విద్యుత్‌ను సెకి ద్వారా కొనడానికి నిర్ణయించడం అదానీ పట్ల అవ్యాజ ప్రేమకు నిదర్శనం.

మొత్తంగా చూస్తే రాష్ట్రంలోని సుదీర్ఘ సముద్ర తీరంలో గణనీయమైన భాగం అదానీ గ్రూపు గుప్పెట్లోకి పోర్టుల ద్వారా పోయింది. మెట్ట ప్రాంతాల్లోని వేల ఎకరాల భూములు సోలార్, విండ్ పవర్ పేరిట అదానీ గ్రూపు తన్నుకుపోతోంది. గిరిసీమల్లోనూ పంప్డ్ స్టోరేజి పవర్ ప్లాంట్లంటూ భూమి, జలవనరులను తన చేతుల్లోకి తీసుకుంది. ఈ విధంగా సముద్ర తీరం నుండి తూర్పు కనుమల వరకూ అదానీ సామ్రాజ్యం విస్తరించడానికి వైసిపి ప్రభుత్వం అండదండలందించడం రాష్ట్ర ప్రయోజనాలకు ముప్పు. ప్రజా ప్రయోజనాలకు ప్రమాదం. ఇది ఆంధ్రప్రదేశ్‌గా వుండక తప్ప అదాని ప్రదేశ్ కానివ్వరాదు. తస్మాత్ జాగ్రత్త!

# 2021 జనగణను ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోంది?

**టికె రాజాలక్ష్మి**



రచయిత సీనియర్ జర్నలిస్టు

బడ్జెట్ అంచనాలకు, నియోజకవర్గాల పునర్విభజనకు, పరిపాలన ప్రణాళికకు జనగణనే కీలకం

1881సంవత్సరంలో ప్రారంభించిననాటి నుండి ఇప్పటి వరకు ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జనగణన జరగడం ఎప్పుడూ ఆగలేదు. 2021 జనగణన ఇప్పటికి పలుమార్లు వాయిదా పడింది. ఈ వాయిదాకు కరోనాను కారణంగా చూపుతున్నారు. కోవిడ్ వ్యాప్తి వల్ల తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కొన్న యుకె, చైనా, యుఎస్‌లు తమ జనగణనను ఎప్పుడో పూర్తిచేశాయి. నరేంద్ర మోడీ ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో ఇంకా కాలయాపన చేస్తూనే ఉంది.

డిసెంబరు 31,2022 వరకు నిలిపివేసిన తన పరిపాలన విధులను జూలై 1, 2023 వరకు పొడిగిస్తున్నట్లు జనవరి 6న భారత రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం ప్రకటించింది. ఆ తరువాత మాత్రమే జనగణన ప్రక్రియ ప్రారంభమవుతుందని, 2024 వరకు అది కొనసాగుతుందని దీనర్థం. 9 రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆ సమయంలో జనగణన ప్రక్రియ చేపట్టినా లేకున్నా పెద్ద ప్రభావం చూపదు.

**ఈ ఆలస్యం ఒక ఎత్తు అయ్యిఉండవచ్చు.**

సాధారణ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఓబిసి జనసంఖ్యలో మార్పులను బయటపడకుండా తొక్కిపెట్టాలని ప్రభుత్వం భావిస్తుండవచ్చు. రెండవది, మతాల జనాభా పెరుగుదల రేటు గురించి ప్రతి ఎన్నికలలోను బిజెపి నాయకులు వాడే మూస నినాదాలకు వాస్తవాలు భిన్నంగా ఉండవచ్చు.

మూడవది, కొన్ని మతాల జనాభా వృద్ధిరేటు సమాచారం వారికి చేదు నిజంగా మారుతుంది. నాలుగవది, తాము సాధించిన విజయాలు, ప్రజలకు లభిస్తున్న సౌకర్యాలు గురించి ప్రభుత్వం చెబుతున్న గొప్పలు జనగణన వల్ల అబద్ధాలుగా మారే ఆస్కారం ఉంది. కారణమేదైనా కేంద్ర ప్రభుత్వం 2021 జనగణన ఆలస్యం అవడానికి ఒక్క నిర్దిష్టమైన కారణాన్ని కూడా చూపలేకపోయింది.

**కోవిడ్ సాకు**

కేంద్ర హోంశాఖ మంత్రి నిత్యానంద రాయ్ జనగణన చేయాలన్నదే తమ ఉద్దేశ్యమని, అయితే కోవిడ్ కారణంగా తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ క్షేత్రస్థాయి కార్యాచరణను వాయిదా వేస్తున్నామని మార్చి 28, 2019న ప్రకటించారు. అదే మంత్రిగారు 2022 జూలైలో పార్లమెంటులో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ 2011 జనగణన ఆధారంగా జనాభా అంచనాల సాంకేతిక బృందం తయారు చేసిన నివేదికలోనే 2011 నుండి 2036 వరకు సరిపడా దేశం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన జన గణాంక వివరాలు లభిస్తాయని తెలిపారు.

**జాప్యం అవరోధంగా మారుతోంది**

కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కింపు ప్రక్రియను అడుగు కూడా ముందుకు కదపకుండా తమ ఉద్దేశ్యాన్ని తేటతెల్లం చేస్తున్నది. 140 సంవత్సరాల చరిత్రలో మొదటిసారి కాగితం, కలంతో మాత్రమే కాకుండా మొబైల్ పరికరాలతో సెన్సస్ సమాచారం సేకరిస్తామని 2019 ఏప్రిల్‌లో భారత రిజిస్ట్రార్ జనరల్ ప్రకటించారు. 2019 జూన్ 25న ఆగస్టు 12 నుండి సెప్టెంబరు 30 వరకు ప్రయోగాత్మకంగా దేశంలో జనగణన చేపట్టబోతున్నామని గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది.

కరోనా మహమ్మారి విజృంభించక ముందే అంటే 2020 మార్చి 7నే కేంద్ర హోంశాఖ జనగణన చట్టం 1948 ప్రకారం నివాస గృహం, కుటుంబం, గృహోపకరణాలు, కుటుంబం యొక్క ఆస్తులు, కుటుంబ యజమాని వివరాలు కూడా సేకరించేలా 30 ప్రశ్నలతో కూడిన జాబితాను తయారు చేశామని ప్రకటించింది. ఈ ప్రశ్నాపత్రం ఆ కుటుంబం ల్యాప్‌టాప్, కంప్యూటర్, ఇంటర్నెట్ లేదా మొబైల్ ఫోన్ కలిగి ఉందా లేదా అనే సమాచారాన్ని కూడా వెల్లడి చేస్తుంది.

ఇది జరిగిన కొన్ని వారాలకు కోవిడ్ విజృంభణతో లాక్‌డౌన్ ప్రకటించాక జరిగిన పరిణామాలు తెలిసినవే. సెకండ్ వేవ్ వచ్చినప్పుడు జనాభా లెక్కింపు జరిగే అవకాశం గురించి ఎవరూ ఆలోచించలేము. ఆ తరువాత 2020 నవంబర్‌లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 2021లో నాలుగు రాష్ట్రాలకు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి ఎన్నికలు జరిగాయి. మరో రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగాయి. కానీ ఒక్కరు కూడా 2021 జనాభా లెక్కింపు గురించి ప్రస్తావించలేదు.

2022 మార్చిలో మరొక గెజిట్ నోటిఫికేషన్‌తో ప్రజలు స్వయంగా తమ వివరాలు నిర్దేశిత పత్రాలు పూరించడం లేదా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు వీలు కల్పించేలా జనగణన చట్టానికి సవరణలు చేశారు.

ఇది అసాధారణమైందని ఫ్రంట్‌లైన్ గణాంక నిపుణులు పేర్కొన్నారు. ఇందులోని ప్రశ్నలకు వ్యక్తులు సమాధానాలివ్వాలంటే వాటికి సంబంధించి ముందస్తుగా చాలా సమాచారాన్ని విశ్లేషణ చేసుకుని సిద్ధం కావాలి. ఇది శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు మాత్రమే చేయగలిగిన పని. ఈ స్వీయ గణన ఆలోచన పూర్తిగా సందేహాస్పదమని, శిక్షణ పొందిన ఎన్యూమరేటర్ల ద్వారానే జనగణన జరగాలని ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్‌లో మైగ్రేషన్ అండ్ అర్బన్ స్టడీస్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ ఆర్.బి. భగత్ అభిప్రాయపడ్డారు.

**సర్వేలు ప్రత్యామ్నాయం కాదు**

జనగణన ప్రక్రియ సకాలంలో జరగడానికి విద్యాపరమైన చిక్కులు ఉన్నాయని ప్రొఫెసర్ భగత్ చెప్పారు.

సెన్సస్ ఒక చిన్న తప్పుకు కూడా ఆస్కారం ఇవ్వకుండా సంపూర్ణ సమాచారం ఇచ్చే ఏకైక ప్రక్రియ. ప్రభుత్వానికి ప్రజాపంపిణీ వ్యవస్థ, ఉపాధి హామీ వంటి పథకాలు అమలవుతున్న తీరు గురించిన సమాచారం సేకరించడానికి నేషనల్ శాంపిల్ సర్వే, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే, హెల్త్ మేనేజిమెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ సర్వేలంటూ వివిధ యంత్రాంగాలు ఉన్నాయి. కానీ సెన్సస్ దేశంలోని జనాభా, వారికి సంబంధించిన అన్ని రకాల సమాచారాన్ని

పొందుపరిచి చూపుతుంది. శాంపిల్ సర్వే, సెన్సస్ పరస్పర సంబంధితమైనవైనా శాంపిల్ సర్వేలు కూడా సెన్సస్ సమాచారంపైనే ఆధారపడి ఉంటాయి.

10 సంవత్సరాలకు ఒకసారి జనగణన జరిగిప్పటికీ అది దీర్ఘకాల అవసరాలకు తగిన కూర్పులు చేర్పులకు, అంచనాలకు కావలసిన సమాచారాన్ని అందిస్తుందని భగత్ అన్నారు. ఇది విస్తృతంగా సేకరించిన సమాచారం ప్రాతిపదికన తయారు చేయబడుతుంది. ఈ సమాచారంపై ఆధారపడే బడ్జెట్ కేటాయింపులు, వనరుల కేటాయింపు ఉంటాయి. నియోజకవర్గాల రాజకీయ విభజన, రాజకీయ ప్రాతినిధ్యం మరియు ప్రణాళికల కోసం ఈ డేటానే ఉపయోగించుకుంటారు. అందువల్లనే జనగణన అపారమైన విలువ కలిగినదని భగత్ అన్నారు.

భారతదేశంలో జనగణన రెండు భాగాలుగా ఉంటుంది. కుటుంబాలు మరియు జనాభా. 2001, 2011 జనాభా లెక్కింపుల్లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు సంఖ్య, మహిళలు పెద్దలుగా ఉన్న కుటుంబాల సంఖ్య వంటి సమాచారం భారీగా సేకరించబడిందని భగత్ పేర్కొన్నారు.

జనాభా లెక్కింపులో కుటుంబ పెద్ద నుండి కుటుంబ సభ్యుల వయసు, జెండర్, వృత్తి విశ్లేషణ మరియు వలసలు వెళ్ళిన సమాచారం సేకరించబడుతుంది. శాంపిల్ సర్వేలు, ప్రాజెక్టులు జనగణనను భర్తీ చేయలేవు. అపారమైన విశ్లేషణలకు ఉపయోగపడే సమాచారాన్ని స్థూలంగా, నిర్దిష్టంగా అందించేది జనగణన. నేషనల్ శాంపిల్ సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) వంటి సంస్థలు గణాంకాలను అంచనా వేయడానికి దోహదపడతాయి. కానీ అవి సెన్సస్ ధృవీకరణతోనే చెల్లుబాటవుతాయి. దీన్నే జనాభా శాస్త్ర నిపుణులు, గణాంకవేత్తలు సమాచారం యొక్క త్రిభుజం అని పిలుస్తారు. శాంపిల్ సర్వేలు కొంతమందిని లేదా కొన్ని అంశాలను మాత్రమే ఎంచుకుని నమూనా సర్వేలు చేస్తాయి. కానీ జనగణన అనేది దేశంలోని ప్రతివ్యక్తినీ గణిస్తుంది. సమాచారాన్ని సేకరిస్తుంది.

> **“ లింగ నిష్పత్తిలో వస్తున్న ప్రతికూల మార్పులను 1990ల ప్రారంభంలో జరిగిన సెన్సస్ సమాచారం ద్వారానే మన దేశం గుర్తించగలిగింది. ఇది లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలను నేరాలుగా పరిగణించేలా చట్టాలను తీసుకురావడానికి దారి తీసింది. బేటీ బచావో, బేటీ పడావో వంటి పథకాలు, పాలసీల రూపకల్పనకు తన వంతు పాత్ర పోషించింది. ”**

లింగ నిష్పత్తిలో వస్తున్న ప్రతికూల మార్పులను 1990ల ప్రారంభంలో జరిగిన సెన్సస్ సమాచారం ద్వారానే మన దేశం గుర్తించగలిగింది. ఇది లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలను నేరాలుగా పరిగణించేలా చట్టాలను తీసుకురావడానికి దారి తీసింది. బేటీ బచావో, బేటీ పడావో వంటి పథకాలు, పాలసీల రూపకల్పనకు తన వంతు పాత్ర పోషించింది. సెన్సస్ సమాచారం ప్రజాస్వామ్య, రాజకీయ ప్రాతినిధ్యానికి కీలకం. ఉదాహరణకు పునర్విభజనలో సమాన ప్రాతినిధ్యాన్ని నిర్ధారించడానికి జనగణన ఒక మార్గం.

ఎక్కువ మంది గణాంకవేత్తలు, నిపుణులు జనగణనలో నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పిఆర్) ఉండకూడదని అభిప్రాయపడుతున్నారు. ఎన్‌పిఆర్ పౌరసత్వ చట్టం 2003కి లోబడి ఉంటుంది. దీన్ని సెన్సస్‌తో అనుసంధానిస్తే సమాచారం యొక్క నాణ్యత, ఖచ్చితత్వంపై దాని ప్రభావం పడుతుంది. ప్రజలు తమ సమాచారాన్ని నిస్సంకోచంగా తెలియజేయలేకపోతే దానివల్ల సెన్సస్ గణాంకాలు ఖచ్చితత్వాన్ని కోల్పోతాయనే భయం ఉంది. వివాదాస్పద ఎన్‌పిఆర్, జాతీయ పౌరసత్వ రిజిస్టరులాగా కాకుండా సెన్సస్ ప్రజల సమాచారాన్ని, గోప్యతను పరిరక్షిస్తుంది.

కేరళ రాష్ట్ర స్టాటిస్టిక్స్ కమిషన్ ఛైర్మన్, నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్ మాజీ సభ్యులు అయిన పి.సి.మోహనన్ జనాభా లెక్కింపు ఆలస్యం చేయడం తీవ్రమైన అంశంగా పేర్కొన్నారు. గత ఒకటిన్నర సంవత్సరాలలో సెన్సస్ అడ్వైజరీ కమిటీ ఒక్కసారి కూడా సమావేశం కాకపోవడాన్ని ఎత్తి చూపారు. పాలకులు ఇంకా 2011 గణాంకాలనే ఇంకా వినియోగిస్తున్నారని, దాని వల్ల ప్రస్తుత జనాభా అవసరాలకు తగినట్లుగా అంచనాలు రూపొందించలేమని విమర్శించారు. ఈ ఆలస్యం దేశ అభివృద్ధిని దెబ్బతీస్తుందని మోహనన్ విమర్శించారు.

కరోనా మహమ్మారి అసాధారణంగా మారింది. కానీ అది చాలా పనులు చేయకుండా ఉండడానికి సాకుగా మారింది. ఒక డెమోగ్రఫర్ చెప్పినట్లుగా ఇది సౌలభ్యం యొక్క కలయిక. ఖచ్చితమైన సమాచార సేకరణ ప్రాధాన్యత కోల్పోతున్నది. ఆ స్థానంలో ‘విస్తరించిన డిజిటల్ మరియు కుచించుకుపోతున్న భౌతిక’ తరహా ఆలోచనా విధానాలు ఇప్పుడు బహిర్గతమవుతున్నాయి.

ఆర్థిక పరమైనవైనా, కులం లేదా నిరుద్యోగం గణాంకాలేవైనా వాటి పట్ల ప్రభుత్వ అసంతృప్తి స్పష్టమైపోయింది. కానీ జనగణన ఆలస్యం అయ్యేకొద్దీ అది పెద్దసంఖ్యలో ప్రజలకు పెనునష్టం వాటిల్లేలా చేస్తుంది. పరిపాలన మూలాల్ని ధ్వంసం చేస్తుంది.

**(అనువాదం: వల్లభనేని గీత)**


**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

# ఉగ్రవాదం సాకుతో కొత్త ప్రచ్ఛన్న యుద్ధం

**విజయ ప్రసాద్**

బొకొహరాం తీవ్రవాదులు చాద్ – నైగర్ సరిహద్దు వద్ద సైనిక స్థావరంపై నవంబరు చివరిలో దాడి చేసి పదిమంది చాద్ మిలిటరీ సిపాయిలను చంపేశారు. కామెరూన్, చాద్, నైగర్, నైజీరియాలతో కూడిన చాద్ బేసిన్ సరస్సు, ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో జిహాదీలు తమ ప్రాబల్యాన్ని పెంచుకునే యత్నంలో భాగంగానే ఈ దాడి జరిగింది. బొకొహరాం 2002లో ఏర్పాటైనంది. బొకొహరాం అంటే పశ్చిమ దేశాల నాగరికతను అడ్డుకోవడం. నైజీరియా ఉత్తర ప్రాంతంపై పట్టుకోసం ఆ దేశ సైన్యంతో తలపడడం ద్వారా ఈ ప్రాంతంలో దార్ అల్ ఇస్లాంను నెలకొల్పగలమని బొకొహరాం బోధకులు భావిస్తున్నారు. చాద్ బేసిన్‌లోని నాలుగు దేశాల సైన్యాల దాడులను తట్టుకోగలిగేలా బొకొహరాం ఎదగడానికి ప్రజలను పీడిస్తున్న భయంకరమైన సామాజిక అసమానతలు, వారిని అణచివేసే వలసపాలన అవశేషాలే కారణమని చెప్పాలి. ముఖ్యంగా నైజీరియన్ సైనికుల ప్రచారాలు ప్రభావం చూపాయి. వారు బొకొహరాంను చీల్చి, ఇప్పుడు తనకు తాను ఇస్లామిక్ స్టేట్ (పశ్చిమాఫ్రికా రాష్ట్రం) అని చెప్పుకుంటున్న ఒక గ్రూపును రాడికలైజ్ చేశారు. నవంబరు చివరిలో జరిగిన దాడుల్లో బొకొహరాం పోరాటవాదులు ఇస్లామిక్ స్టేట్ పోరాటవాదులతో కలిసి పాల్గొనడంతో వాటి ప్రభావం మరింతగా పెరిగింది. చాద్ (మిలిటరీ పాలనలో ఉంది), కామెరూన్ (అంతర్యుద్ధంలో కొట్టుమిట్టాడుతున్నది)లలో రాజకీయ సంక్షోభాలు కొనసాగుతుండడంతో ఈ దేశాల్లో సైన్యం బొకొహరాం తిరుగుబాటును సమర్థవంతంగా తిప్పికొట్టగలిగే స్థితిలో లేవు. అమెరికా రక్షణ మంత్రిత్వ శాఖ నిధులతో నడిచే 'ఆఫ్రికన్ సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్' అనే సంస్థ 2022 ఆగస్టులో ఓ నివేదిక విడుదలజేసింది. ఆఫ్రికాలో సాయుధ ఇస్లామిక్ గ్రూపుల పరివర్తన గురించి అది ప్రధానంగా నొక్కి చెప్పింది. హింసకు మిలిటెంట్ ఇస్లామిక్ గ్రూపులతో ముడి పెడుతూ 2012 నుంచి ఇప్పటివరకు మిలిటెంట్ ఇస్లామిక్ గ్రూపుల హింస 300 శాతం పెరిగిందనీ, 2019 నుంచి చూసుకుంటే రెట్టింపయిందని పేర్కొంది. వీరి కార్యకలాపాలు ప్రధానంగా ఆఫ్రికాలోని సహేల్, సోమాలియాలోను ఉన్నాయి. బహుశా ఈ దృష్టితోనే గత ఏడాది డిసెంబరు 23న సోమాలియా రాజధాని మొగదిషు ఈశాన్య ప్రాంతం కెడాలెలో అల్‌షబాబ్ పోరాటవాద స్థావరాలపై అమెరికా ఆఫ్రికన్ కమాండ్ వైమానిక దాడులకు తెగబడి ఉండొచ్చు. అయితే, ఆ వైమానిక దాడిలో చనిపోయింది అల్ షబాబ్ పోరాటవాదులేనా లేక సాధారణ పౌరుల్ని తీవ్రవాదులని పొరపడిందా అన్న విషయం ఇప్పుడే కాదు, ఎప్పటికీ వెలుగు చూడకపోవచ్చు. అమెరికా పైకి ఏం చెప్పినప్పటికీ ఈ రకమైన వైమానిక దాడులు తరచూ దుర్వినియోగం చేయబడుతున్న మాట నిజం. ఇంత మంది తీవ్రవాదులను మట్టుబెట్టడంలో సైన్యం విజయవంతమైందని, ఇది మంచి ఫలితాలిచ్చిందని అమెరికన్ అధికారులు చెబుతుంటారు. వాస్తవానికి రాజ్యం సాగించే ఈ హత్యాకాండ తీవ్రవాద కార్యకలాపాలు మరింతగా పెరిగేందుకే దారి తీస్తాయి. 2022 మే నెలలో ఆఫ్రికన్ యూనియన్ 'ఆఫ్రికన్ మానవతావాద సంస్థ' (ఎఎఫ్‌హెచ్ఎ) నొకదాన్ని ఏర్పాటు చేసింది. ప్రపంచ జనాభాలో 18 శాతం వాటా కలిగివున్న ఆఫ్రికా ఖండంలో ప్రపంచ మానవతా సంక్షోభాల్లో నాలుగింట మూడొంతులు చోటుచేసుకుంటున్నాయని అది తెలిపింది. ఈ సంక్షోభాలు ఆకలి, అంతర్యుద్ధాల వల్ల వచ్చినవే. 1998లో ఆఫ్రికాలోని గ్రేట్ లేక్స్ ప్రాంతంలో మొదలైన యుద్ధం 60 లక్షల మంది ప్రాణాలను తోడేసింది. ప్రజాతంత్ర రిపబ్లిక్ కాంగో తూర్పు ప్రాంతం ఈ సంఘర్షణకు కేంద్ర బిందువుగా ఉంది. వలసవాదులు వనరులను కొల్లగొట్టుకుపోవడం వల్ల అక్కడ ఆకలి రాజ్యమేలుతోంది.



రచయిత అంతర్జాతీయ రాజకీయ వ్యవహారాల విశ్లేషకుడు

(2021లో ఈ ఖండంలోని మొత్తం జనాభాలో అయిదో వంతు మంది ఆకలి కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నారు), ఆర్థిక, సామాజిక అసమానతలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ పరిస్థితులే ఆఫ్రికా ఖండాన్ని అంతర్యుద్ధాల వైపు నెడుతున్నాయి. పైకి కనిపించే సంఘర్షణ లోతుపాతులను, వాటికి గల కారణాలను తెలుసుకోవడమే ఎఎఫ్‌హెచ్ఎ ఉద్దేశం. నిజానికి ఆ కారణాలు గుర్తించడం ఏమంత కష్టమైన పనేమీ కాదు. ఆఫ్రికా ఖండ సంక్షోభానికి మూలాలు. సామాజిక అసమానతలు, నిరుద్యోగం, ఆకలి, నిరక్షరాస్యత, ఈ ఖండం నుంచి వనరులను కొల్లగొట్టడంలో ఉన్నాయి. ఎంతో ముఖ్యమైన ఈ అంశాల గురించి అమెరికా కానీ, ఇతర పశ్చిమ దేశాలు కానీ ఎన్నడూ మాట్లాడవు. మౌలిక సదుపాయాలు లేకపోవడం, ఆఫ్రికా దేశాలపై తీవ్ర రుణభారం మోపడం వంటి వాటిగురించి ఇవి ఎన్నడూ సీరియస్‌గా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ ఖండం నుంచి పెట్టుబడిని దొంగిలించు కుపోవడంపై ఇవి నోరు మెదవవు. (తప్పుడు ఇన్‌వాయిస్‌ల ద్వారా 5000 కోట్ల డాలర్ల మేర వార్షిక నష్టం వచ్చినట్లు వాణిజ్యం, అభివృద్ధిపై ఐరాస సదస్సు అంచనా). ఆఫ్రికా ఖండంలో తీవ్రవాదం, తిరుగుబాట్లు పెరగడానికి మూల కారణాలు తెలుసుకోగలిగే స్థితిలో ఎఎఫ్‌హెచ్ఎ లేదు. ఐరాస రూపొందించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోలేకపోవడమనేది వేరే విషయం. ఆఫ్రికన్ దేశాలు ఈ లక్ష్యాలను చేరుకోలేకపోవడానికి అంతకంతకూ క్షీణిస్తున్న వాటి సార్వభౌమత్వం ఒక ముఖ్య కారణం.

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ 2022 డిసెంబరులో నిర్వహించిన అమెరికా–ఆఫ్రికా నేతల శిఖరాగ్ర సమావేశానికి 49 ఆఫ్రికన్‌దేశాల నాయకులను ఆహ్వానించాడు. ఎప్పటిలానే ఈ సదస్సులోను బాధాకరమైన

భాషను ఉపయోగించారు. 'ప్రపంచ ప్రాధాన్యతలను పంచుకోవడంపై సహకారం' అన్న అంశం చుట్టూ ఈ సదస్సు తిరిగింది. అమెరికా ఉద్దేశం కూడా అదే. ఆఫ్రికా ఖండంపై చైనా, రష్యా ప్రభావాన్ని తగ్గించడం. అనేక ఆఫ్రికన్ దేశాల్లో మౌలిక సదుపాయాల రంగంలో చైనా పెట్టిన పెట్టుబడులకు ప్రతిగా తాను కూడా ఈ ఖండంలో పెద్దయెత్తున పెట్టుబడులు పెడతానంటూ అగ్ర రాజ్యం శుష్క వాగ్దానాలు చేసింది. అమెరికా పెట్టుబడులన్నీ పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో కూడినవని, వాస్తవికమైనవి కావనే సంగతి అందరికీ తెలిసిందే. వాస్తవంగా అభివృద్ధికి అవసరమైన (ప్రత్యేకించి విద్యుత్ రంగంలో) రంగాల్లో పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉంది. (విద్యుత్ పవర్ గ్రిడ్, మౌలిక సదుపాయాల్లో మూడోవంతు ప్రాజెక్టులు చైనా ఆర్థిక సహకారంతో చేపట్టినవే. 2010 నుంచి చైనా వీటికి ఆర్థిక సహకారం అందిస్తున్నది). 2010నాటికే చాలా ఆఫ్రికన్ దేశాల్లో ప్రధాన వాణిజ్య భాగస్వామిగా చైనా ఉన్నది. ఆఫ్రికా ఖండాన్ని బాధించే యుద్ధాల గురించి అంతగా పట్టించుకోని అమెరికా ఉక్రెయిన్‌లో యుద్ధానికి సంబంధించి రష్యా వైఖరిని ఖండించాలంటూ ఆఫ్రికన్ నాయకులపై ఒత్తిడి తెచ్చింది. వాణిజ్య రంగంలో చైనాతో పోటీ పడలేనని గ్రహించిన అమెరికా ప్లేటు ఫిరాయిస్తూ ఆఫ్రికా ఖండ భద్రత తన బాధ్యత అన్నట్టుగా చూపే ప్రయత్నం చేసింది. ఈ ఖండంలో మౌలిక సదుపాయాలు కల్పించానని అమెరికా చెబితే ఎవరూ నమ్మే స్థితి లేదు. అందుకే ఈ రకమైన అవతారమెత్తింది. ఆఫ్రికన్ వ్యవహారాలు చూసే అమెరికా రక్షణ శాఖ ఉప మంత్రి చిది బ్లైడెన్ జులైలో విదేశీ సంబంధాల యుఎస్ సెనేట్ కమిటీ ముందు హాజరై, ఆఫ్రికా ఖండంలో హింసాత్మక ఉగ్రవాద సంస్థలు, వాటి దాడులు విపరీతంగా పెరిగిపోయాయని గుండెలు బాదుకున్నారు. సహేల్ ప్రాంతంలో అమెరికా సేనల ప్రమేయం పెరగడమే దీనికి పరిష్కారం అన్నట్టు ఆమె మాట్లాడారు. ఇప్పటికే అమెరికా సైనిక స్థావరాలు (నైగర్‌లోని అగాడెజ్‌లో ప్రపంచంలోని అతి పెద్ద డ్రోన్ స్థావరంతో సహా) అక్కడ చాలా ఉన్నాయి. దీనికి అనుగుణంగా వ్యూహాత్మక అధ్యయనాల ఆఫ్రికా కేంద్రం ఒక నివేదికను వండివార్చింది. 2016-2022 మధ్య సహేల్‌లో ఇస్లామిక్ ఉగ్రవాద గ్రూపుల హింసాత్మ దాడులు 3,600శాతంపెరిగాయని ఆ నివేదిక పేర్కొంది. హింసాత్మక ఘటనలు ఇంత భారీగా ఎందుకు పెరిగాయని బ్లైడెన్ లాంటి విలక్షణమైన అమెరికా ప్రభుత్వ అధికారికి అడగాలని అనిపించలేదు ఎందుకనో. అమెరికా గతంలో సాగించిన ఉగ్రవాద వ్యతిరేక యుద్ధాల బాగోతం చూస్తే 1993లో సోమాలియాలో యుద్ధ ప్రభువులను ఓడించేందుకు అది చేసిన యత్నం బెడిసికొట్టింది. ఆ తరహా యుద్ధాలు ఇప్పుడు సుదూర జ్ఞాపకాలుగా ఉన్నాయి. జనాభాలో సగం మంది ముస్లింలు ఉన్న ఆఫ్రికా ఖండంలో వివిధ జిహాదీ గ్రూపులకు వ్యతిరేకంగా 2001 తరువాత చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక చర్యలను పరిశీలించినా ఇదే విషయం అర్థమవుతుంది. నల్లజెండాలతో ఉత్తేజం పొందే అల్‌ఖైదా, ఆ తరువాత ఐసిస్‌వంటి తీవ్రవాద సంస్థలను నిర్దాక్షిణ్యంగా అణచివేసేందుకు ఈ ఖండంలోని ప్రభుత్వాలకు రాజకీయ లైసెన్స్‌ను, ఆయుధాలను అమెరికా ప్రభుత్వం అందించింది. మానవ హక్కులకు సంబంధించిన ఆందోళనలను పక్కన పెట్టింది. బలవంతులు తమ అధికారాన్ని నిలబెట్టుకునేందుకు తిరుగుబాటును సాకుగా ఉపయోగించుకునేందుకు వీలు కల్పించారు. (నైగర్‌లో అధ్యక్షుడు మహమ్మద్ ఇసోఫో అనుభవం అత్యంత ముఖ్యమైన ఇటీవలి ఉదాహరణల్లో ఒకటి ) 2011లో అమెరికా-నాటో యుద్ధం ఆ దేశాన్ని నాశనం చేయడమే కాదు సహేల్ ప్రాంతమంతటా అరాచకం ప్రబలేందుకు కారణమైంది. మాలి, బుర్కినాఫాసోల్లో జిహాదీ గ్రూపులను ఓడించడంలో అమెరికా, యూరోపియన్ యత్నాలు విఫలమయ్యాయి. ఈ దేశాల్లో భద్రత తీసుకురావడానికి అన్ని మార్గాలు ఉపయోగిస్తామని ప్రతిజ్ఞ చేసిన ఈ రెండు దేశాల్లో సైనిక తిరుగుబాట్లు వచ్చాయి (ఫ్రెంచ్ బలగాల బహిష్కరణతో ఇవి మొదలైనాయి). ఆఫ్రికన్ నిరంకుశ నేతలకు వందల కోట్ల డాలర్ల అమెరికన్ మిలిటరీ సాయం అందించినా, ఆ దేశాల్లో మతపరమైనవి కన్నా ఆకలి, నిరుద్యోగ సంక్షోభాల వల్ల తలెత్తిన తిరుగుబాట్లను నిరోధించడంలో విఫలమైంది. దీనికి పెంటగాన్ తప్పుడు అంచనాలు, ప్రాధాన్యతలు ఒక ముఖ్య కారణమని చెప్పాలి. అమెరికా ప్రభుత్వం, ప్రైవేట్ ఫౌండేషన్ అందించే సాయంలో చాలా వరకు నిర్దాక్షిణ్యమైన సైనిక చర్యకు లేదా అసమ్మతిని నేరపూరితంగా పరిగణించి, వాటిని అణచివేసేందుకు ఉపయోగించింది. హింసాత్మక తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు (పొరుగు నిఘా పథకాలతో సహా) పౌర సమాజం వంటి పదాలను ఇప్పుడు ఉపయోగిస్తున్నది.

ఉగ్రవాదం... ఉగ్రవాదం...ఉగ్రవాదం. 2001 నుంచి అమెరికన్ భద్రతా దళాలు దీనిని ఒక మంత్రంగా జపిస్తున్నాయి. మారిటానియా నుండి నైగర్ దాకా అంటే ఉత్తర ఆఫ్రికా సెంట్రల్ బెల్ట్ అంతటా ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే పేరుతో ఈ ప్రాంత దేశాలను కలుపుకుని 2002లో 'యుఎస్ పాన్ సహేలి ఇనిషియేటివ్' కార్యాలయాన్నొకదానిని ఏర్పాటు చేసింది. ఆ తరువాత ట్రాన్స్- సహారన్ ఉగ్రవాద వ్యతిరేక భాగస్వామ్యం' అన్న పేరుతో మరొకటి వచ్చింది. దీని కేంద్ర కార్యాలయం ఇప్పుడు యుఎస్ ఆఫ్రికా కమాండ్‌లో వుంది. ఓ విశ్లేషకుడు పేర్కొన్నట్టు 'సహారా' తీవ్రవాద ఎండమావిగా ఉన్న ఈ ఉగ్రవాదంపై యుద్ధానికి వందల కోట్ల డాలర్లు వెచ్చించారు. ఉత్తర ఆఫ్రికాలోని తీవ్రవాద గ్రూపులు చాలా వరకు స్మగ్లింగ్ ముఠాలు, నైరాశ్యం నుండి తలెత్తినవే. దీనికి మూల కారణం పేదరికం. దీని గురించి అమెరికాకు ఎప్పుడూమాట్లాడదు. దాని దృష్టంతా ఉపరితలం అయిన 'జిహాదిజం'పైనే. గ్రామంపై పడే ప్రతి బాంబు అశాంతినీ ప్రతీకార జ్వాలలను రగిలిస్తుంది. అది ఉగ్రవాదంపై దాడులు, ప్రతిదాడులతో ఒక విష వలయాన్ని సృష్టిస్తుంది. 'ఉగ్రవాదంపై యుద్ధం' అనే ఆలోచన ఈ ప్రాంతంలోని బలవంతులకు బాగా నచ్చుతుంది. ఎందుకంటే ఇది ఒక రకమైన 'క్లెప్టోక్రసీ' (పాలకులు తమ అధికారాన్ని

**"ఉగ్రవాదం... ఉగ్రవాదం...ఉగ్రవాదం. 2001 నుంచి అమెరికన్ భద్రతా దళాలు దీనిని ఒక మంత్రంగా జపిస్తున్నాయి. మారిటానియా నుండి నైగర్ దాకా అంటే ఉత్తర ఆఫ్రికా సెంట్రల్ బెల్ట్ అంతటా ఉగ్ర వాదాన్ని ఎదుర్కొనే పేరుతో ఈ ప్రాంత దేశాలను కలుపుకుని 2002లో 'యుఎస్ పాన్ సహేలి ఇనిషియేటివ్' కార్యాలయా న్నొకదానిని ఏర్పాటు చేసింది. ఆ తరువాత ట్రాన్స్- సహారన్ ఉగ్ర వాద వ్యతిరేక భాగస్వామ్యం' అన్న పేరుతో మరొకటి వచ్చింది. దీని కేంద్ర కార్యాలయం ఇప్పుడు యుఎస్ ఆఫ్రికా కమాండ్‌లో వుంది."**

# FORM IV

**(Rule 8)**

**UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867 STATEMENT ABOUT OWENARSHIP AND OTHER PARTICULARS ABOUT MONTHLY MAGAZINE MARXISTU**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | Hyderabad |
| 2. | Periodicity of its Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | B.V. Ragavalu |
| | Nationality | : | Indian |
| | Address | : | D.NO.1-1-60/2<br>M.B.Bhavan<br>RTC X Roads<br>Hyderabad - 20, Telangana State. |
| 4. | Publisher's Name | : | B.V. Ragavalu |
| | Nationality | : | Indian |
| | Address | : | D.NO.1-1-60/2<br>M.B.Bhavan<br>RTC X Roads<br>Hyderabad - 20, Telangana State. |
| 5. | Editor's Name | : | S.Venkatrao |
| | Nationality | : | Indian |
| | Address | : | D.No.12-402/1/1<br>Amarareddy Colony, Near Arvinda High School<br>Tadepalli, Guntur District – 522501, Andhra Pradesh. |
| 6. | Names and addresses of individuals | : | B.V. Ragavalu |
| 7. | Who own the newspaper and Partners or shareholders holding more than One percent of the total capital: | | D.NO.1-1-60/2<br>M.B.Bhavan<br>RTC X Roads<br>Hyderabad - 20, Telangana State. |

**I, B.V. Ragavalu hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.**

**Sd/-**
**(B.V.RAGHAVALU)**
**Publisher**

**Date : 28.02.2023**

అవినీతికర చర్యలకు ఉపయోగించి అక్రమాస్తులు పెంచుకోవడం)కి బాటలు పరుస్తుంది. అమెరికా లాంటి చోట్ల ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో అమెరికా ప్రభుత్వం చేసే ఖర్చుకు లెక్కాడొక్కా ఉండదు. అవినీతికి ఇంతకన్నా దగ్గర దారి ఇంకేముంటుంది. అలాగే ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో నియంతృత్వ పాలకులకు నేరుగా వత్తాసు పలకడాన్ని అది నిస్సిగ్గుగా సమర్థించుకుంటుంది. ప్రజల బాధలకు మూలకారణాలను పట్టించుకోనంతకాలం బొకొహరాం, అల్ షబాబ్ వంటి సంస్థలు పెరుగుతూనే ఉంటాయి. ఎన్ని నిధులు వెచ్చించినా ఉగ్రావాదాన్ని అవి నివారించలేవు సరికదా పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తాయి.

ఇప్పుడు అమెరికా దృష్టంతా ఈ ఖండంలో విద్యుత్ గ్రిడ్స్ వంటి చైనీస్ ప్రాజెక్టులను మూసేయించడమెలా అన్నదానిపైనే ఉంది. దీనిపై పెట్టే శ్రద్ధ తిరుగుబాట్లకు ఆజ్యం పోసే నిరాశ నిస్పృహలకు గల కారణాలను పరిష్కరించడంపై పెడితే ఉపయోగకరంగా ఉంటుంది. ఆ పని అది చస్తే చేయదు.

❊

# ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అత్యవసరం



రచయిత ప్రముఖ ఆర్థిక వేత్త.

**ప్రభాత్ పట్నాయక్**

(గత సంచిక తరువాయి)

**5. పెరుగుతున్న నయా-ఫాసిజం**

ప్రభుత్వ అదుపులోని ఆర్థిక విధానం వాగ్దానం చేసిన మేరకు పనిచేయనందున ప్రారంభంలో, పేదల నుండి కూడా నయా-ఉదారవాదానికి మద్దతు లభించింది. నయా-ఉదారవాద వ్యవస్థలో ఆదాయాలు, సంపదల్లో అసమానతలు బాగా పెరుగుతున్నాయి. జనాభాతో పోల్చినపుడు నిరుపేదరికం మోతాదు కూడా పెరుగుతున్నది. జిడిపి పెరుగుదల రేటుతోపాటు, దాని 'ట్రికిల్ డౌన్ సిద్ధాంతం' (ముందు కొందరి సంపద పెరిగిన తర్వాత కిందికి చేరే తీరు) బాధితుల్లో పలు భ్రమలను పెంచాయి. తమ బ్రతుకులు బాగుపడతాయన్న విశ్వాసాన్ని సజీవంగా నిలిపాయి. కానీ నయా-ఉదారవాద విధానం సంక్షోభంలోకి కూరుకుపోతూ జీడీపి పెరుగుదల రేటు పడిపోతున్నది. దానితో అలాంటి విశ్వాసాన్ని ఇంకెంతో కాలం నిలబెట్టగల అవకాశం కన్పించటంలేదు. ఎక్కువ భాగం ప్రజల్లో క్రమంగా నయా-ఉదారవాదంపట్ల భ్రమలు వీడుతున్నాయి.

2004-05, 2009-10 మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం మనుగడకు వామపక్షాల మద్దతు అవసరమైంది. ఆ కాలంలో వామపక్షాల ప్రభావంతో కొన్ని ముఖ్యమైన చట్టాలు చేయబడ్డాయి. 'మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి గ్యారంటీ పథకం' వాటిలో అతి ముఖ్యమైనది. తద్వారా, గ్రామీణ పేదల కుటుంబాల్లో ప్రతి ఇంటికొక మనిషికి సంవత్సరంలో 100 రోజులు ఉపాధి కల్పన గ్యారంటీ చేయబడింది. అనంతరం, నయా-ఉదారవాదంలో ఆ పథకం ప్రకటిత లక్ష్యానికి పూర్తి భిన్నంగా నత్తనడకన సాగుతున్నది. కాలం గడిచేకొద్దీ ఈ పథకానికి అనేక పరిమితులు యేర్పడుతున్నాయి: 100 పని దినాల్లో కోతలు విధిస్తున్నారు. వేతన బకాయిలు పేరుకు పోతున్నాయి. ఈ పరిణామాలు, ఉపాధి కోరుతున్నవారిలో నిరుత్సాహాన్ని నింపుతున్నాయి. ఎంతలేదన్నా శ్రామిక జనానికి ఒక సహాయక వనరుగా ఈ పథకం కొంత తోడ్పడుతున్నది. ఈ పథకం అమలు ప్రభావంతో గ్రామీణ పేదల ఆహారంలో కేలరీల శాతం పెరుగుదల గురించి ఈ వ్యాసంలో ముందుగా ప్రస్తావించాను. పేదలకు ఈ పథకపు సహకారాన్ని దూరం చేస్తున్న నయా-ఉదారవాదం మరింత విచ్ఛిన్నకరంగా మారుతున్నది.

నత్తనడకన సాగుతున్న అభివృద్ధి రేటు, పెరుగుతున్న నిరుద్యోగంతో నయా-ఉదారవాద వ్యవస్థకు నేడొక భిన్నమైన ప్రచారం అవసరమౌతున్నది. ప్రతివారినీ అభివృద్ధి చేస్తామన్నది దాని గత నినాదం. కానీ, ఆ నినాదం కాలం గడిచేకొద్దీ ఎవరినీ నమ్మించలేక పోతున్నది. వర్తమానంలో నయా-ఫాసిజం దానికొక సరికొత్త ప్రచారాన్ని సమకూర్చుతున్నది. నయా-ఉదారవాదం, నయా-ఫాసిజం కలయికతో యేర్పడిన నూతన కూటమి మనుగడలోకి వచ్చింది. ఆ కూటమి ప్రజల దృష్టిని ఆర్థిక సమస్యల నుండి పూర్తిగా యేమార్చుతుంది. ఒకరిపట్ల మరొకరికి విద్వేషాలను పెంచటంవైపు మళ్లించేందుకు కుట్రలు పన్నుతున్నది. నిస్సహాయులైన మైనారిటీ ప్రజలను బలితీసుకునేందుకు ఆ విద్వేష ప్రచారాలను యెక్కుబెడుతున్నది. దేశంలోని మెజారిటీ ప్రజానీకం చారిత్రకంగా ప్రాధాన్యతను కోల్పోవటానికి ఈ మైనారిటీ ప్రజలనే బాధ్యులుగా చిత్రిస్తున్నారు. వారిపై ప్రతీకారం తీర్చుకోవాలని రెచ్చగొడుతున్నారు. ఒకవేళ ఆర్థిక అంశాలు చర్చనీయంగా మారితే, ఆ సమస్యల మూలాలు గత ప్రభుత్వపు మైనారిటీలను బుజ్జగింపు విధానంలో భాగంగా ఉన్నాయని ఆరోపిస్తున్నారు. 'మెజారిటీ'కి వారి విజ్ఞప్తులన్నింటినీ హిందుత్వ, లేదా 'హిందూ సూపర్ మెకానిజం' పేరుతో వెలువరిస్తున్నారు. భారత్, నయా-ఫాసిజంగా అవతరించటం వెనుక నూతన హిందుత్వ-కార్పొరేట్ కూటమి ప్రేరణగా నిలుస్తున్నది.

హిందు అగ్రగామి సంస్థగా చెప్పబడుతున్న ఆర్‌యస్‌యస్ 1925లో స్థాపించబడింది. ఆ సంస్థ, ఇతర రాజకీయ పార్టీలతో పొత్తుల ద్వారా 1990 చివరిలో రాజ్యాధికారాన్ని చేపట్టింది. అది ఇటీవలి కాలంలో అగ్రగామి కార్పొరేట్ సంస్థల చురుకైన మద్దతును పొందుతున్నది. భారీ ఆర్థిక సహకారాన్ని దండుకుంటున్నది. వీటితోపాటు, వారి అధీనంలోని మీడియా అండదండలతో వేగంగా అభివృద్ధి చెందుతున్నది. ఈ అభివృద్ధి నేపథ్యంలో ఆర్‌యస్‌యస్ రాజకీయ విభాగమైన భారతీయ జనతా పార్టీ (బిజెపి) 2014లోను, 2019లోను సంపూర్ణ మెజారిటీ సాధించింది. తాను స్వయంగా మెజారిటీని సాధించలేని రాష్ట్రాల్లో అక్కడి మెజారిటీగల పార్టీల నుండి పార్టీ మార్పిడులకు పాల్పడుతున్నది. అందుకు పలు రూపాల్లో వత్తిడి చేస్తున్నది. ఆర్థిక ప్రలోభాలకు పాల్పడుతున్నది.

తీవ్రమైన నయా-ఉదారవాదమే బిజెపి ప్రభుత్వ ఎజండాగా మారింది. దానితో కార్మికుల హక్కులను కాలరాస్తున్నది. రైతు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌లోకీ. వ్యవసాయ సరుకుల వ్యాపారంలోకీ కార్పొరేట్ కంపెనీలకు తలుపులు బార్లా తెరిచింది. తద్వారా వలసవాద కాలపు పద్ధతులను పునరుద్ధరిస్తున్నది. సుదీర్ఘమైన, సమరశీలమైన రైతాంగ పోరాటంతో నిరంకుశమైన వ్యవసాయ చట్టాలను ఇటీవలే ఉపసంహరించుకుంది. పార్లమెంట్‌లో చర్చలు జరుపకుండానే ఆ బిల్లులకు ఆమోదం పొందిన ప్రభుత్వం ఉపసంహరణ కూడా అదే పద్ధతిలో చేసింది. దాని ఎజండాలో ఎలాంటి మార్పూ లేదు. ఆ ఎజండాలోని ముఖ్యాంశంగా ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేస్తున్నది. వాటిని ఆశ్రిత (క్రోనీ) పెట్టుబడిదారులకు లేదా మెట్రోపాలిటన్ పెట్టుబడిదారులకు కారు చౌకగా తెగనమ్ముతున్నది. ఆ విధంగా వారు ఆర్థికరంగాన్ని పూర్తిగా, 'విజాతీయకరణ' లేదా 'వలసవాద పునరుద్ధరణలకు పాల్పడుతున్నారు. దానితో వలసవాద విముక్తికి 'ప్రభుత్వ అదుపులోని ఆర్థికవ్యవస్థ'లో చేసిన ప్రయత్నాలను తిరోగమన

> “అందుకే నిరుద్యోగ సమస్య తగ్గుదలకు మారుగా మరింతగా పెరుగుతున్నది. గత కాలపు ఫాసిజం ఆరంభం లో నిరుద్యోగ సమస్యను అధిగమించటంతో కొంత ప్రజాదర ణను పొందగల్గింది. కానీ వర్తమాన నయా- ఫాసిజం అలాంటి మద్దతును సమీకరించలేక పోతున్నది. అందుకే, ప్రజల్లో ఒకరిపై మరొ కరికి ద్వేషం పెంచటంపైనే ప్రస్తుత ఫాసిజాలు కేంద్రీకరిస్తున్నాయి. ”

దిశకు మళ్లిస్తున్నారు.

వారు నయా-ఫాసిస్టు వ్యవస్థల సహచరు ల లక్షణాలన్నింటినీ ప్రదర్శిస్తున్నారు: రాజకీయ ప్రత్యర్థులను అణిచేస్తున్నారు. మహమ్మదీయు లు, క్రైస్తవులువంటి ఇతర మతాలకు చెందిన వారిని ‘అనవసరమైన’ వ్యక్తులుగా దుష్ప్రచారం చేస్తున్నారు. వారి పైకి ఫాసిస్టు మూకలను ఉ సిగొల్పుతున్నారు. వారి ప్రభుత్వాలను విమర్శిం చేవారిని ‘దేశ ద్రోహు లు’గా ముద్రవేస్తున్నారు. న్యాయ వ్యవస్థ, ఎన్నికల కమీషన్, మీడియా సంస్థల స్వతంత్ర తను మంటగల్పుతున్నారు. భారత ప్రజాస్వా మ్యానికి సంకేతాలైన స్వయం ప్రతిపత్తితోను, రాజకీయాలకు అతీతంగాను ఉ ంచవలసిన అధికార యంత్రాంగాన్ని, పోలీసు విభాగాన్ని నిర్వీర్యంచేస్తున్నారు. పై లక్షణా లన్నింటినీ పరిశీలిస్తే, నయా-ఉదారవాదంతో మాత్రమే భారత్‌లో పెరుగుతున్న సంక్షోభాన్ని అధిగ మించలేమని వారనుకుంటున్నట్లు అర్థమౌ తున్నది.

1930 నాటి మహా సంక్షోభం నేపథ్యం లో, ఫాసిజం ప్రేరిత ప్రభుత్వాలు ఆయుధాల ఖర్చును పెంచేశాయి. అందుకు అవసరమైన నిధుల కోసం భారీగా అప్పులు చేశాయి. కానీ ఇదే కాలంలోనే ఫాసిస్టేతర ప్రభుత్వాలు సంక్షోభం నుండి బైటపడక ముందే ఆ దేశాలు బైటపడ్డాయి. అలాంటి దేశాల్లో జపాన్ ముందు వరుసలో ఉంది. ఫాసిస్టు దేశాలకు ఆ వెసులుబాటు లభించటానికి కారణం, నాటి ద్రవ్య పెట్టుబడి తమ దేశానికి మాత్రమే పరి మితమైవుండేది. జాతి రాజ్యం దానికి అండగా నిలిచేది. ఆ రాజ్యం, ఫాసిస్టులకు అనుకూలం గా వున్నందున నాటి ద్రవ్య పెట్టుబడి తన దేశపు ద్రవ్య లోటును ఆమోదించేది.

కానీ నేటి ద్రవ్యపెట్టుబడి అంతర్జాతీ యకరణ చెందిందింది. పలు నిర్దిష్ట దేశాల్లోని ఫాసిస్టు ప్రభుత్వాలకు కూడా ద్రవ్యలోటు నుండి మినహాయింపు లేదు. తమ ఆర్థిక వ్యవస్థలను ఉత్తేజపరిచేందుకు, ఫాసిస్టు ప్రభుత్వాలతో పాటు, ఫాసిస్టేతర, నయా-ఉదారవాద ప్రభు త్వాలు కూడా ఒకే విధమైన ఆటంకాన్ని యెదుర్కొంటున్నాయి. ఆదాయ పంపిణీ విధానంలో, కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థ ఆధిపత్యానికి అనుకూలంగా జరిగిన మార్పు సంక్షోభం తీవ్రత పెరిగేందుకు దారితీసింది. దీనితోపాటు, ద్రవ్యలోటు లక్ష్యానికి లోబడి కొనసాగాలన్న సాకుతో, పన్నుల విధానంలో కార్పొరేట్లకు పలు రాయితీలను కల్పించారు. దానితోపాటు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించటం కూడా సంక్షోభ తీవ్రతకు తోడైంది.

అందుకే నిరుద్యోగ సమస్య తగ్గుదలకు మారుగా మరింతగా పెరుగుతున్నది. గత కాలపు ఫాసిజం ఆరంభంలో నిరుద్యోగ సమస్యను అధిగమించటంతో కొంత ప్రజాదర ణను పొందగల్గింది. కానీ వర్తమాన నయా-ఫాసిజం అలాంటి మద్దతును సమీకరించలేక పోతున్నది. అందుకే, ప్రజల్లో ఒకరిపై మరొ కరికి ద్వేషం పెంచటంపైనే ప్రస్తుత ఫాసిజాలు కేంద్రీకరిస్తున్నాయి. ప్రజాస్వామిక చట్రం పూర్తిగా నిర్వీర్యం కానప్పటికి కొత్త కొత్త పద్ధతుల్లో ‘ఇతరులను’ దయ్యాలుగా చిత్రించ టాన్ని చూస్తున్నాం. అనుకోకుండా ఒక వేళ నయా-ఫాసిస్టులను అధికారం నుండి దించేయ వచ్చు. కానీ సమాజం నయా-ఉదారవాదం వలలో చిక్కినంత కాలం వారు సమాజం లోను, రాజకీయాల్లోనూ కొనసాగుతారు. సమాజంలో ఫాసిస్టు ప్రభావాలను పెంచగలుగు తారు.

### 6. భారత ఆర్థిక వ్యవస్థ కరోనా మహమ్మారి

కరోనా మహమ్మారికి ముందే దేశంలో నిరుద్యోగ సమస్య రికార్డు స్థాయికి చేరింది. అప్పటికే మన ఆర్థిక వ్యవస్థ నెమ్మదించింది. భారత ప్రభుత్వం 2020 మార్చిలో కేవలం నాలుగు గంటల వ్యవధిలో ప్రకటించిన లాక్‌డౌన్‌తో నిరుద్యోగ సమస్య ఆకాశమే హద్దుగా పెరిగింది. లాక్ డౌన్‌కు రెండు ముఖ్య లక్షణాలున్నాయి. ఒకటి, ఉపాధులు లేక ఆదాయాలు కోల్పోయిన ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోకపోవటం. రెండు, లాక్‌డౌన్ కాలంలో అద్దెలు చెల్లించలేక ఇళ్లను ఖాళీచేసిన పేదల అద్దెలు చెల్లింపు సమస్యను ప్రభుత్వం పట్టించుకోక పోవటం.

పై రెండు చర్యలనూ అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం చేపట్టింది. కానీ భారత్‌లోని మోడీ ప్రభుత్వం ఆ పని చెయ్యలేదు. ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వందలు, వేలాది వలస కార్మికులకు అకస్మాత్తుగా ఉపాధులు, ఆదా యాలు, నెలవులు కోల్పోయారు. అనేక కష్టాలను అధిగమించి తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. అక్కడ తమకు దొరికింది కేవలం ఉపాధి పథకం పని మాత్రమే. కానీ ఆ పని ద్వారా వారికి లభించిన ఆదాయం గతంలో తమ సంపా దనలో స్వల్ప భాగమే. గత సంవత్సరం మొదటి త్రైమాసికంతో పోల్చినపుడు 2020 తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) జీడీపి భారీగా (24 శాతం) తగ్గింది. కారణం, అసంఘటిత రంగం అత్యధికంగా ఉపాధి కల్పించగల్గుతున్నది. ఆ రంగం మొత్తం ఉపాధుల్లో 85శాతం, జీడీపిలో 45శాతం వాటా కల్గివున్నది. అందుకే జిడిపి పతనంతో ఎక్కువగా నష్టపోతున్నది అసంఘటిత రంగమే. తదనుగుణంగా 2020-21 రెండవ త్రైమాసికంలో, లాక్‌డౌన్ సడలింపు తర్వాత కూడా జీడీపి 7.3 శాతం తగ్గింది.

ఆ తర్వాత క్రమంగా ఆర్థికం కొంత పుంజు కుంది. కానీ పెరిగిన పరిమాణాన్ని బేరీజు వేయవలసింది 2020-21 గాథత ఆధారంగా కాదు. మహమ్మారికి ముందు కాలం 2019-20లో జీడీపి ఆధారంగా మాత్రమే ఆ పనిచేయాలి. 2019- 20 మొదటి త్రైమాసికం కంటే 2021- 22 మొదటి త్రైమాసికపు జీడీపి మరింత తక్కువకు పడిపోయింది. రెండవ త్రైమాసికం జీడీపి పెరుగుదల, 2019-20 కంటే కేవలం 0.3శాతం మాత్రమే. 2021-22 ఆర్థిక సంవత్సరం మొత్తంపై భారత ఆర్థిక రంగం పెరుగుదల రేటు 2020-21 కంటే 10శాతం అదనంగా వుంది. 2019-20 అభివృద్ధి రేటు కేవలం 1.97శాతం మాత్రమే. ఈ విధమైన స్వల్ప పెరుగుదలతో ఆర్థికరంగం కోలుకుంటుం దనటానికి ఎలాంటి ప్రాధాన్యతా లేదు.

వర్తమాన పెరుగుదల కూడా నిలకడ లేనిదే. ఎందుకంటే 2021-22 త్రైమాసికపు జీడీపి కూడా 2019-20 స్థాయిలోనే ఉ ంది. కానీ వినిమయం స్థాయి మాత్రం 3.5 శాతానికి తక్కువగానేవుంది. 2019-20 నాటి వినిమయం స్థాయికి మెరుగుపడాలంటే ప్రభుత్వ వ్యయం లేదా పెట్టుబడి పెరగాలి. వినిమయం లో మార్పులుంటేనే పెట్టుబడి పెరుగుదల వుంటుంది. ప్రభుత్వ వ్యయం భారీ మొత్తంలో

ఉండాలి. ప్రస్తుతం అనేక ద్రవ్య పరమైన ఆటంకాలున్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుతున్నది. ఈ అననుకూల పరిస్థితుల్లో ప్రభుత్వ వ్యయంలో భారీ పెంపు సాధ్యమయ్యేలాలేదు.

లాక్‌డౌన్ కాలంలోను, అనంతరం కూడా ఆదాయాలు తగ్గటమే అసలు సమస్య. ప్రభుత్వం నుండి పేదలకు ఎలాంటి సహాయం అందటం లేదు. అందుకే, అనేక కుటుంబాలు వినిమయ అవసరాలను తీర్చుకునేందుకు అప్పులు చేస్తున్నారు. లేదా ఉన్న ఆస్తులనైనా త్యజిస్తున్నారు. ఇపుడు అలాంటి అప్పులను తిరిగి చెల్లించేందుకు, లేదా కోల్పోయిన ఆస్తులను తిరిగి భర్తీ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థలో వినిమయం ఖర్చుతోపాటు, ఆర్థిక గుణకం కూడా తగ్గిపోతున్నది. ఈ విధంగా వినిమయం ఖర్చులు తరుగుదల మూలంగా ప్రైవేటు పెట్టుబడులు కూడా తగ్గుముఖంపడుతున్నాయి. తద్వారా, మొగ్గ కోలుకునే దశలోనే చిదిమేయబడుతున్నది. వినిమయాన్ని పునరుద్ధరించేందుకు, కనీసం ఆదాయపు పన్ను పరిధిలోలేని కుటుంబాలకైనా సహాయం అందించాలి. ఆమేరకు పలువురు ఆర్థికవేత్తలు, అనేక అభ్యుదయకరమైన రాజకీయ పార్టీలు సూచిస్తున్నాయి. సూటిగా చెప్పాలంటే లాక్‌డౌన్ కాలంలో చేయలేని పనిని యిపుడైనా చేయాలని వారు కోరుతున్నారు. కానీ ఆ కర్తవ్యాన్ని ప్రభుత్వం చేయటం లేదు. నయా-ఉదారవాదం విధించిన ఆర్థిక ఆంక్షలను ఆమోదించినందున ప్రభుత్వం బదిలీల కోసం ఎలాంటి ప్రయత్నం చేయటంలేదు.

దాని ఫాసిస్టు స్వభావం ఈ విధంగా కన్పిస్తున్నది. వాస్తవమైన ప్రజా సమస్యలను పరిష్కారం చేయటం పట్ల దానికి ఆసక్తిలేదు. అంతకంటే, అధికార పార్టీగా తామే దౌర్జన్యంతో కూలగొట్టిన మశీదు శిధిలాలపైన దేవాలయాన్ని నిర్మించటం ద్వారానే ప్రజా మద్దతును సాధించాలని అది పథక రచన చేసింది.

గతంలో అమెరికాలో వలే, భారత్‌లో ద్రవ్యోల్బణం వేగంగా పెరుగుతున్నది. ద్రవ్యలోటును అదుపుచేసేందురే పన్నులు, ప్రత్యేకంగా ఆయిల్, పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు పెంచుతున్నారు. కానీ అమెరికా, విదేశీ మారక నిల్వల సమస్య ద్రవ్యలోటుపై అదనపు ప్రభావాన్ని చూపుతోంది. అమెరికాలో వడ్డీరేట్లు పెరిగేకొద్దీ, మన దేశంలోకి విదేశీ ద్రవ్య పెట్టుబడుల ప్రవాహం తగ్గుతుంది. ఫలితంగా డాలరుతో పోల్చినపుడు, రూపాయి మారకం రేటు పడిపోతుంది. దిగుమతులు, ముఖ్యంగా ఆయిల్, పెట్రోలియం ఉత్పత్తులు మరింత ప్రియమౌతాయి. అంతిమంగా, ఆ భారాలను అధిక ధరల రూపంలో ప్రజలపైకి నెట్టేస్తారు.

"కరోనా కంటే ముందే భారతదేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. నయా-ఉదారవాద వ్యవస్థలో అది మరిన్ని సమస్యలను యెదుర్కొంటున్నది. ఈ కష్ట కాలంలో సమస్యల నుండి కొంత ఉపశమనం కల్పించగల స్థితిలో నయా-ఫాసిస్టు ప్రభుత్వం లేదు. పైగా 'ఇతరులు'పై మరింత ప్రమాదకరమైన దాడులకు పాల్పడి ప్రమాదం నుండి బైటపడేందుకు అది ప్రయత్నిస్తున్నది."

అమెరికాలో వడ్డీరేట్లు పెరగనున్నాయన్న అంచనాలతోనే, ఈపాటికే రూపాయి మారకం విలువ గణనీయంగా తగ్గిపోయింది. భవిష్యత్‌లో అమెరికాలో వడ్డీరేట్లు వాస్తవంగా పెరిగితే, దాని ప్రభావం మన రూపాయి విలువను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ద్రవ్యలోటును అదుపు చేసే సాకుతో భారత ప్రభుత్వం ఆర్థిక, ద్రవ్య విధానాల యవనికలో అనేక మార్పులు తెస్తుంది. అవి, మన ఆర్థిక వ్యవస్థ కోలుకునే క్రమాన్ని దెబ్బతీస్తాయి. కరోనా మహమ్మారి కాలానికి ముందు కంటే నిరుద్యోగం మరింత ఉన్నత స్థాయికి చేరుతుంది.

కరోనా కంటే ముందే భారతదేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. నయా-ఉదారవాద వ్యవస్థలో అది మరిన్ని సమస్యలను యెదుర్కొంటున్నది. ఈ కష్ట కాలంలో సమస్యల నుండి కొంత ఉపశమనం కల్పించగల స్థితిలో నయా-ఫాసిస్టు ప్రభుత్వం లేదు. పైగా 'ఇతరులు'పై మరింత ప్రమాదకరమైన దాడులకు పాల్పడి ప్రమాదం నుండి బైటపడేందుకు అది ప్రయత్నిస్తున్నది.

### 7. ముందున్న మార్గం

నయా-ఉదారవాదంతో జీడీపి రేటు పెరుగుతున్నది. కానీ దానితోపాటు నిరుద్యోగం పెరుగుతున్నది. మొత్తం జనాభా సంఖ్యతో పోల్చినపుడు నిరుపేదరికం నిష్పత్తి పెరుగుతున్నది. భారతీయ ఆర్థిక వ్యవస్థను, రాజకీయాన్ని మరింత బాధాకరమైన పరిస్థితికి దిగజార్చింది. పరిస్థితిని అంతిమ దశకు చేర్చింది. నిరుద్యోగం, కరోనా మహమ్మారికి ముందే గత 45 సంవత్సరాల్లో యే కాలంలోనూ లేని విధంగా ప్రమాదకర స్థాయికి చేరింది. అది కరోనా కాలంలో ఆకాశమెత్తుకు ఎగబాకింది. ఇప్పటికీ ఆ స్థితి నుండి పొందిన స్వస్థత అసంపూర్ణంగానేవుంది. పూర్తి స్వస్థత చేకూరేందుకు, బడ్జెట్ పరమైన సహాయం ద్వారా గృహస్తుల వినిమయాన్ని పెంచటమే యేకైక మార్గం. కానీ అందుకు పెట్టుబడి మోకాలడ్డుతున్నది. వేరొక మార్గంలో సమస్య పరిష్కారానికున్న అవకాశాలను కూడా, అమెరికా ద్రవ్యోల్బణం రేటులో పెరుగుదల సవాలుగా నిస్తున్నది.

నయా-ఉదారవాదం, నయా-ఫాసిజాల పొత్తు అనేది, భారత్‌లో కార్పొరేట్-హిందుత్వ శక్తుల అతి శ్రేష్టమైన కూటమిగా అవతారమెత్తింది. అది మన ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేస్తున్నది. ఇక్కడి ఆర్థిక రుగ్మతలను అధిగమించేందుకు మాత్రం వీసమెత్తు కూడా తోడ్పటం లేదు. ముస్లింలతో పాటు మినహాయించబడిన ఇతర మైనారిటీ ప్రజానీకంపై మరింతగా విషం చిమ్ముతుంది. మన దేశం ఒకనాడు లౌకిక, ప్రజాస్వామిక సాంప్రదాయాలతో నగర్వంగా తలెత్తుకోగల్గింది. కానీ నేడు క్రిష్టమస్ పండుగనాడు కూడా ఫాసిస్టు గుండాలు చర్చీలపై దాడులకు తెగబడుతున్నారు. ఇలాంటి దుర్ఘటనల పట్ల ప్రభుత్వం మౌనముద్ర వేస్తున్నది. ఈ ఘటనల పట్ల ఉదారవాదుల వైఖరి వేరొక విధంగావుంది. భయంకరమైన నయా-ఫాసిస్టు దాడులను, నయా-ఉదారవాద_అభివృద్ధి మాయాజాలపు కృత్రిమ వెలుగుల్లో వేరుచేసి చూస్తున్నారు. ఈ ధోరణితో నరైన నిర్ధారణకు రాజాలమన్నది మన అభిప్రాయం. పాలక పార్టీకి భారత గుత్త పెట్టుబడిదారులు భారీ మొత్తాల్లో ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారు. ఈ వాస్తవాన్ని గమనించగల్గితే పై ధోరణిని అధిగమించవచ్చు. నయా-ఫాసిస్టు పార్టీని అధికారం నుండి దింపేయటమనేది దానికి మూలమైన నయా-ఉదారవాదపు తీవ్రతను బలహీనపరచటం తో ముడిపడివుంది. లేకుంటే అనుభవ గ్రాహ్యంకాని వర్తమాన పరిణామాలు సక్రమంగా అర్థం కావు. దానితో మరోసారి నయా-ఫాసిస్టులే అధికారానికి ఎగబాకుతారు. అంతే కాదు. వారు అధికారంలో లేని కాలంలో కూడా తమ దుష్ట ఎజెండాతో కొనసాగగల్గుతారు. నయా- ఫాసిజాన్ని అధిగమించాలంటే, నయా-ఉదార వాదానికి ప్రత్యామ్నాయ ఆర్థిక ఎజెండా ముందుగా

> **ఒక లెక్క ప్రకారం 5 ప్రాథమిక హక్కులుండాలి. అవి : 1.ఆహారపు హక్కు(నామమాత్రపు ధరకు) 2. ఉపాధి హక్కు (పని కల్పించలేనపుడు పూర్తి వేతనం చెల్లించాలి) 3. ఉచిత మరియు ప్రభుత్వం అందించే నాణ్యమైన విద్యా హక్కు 4. ఉచిత, జాతీయ సేవా పథకం ద్వారా ప్రభుత్వం కల్పించే ఆరోగ్య సంరక్షణా హక్కు 5. జీవించే హక్కు (నాన్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ మరియు వికలాంగులకు ఉపకరించేవి).**

రూపొందించబడాలి.

నయా-ఉదారవాద విధానాన్ని అధిగమించటం సులభం కాదు. అలా చేయాలనుకునే ప్రభుత్వం పెట్టుబడిని ఆదేశించగల శక్తిని సంపాదించటం తన కనీస బాధ్యతగా చేపట్టాలి. ప్రజానుకూల ఆర్థిక ఎజండాను అమలు చేసేందుకు కృషిచేయాలి. ఆ కర్తవ్య సాధనలో పెట్టుబడి వెనక్కు తరలిపోతుందన్న భయాలను పక్కకు నెట్టేయాలి. ద్రవ్యలోటును పూడ్చుకోవటంలో, విదేశీ చెల్లింపులకు అవసరమైన మోతాదులో పెట్టుబడుల రాక తగ్గిపోతుంది. ఆ పరిస్థితుల్లో పెట్టుబడి ఎగుమతులపై ఆంక్షలు విధిస్తుంది. పెట్టుబడి పైన, ప్రత్యేకంగా వాణిజ్యంపైన ప్రభుత్వం అదుపు సాధించాలి. ఫలితంగా ప్రత్యామ్నాయ ఎజండా అవసరమైన వర్గాలకు కొంత ఇబ్బంది కల్గుతుంది. పైగా సామ్రాజ్యవాద పెట్టుబడి యొక్క శతృపూరిత దాడులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ కక్ష సాధింపు చర్యలు వాణిజ్య ఆంక్షల రూపానికి మారతాయి. ఆ ఆంక్షలు దేశం ఎదుర్కొంటున్న సమస్యలను మరింత తీవ్రతరం చేస్తాయి.

అదృష్టవశాత్తూ ప్రభుత్వ అదుపులో ఆర్థికవ్యవస్థ ఉన్న కాలంలో, దేశం పలు రకాల ఉత్పత్తి విధానాలను అభివృద్ధిచేయగల శక్తిని సంపాదించింది. అందువల్ల వాణిజ్య ఆంక్షల తో ఒక్క ఆయిల్ దిగుమతి రంగం మినహా, మిగిలిన రంగాల్లో అంత అసౌకర్య ఏర్పడదు. భారత్ వంటి సామ్రాజ్యవాద పెట్టుబడి ఆంక్షలకు గురైన ఇతర దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాల ద్వారా ఆయిల్ దిగుమతులకు యేర్పాటుచేసుకోవచ్చు. కానీ ఈ పరివర్తనా కాలంలో గణనీయమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ కష్ట కాలాన్ని అధిగమించేందుకు సంక్లిష్ట పరిస్థితి నుండి తేరుకుంటామన్న విశ్వాసాన్ని దేశంలోపల కల్పించగల్గాలి.

నయా-ఉదారవాదం నుండి బైటపడాలన్న లక్ష్యంతో ఏ ప్రయత్నం చేసినా, అభివృద్ధికి ఉపకరించే ఎగుమతులు ముందుగానే ఆగిపోయే అవకాశముంది. అందుకే దేశాభివృద్ధి ప్రధానంగా స్వదేశీ మార్కెట్‌పై ఆధారపడి ఉండేలా రూపొందాలి. అందులోనూ వ్యవసాయాభివృద్ధి రేటు పెరుగుదల కీలక పాత్ర పోషించాలి. రెండు విధాలైన ఎగుమతి ఆధారిత పారిశ్రామికీకరణల మధ్యగల తేడాలను నికోలస్ కల్డర్ (1978) వివరించారు. విదేశీ ఎగుమతులు, దేశం లోపలి ఎగుమతుల్లో, వ్యవసాయేతర రంగం నుండి వ్యవసాయ రంగం వరకూ ఉన్నాయి. భారత్ వంటి పెద్ద దేశాలకు రెండవది ఎంతో అభిలషణీయమైనది. కారణం దానిలో ఉత్పత్తి ప్రక్రియ నుండి ఏ రంగానికీ మినహాయింపు ఉండదు. అంతే కాదు. నయా-ఉదారవాద వ్యవస్థ నుండి బైటపడేందుకు ప్రయత్నించే దేశానికి రెండవ అంశం అత్యవసరమౌతుంది.

కానీ అందుకు కేవలం ఒక వ్యవసాయ రంగం అభివృద్ధి మాత్రమే సరిపోదు. పరిశ్రమల స్థాపన లేదా రియల్ యెస్టేట్ ప్రాజక్టుల కోసం వ్యవసాయ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టరాదు. తద్వారా, పెట్టుబడి ప్రాథమిక సంచయాన్ని అరికట్టగల్గాలి. వ్యవసాయ రంగంలో అధికోత్పత్తిని సాధించేందుకు భూ సంస్కరణల ద్వారా భూమిని అభివృద్ధి చేయాలి. స్వచ్ఛంద సహకార సంస్థలను, సమిష్టి వ్యవసాయాన్ని అభివృద్ధిపరచేందుకు వీలుగా వ్యవసాయ నిర్వహణ పద్ధతుల్లో మార్పులు జరగాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఒక స్థాయిలో సమతావాద భావనలను నెలకొల్పేందుకు భూ సంస్కరణలు అవసరం.

పారిశ్రామిక సంస్థల ( చైనాలోవలే టౌన్ షిప్‌లు, గ్రామీణ సంస్థలు) స్థాపనకు ప్రభుత్వ రంగంతో పాటు, సహకార సంస్థలు, సమిష్టి వ్యవసాయం లేదా గ్రామీణ స్వయం నియంత్రణ సంస్థ (యల్‌యస్‌జిఐ)లు కూడా ముందుకు రావాలి. మరొక విధంగా చెప్పాలంటే పారిశ్రామీకరణ అనేది కార్పొరేట్ పారిశ్రామీకరణను పోలి వుండాల్సిన అవసరం లేదు. అలాంటి సహకార సంస్థలు, సమిష్టి వ్యవసాయం, యల్‌యస్‌జిఐ పారిశ్రామిక యాజమాన్యాలతో కూడా పెట్టుబడి ప్రాథమిక సంచయానికిగల అవకాశాలన్నింటినీ తోసేయగల్గాలి.

మనకు కావలసింది కేవలం ఈ పద్ధతిలోని అభివృద్ధి మాత్రమే కాదు. దేశ రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు స్వప్నించిన 'సంక్షేమ రాజ్యం' పట్ల చైతన్యయుతమైన అంకిత భావంగల రాజ్య విధానం కావాలి. కానీ అలాంటి సంక్షేమ రాజ్యం, రాజ్య ఉదారంగా మారకూడదు. అది ప్రజల హక్కుగా మారాలి. రాజ్యాంగంలో ప్రాథమిక రాజకీయ, సామాజిక హక్కులు పొందుపరచబడ్డాయి. వాటితోపాటు, ప్రాథమిక ఆర్థిక హక్కుల యేర్పాటు కూడా కలసి ఉండాలి. వాటిని సార్వత్రికంగాను, చట్టబద్ధంగాను అమలుచేయగల్గాలి.

ఒక లెక్క ప్రకారం 5 ప్రాథమిక హక్కులుండాలి. అవి : 1.ఆహారపు హక్కు (నామమాత్రపు ధరకు) 2. ఉపాధి హక్కు (పని కల్పించలేనపుడు పూర్తి వేతనం చెల్లించాలి) 3. ఉచిత మరియు ప్రభుత్వం అందించే నాణ్యమైన విద్యా హక్కు 4. ఉచిత, జాతీయ సేవా పథకం ద్వారా ప్రభుత్వం కల్పించే ఆరోగ్య సంరక్షణా హక్కు 5. జీవించే హక్కు (నాన్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ మరియు వికలాంగులకు ఉపకరించేవి). అలాంటపుడు పై హక్కులన్నింటి అమలు కోసం, ప్రస్తుతం పలు ఖాతాల కింద అయ్యే వ్యయం కంటే జీడీపిలో 10శాతం అదనంగా ఖర్చు చేయాలి.

ఈ ఖర్చులకు అవసరమైన ఆర్థిక వనరులను రెండు రకాల పన్నులు విధించటం ద్వారా సేకరించవచ్చు: ఒకటి, జనాభాలో పై స్థాయి ఒక శాతం నుండి 2 శాతం సంపద పన్ను విధించాలి. రెండు. అలాంటి వారు ఇతరులకు బదిలీచేసే సంపద విలువలో 33 1/3 శాతం లెవీగా వసూలు చేయాలి (పట్నాయక్ మరియు ఘోష్ 2020). భారత్‌లో కేవలం పై 1 శాతం కుటుంబాల నుండి పై రెండు రకాల పన్నుల ద్వారా సమకూరే ఆర్థిక వనరులు 'హక్కులు పునాది'గా గల 'సంక్షేమ రాజ్యం' నిర్వహణకు సరిపోతాయి.

రాజకీయ స్థాయిలో నయా-ఫాసిజాన్ని ఓడించటం అత్యవసరం. పై కనీస హక్కులను వ్యవస్థీకృతం చేయటం ద్వారా నయా-ఉదారవాదాన్ని అధిగమించటంలో పురోగతిని సాధించవచ్చు. దాని రాజకీయ ఓటమిని ఒక బలమైన పునాదిపై నిలుపవచ్చు. అపుడు మాత్రమే భారత ప్రజాస్వామ్యాన్ని , లౌకికతత్వాన్ని పరిరక్షించగలం. ఇవి స్వయంగా వాంఛనీయమైన లక్ష్యాలు. అవి లేకుండా దేశాన్ని ఐక్యంగా ఉంచటం అసాధ్యం.

**(అనువాదం: వై సిద్ధయ్య)**

# ఆర్యులు ఎక్కడి నుండి వచ్చారు? ఋగ్వేదంలో ఏమి ఉన్నది?

(2వ పేజీ తరువాయి)

మంత్రాలు అన్నీ మౌఖికమైనవే. ఒక తరం నుండి మరొక తరానికి అనుసృతంగా వచ్చినవే. అంటే వినటం ద్వారా గుర్తుపెట్టుకోవడం అన్నమాట. ఒక్క వేదాలే కాదు బుద్ధుని త్రిపీటకాలు, జైనుల ఆగమాలు కూడా శతాబ్దాల వరకు కంఠస్తం చేయబడి మౌఖికంగానే ఒక తరం నుండి మరొక తరానికి అందజేయ బడినవి. బుద్ధుని మరణానంతరం త్రిపీటకాలు క్రోడీకరించి రెండు శతాబ్దాల తరువాత లిఖిత రూపం లోనికి తెచ్చారు. అలాగే జైనుల ఆగమాలు కూడా 1000 సంవత్సరాల అనంతరం గుజరాత్ లోని వల్లభిలో లిఖిత రూపంలోకి తీసుకురాబడ్డాయి.

**ఋగ్వేదవిశేషాలు**

ఋగ్వేదం కొన్ని తెగలు అంటే గణాల, గోత్రాల సాహిత్యం. ఋగ్వేదం స్వతః ప్రమాణం. అది తన ప్రదేశాన్ని గురించి అధికారికంగా చెప్పగలిగినట్లు మరొకరు చెప్పలేరు. ఋగ్వేద రుషుల ఉద్దేశం చరిత్రను వ్రాయటం కాదు. వారు తమ దేవుళ్లను దాతలను సంతోషపెట్టే సందర్భంలో చెప్పిన రుక్కులలో అనేక చారిత్రక భౌగోళిక సంగతులు తెలియ వచ్చాయి. అందువలన ఋగ్వేదం నిస్సందేహంగా పెన్నిధి. ఋగ్వేదంలో ఆర్య అనే పదాన్ని లెక్కలేనన్ని సార్లు ప్రస్తావించింది. ఆర్య బృందాల మధ్య ఎన్ని తేడా లైనా ఉండవచ్చు కానీ, ఆర్యులు కాలుమోపిన ప్రతిచోట అద్భుత చారిత్రక పరిణామాలకు నాంది పలికారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక ప్రజలు వేరు వేరు ఆదిమ విశ్వాసాలతో, పాత పనిముట్లతో కుంచించుకు పోయారు. ఆర్యులు వచ్చి వీరి మధ్య అడ్డుగోడలను ధ్వంసం చేశారు. సమాజంలో కొత్త పరిస్థితికి నాంది పలికారు. మహాభారతం, రామాయణం, పురాణములకు ఋగ్వేద కాలాన్ని గురించిన జ్ఞానం అత్యల్పం, అవిశ్వసనీయం.

వ్యాసుడు రాశాడు అని భావించే మహాభారతం ఇతిహాసాల్లో ప్రాచీనమైనది. అది క్రీస్తుపూర్వం పదవ శతాబ్దం నుండి క్రీస్తుశకం 4వ శతాబ్దం వరకు ఉన్న పరిస్థితికి అద్దం పడుతుంది. మొట్టమొదట ఇందులో 8,800 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. అప్పుడు దాన్ని ''జయం'' అని పిలిచారు. తరువాత "జయేతిహాసం" అన్నారు. తర్వాతి కాలంలో ఈ శ్లోకాల సంఖ్య 24,000కు పెరిగింది. అప్పుడు దానిని "భారతం" అన్నారు. చివరగా ఆ గ్రంథంలోని శ్లోకాల సంఖ్య 1,00,000 కు పెరిగింది. అప్పుడా గ్రంథాన్ని మహాభారతం లేదా ''శత సహస్ర సంహిత'' అన్నారు. మహాభారతం మనం చదివితే ముందున్న పీఠికలో "భారతం" అనే మరో పాఠం ఉన్నదన్నది మనకు తెలుస్తుంది. ఇందులో కథా భాగం, వర్ణన భాగం, నీతిబోధ భాగం అనే వివిధ కాలాలకు చెందినవి ఉంటాయి. జనమే జయుడు యజ్ఞం చేస్తుండగా యజ్ఞ కర్మకాండలో భాగంగా వైశంపాయనుడు చెప్పిన కథయే మహాభారతం.

రామాయణం ఒక సుందరమైన కావ్యం. ఒక ఆదర్శ కుటుంబంలో కుమారుడు తండ్రికి, తమ్ముడు అన్నకు, భార్య భర్తకు విధేయులుగా వుండాలని సూచించేది రామాయణం. వాల్మీకి రామాయణంలో కూడా మొదట ఆరు వేల శ్లోకాలు మాత్రమే ఉండేవి. అవి తరువాత 12,000 శ్లోకాలకు, చివరకు 24 వేల శ్లోకాలకు పెరిగింది. దీని రచనా కాలం క్రీస్తుపూర్వం 5వ శతాబ్దిలో ప్రారంభమైంది. ఆనాటి నుండి ఐదు దశలు గడిచి క్రీస్తు శకం 12వ శతాబ్దంలో సంకలనం పూర్తయింది. అందువల్ల వశిష్టుడు, విశ్వామిత్రుడు లాంటివారు మహాభారతంలో కనిపించినా రామాయణంలో కనిపించినా అది కేవలం కవుల కల్పన మాత్రమే అని భావించాలి. అందువలన వేదాలకూ రామాయణ, ఇతిహాస, పురాణాలకు ఎలాంటి సంబంధం లేదు.

ఋగ్వేద కాలంలో ఆర్యులలో ఐదు ముఖ్యమైన గణములు ఉండేవి. ప్రజలు గణ అర్థం ఇచ్చే "జన" అన్న పదాన్ని కొన్నిసార్లు గణాలకు తెగలకు మారుగా వినియోగించారు. ఉదాహరణకు పాంచజనః, పంచ చర్షణి. ఐదు తెగలు అని అర్థం. ఈ ఐదు తెగలు ఏమంటే 1. పురులు, 2.అనులు, 3. దృహ్యులు,4. తుర్వసులు, 5. యదులు. వీరు ముఖ్యమైన ఆర్య గణాలు. వీరు కాక ఇక అన్య గణాలు ఫక్తులు, భలానులు, విషాణులు, శివులు, సిమ్యులు, యక్షులు. ఈ ఆర్య తెగలు ఇతర తెగల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతూ ఉండేవి. పశువుల దొంగతనమునకు, పశువుల మేత భూముల కొరకు, నదుల నీటి పంపిణీకి సంబంధించిన అంశాలపై ఘర్షణలు ఈ తెగల మధ్య సర్వసాధారణంగా జరిగాయి. పైన పేర్కొన్న పురులు అన్న తెగ నుండి కొన్ని శాఖలు భరత, త్రుత్సు, కుశకలుగా విడిపోయాయి. ఈ భరతుల తెగ నాయకుడు దివోదాసు. అతని కొడుకు సుదాసు. వీరిని పురు భరతులు అని కూడా అంటారు. ఆర్యులు మన దేశంలో ప్రవేశించిన తర్వాత ఏడు నదుల ప్రదేశంలో రెండు రకాల యుద్ధాలు చేశారు. మొదటిది తమ కంటే ముందుగా ఈ దేశంలో ఉన్న ప్రజలతోనూ, రెండవది తమలో తాము యుద్ధం చేసుకోవటం. ఆర్యులు రాక పూర్వం నుండి ముందుగా ఇక్కడ నివసిస్తున్న వారిని దస్యు లు అని, దాసులు అనిఅన్నారు. దాసులతో కొంత మెత్తగాను, దస్యులతో మరింత కఠినంగాను, శత్రువులు గాను వ్యవహరించేవారు. దస్యు, దాస అనే రెండూ ఇండో-ఇరానియన్ పదాలే. దస్యు అనేది పురాతన ఇరాన్ పదమైన "దైన్ హూ" కు అంటే (శత్రువు, శత్రుదేశం). అలాగే పరిష్యన్ పదం "దేహ్" అంటే గ్రామం. అలాగే దాస అంటే పురాతన ఇరానియన్ పదం "దాహ".(పర్షియన్ పదం దాహ్ అంటే ఆడ బానిస). దశ్యులను వధించాలని నినేరుగా చెప్పటం చూస్తే దాసులకన్నా దస్యులనే ఎక్కువగా ఏవగించుకునే వారని తెలుస్తున్నది. "దస్యు హత్య" అన్నమాట ఋగ్వేదంలో మాటిమాటికి వినిపిస్తుంది.దశ్యులను కృష్ణ గర్భులు అని, (అంటే గర్భంలో నల్లని వారిని ధరించటం), అనాసులని (చట్టి ముక్కుల వారని), నల్లటి చర్మం (కృష్ణ-త్వక్) కలవారని నిందించారు. ఈ దస్యుల నాయకుడు శంబరుడు. ఇతని సేనా నాయకులు శీష్ణు, పిప్రు. వృంగద, పర్చి , చుమురి, ధుని మొదలైనవారు. దివోదాసు భరద్వాజుడు పురోహిత్యంతో తన సేనా నాయకుడు కుత్స అర్జునేయుడితో కలిసి దస్యు నాయకుడైన శంబరునితో 40 ఏళ్ళపాటు యుద్ధం చేసి శంబరున్ని, అతని సైన్యాన్ని హతమార్చారు. ఈ శంబర హత్య గురించి ఋగ్వేదంలో భరద్వాజుడు, వామదేవుడు ఇతర అనేక రుషులు యుద్ధాన్ని వర్ణించారు. ఇక్కడ ఉదహరించబడిన రుక్కుల్లో శంబర యుద్ధం వర్ణింపబడింది.( 6-26-3),(6-43-1),(4-26-3),(1-51-6),(,1-56-3),(1-130-7),(1-53-8),(2-12-4),(2-14-6),(2-12-14),(4-16-12),(4-16-13),(4-6-

3),(6-16-5),(6-16-19),(6-47-21),(6-42-21),(7-99-5). ఆర్యులు ఇంద్ర పూజకులు. దస్యులు లింగ ఆరాధకులు. వీరి మధ్య జరిగిన యుద్ధమే ఇది. ఈ యుద్ధంలో ఇంద్రుడు శంబరుడి 99 పురములను ధ్వంసం చేసి, 100వ పురాన్ని దివోదాసుకు ఇచ్చాడని ఈ ఋగ్వేదంలో వర్ణించ బడింది. శంబర హత్య వృత్తాంతం ఋగ్వేదంలో అనేక రుక్కులలో చెప్పబడింది. మిగిలిన ప్రజలను లొంగదీసుకుని దాసులుగా మార్చుకున్నారు. ఈ దాసులను ఆర్యుల సామాజిక వ్యవస్థలో అట్టడుగు సామాజిక వర్గంగా అనుబంధించారు. ఋగ్వేదానంతర సాహిత్యంలో వారే సూద్రులుగా పరిగణించబడ్డారు.

ఋగ్వేద ఆర్యుల శత్రుకోటిలో దస్యులతోపాటు ఫణులుకూడా ఉన్నారు. ఫణులు అన్నది ఒక తెగ ప్రజలు. ఈ ఫణులు ధనవంతులని, లోభులని, దురాశ పరులనీ ఋగ్వేదంలో వర్ణించారు. ఫణం అంటే నాణెము.""వణిక్" అంటే వ్యాపారస్తుడు లేదా వర్తకులు. ఈ "వణిక్" శబ్దమే తరువాత "బనియా" అయ్యింది. పణ్యం అంటే సరుకులు. ఈ అర్థాలను బట్టి ఫణులు వ్యాపారస్తుల అని అర్థమవుతుంది. ఇంద్రుడు వీళ్ళసంపదలను కొల్లగొడ తాడు(2-24-7). వీళ్లను రాక్షసులని, ఆర్య శత్రువులు అని ప్రకటిస్తాడు. భారద్వాజ, రాహు గణ, గృత్సమద మొదలైన రుషులు ఫణులను గురించి చేసిన ప్రస్తావనలు ఋగ్వేదంలో కనిపిస్తాయి. ఒక సందర్భంలో ఒక శునక రూపంలో ఉన్న "సరమా" (అంటే దేవతల కుక్క) అనే ఆమెను ఫణుల దగ్గరకు రాయబారిగా పంపుతారు. తమకు పశువులను కప్పంగా ఇవ్వాలని లేకుంటే అవాంఛనీయ పరిణామాలు ఉండగలవని బెదిరిస్తారు. సరమా ఫణుల సంవాదాన్ని ఋగ్వేదం (10-108) సూక్తంలో పేర్కొన్నది. తెగ అన్న అర్థంలో ఋగ్వేదంలో ఉపయోగించబడిన మరొక పదం విష్. ఈ పదం రుగ్వేదంలో 170 సార్లు వస్తుంది. రాజుని విశాంపతి అనేవారు. విష్ అంటే సాధారణంగా ప్రజలు, వ్యవసాయకులు. దీనినుండి వైశ్య (విశుని సంతానం) శబ్దం వచ్చింది. ఈ విష్‌ను అంటే ప్రజలను గ్రామం అన్న చిన్న విభాగాలుగా విభజించేవారు. ఒక్కొక్క గ్రామం ఒక్కొక్క పోరాట సముదాయంగా ఉండేది. గ్రామాలు ఒకదానితో ఒకటి సంఘర్షించుకున్నప్పుడు "సంగ్రామం" జరిగేది. సంగ్రామం అన్న పేరు అలా వచ్చింది.

ఆర్యులు తమలో తాము కలహించుకున్న యుద్ధం పేరు దాశరాజ్ఞ యుద్ధం. అంటే పది మంది రాజులతో చేసిన యుద్ధం అని అర్థం. సుదాసు నాయకత్వంలో వశిష్ఠుడు పురోహితుడు సహాయంతో పురుష్ణి నది (రా వి) వద్ద పది తెగలతో భీకరయుద్ధం జరిగింది. ఈ పది తెగలు చేసిన తప్పేమిటి అంటే వరుష్ణి అనే నదిని దారి మళ్ళించడం. ఈ నీటి తగాదాలు పరిష్కార మార్గంగా సుదాసు వారితో యుద్ధం చేశాడు . ఈ పది తెగలలో ఆర్య తెగలు కూడా ఉన్నాయి. దాశరాజ్ఞ యుద్ధంలో పాల్గొన్న తెగలు తుర్వసులు, భ్రుగులు, సిమ్యులు, యక్షులు, మత్స్యులు, ఫక్తులు, భలానులు, అలీనులు, వినాశిన్‌లు. మత్స్యము అంటే చేప, అలీనం అంటే తుమ్మెద ఇవి రెండు టోటెమిక్ పేర్లు. టోటెమిక్ అంటే కుదురు. అవి ఆయా కుదురు చిహ్నాలు అన్నమాట. ఈ యుద్ధంలో భరతుల తెగకు చెందిన సుదాసు గెలిచాడు. ఈ యుద్ధం ఈ క్రిందిఅనేక ఋక్కులలో వర్ణించబడింది. (7-83-6),7-83-7),(,7-18-6) (7-18-10.8),(7-83-8),(7-18-12),(7-18-13),(7-18-14),(7-18-18),(7-18-11),(7-83-1,10),(7-18-19). ఆ యుద్ధంలో సుదాసు 10 తెగలను ఓడించి భరత గణ ఆధిపత్యాన్ని నెలకొల్పాడు. ఈ భరతుల తెగ పేరు మీదనే మన దేశానికి భారతదేశం అనే పేరు వచ్చింది. అంతేగాని భారతంలో చెప్పినట్లు దుష్యంతుడు శకుంతలకు పుట్టిన భరతుని పేరుమీద ఈ దేశానికి పేరు వచ్చినట్లుగా చెప్పటం అసంగతమైన విషయం. విశ్వామిత్రుడు (3-53-12) రుక్కులో ఇలా అంటాడు "విశ్వామిత్ర స్య రక్షతి బ్రహ్మే దం భారతం జనం". విశ్వామిత్రుని ఈ బ్రహ్మ (మంత్రం, వాక్కు) ఈ భరత గణాలను రక్షించుగాక అని అర్థం.

ఋగ్వేదం మొత్తంలో ఇటుక (ఇస్టా) అనేమాట ఎక్కడా లేదు. ఆ తర్వాతి వేదాలలో ఉన్నది.

చనిపోయిన తర్వాత మృత శరీరాలను దహనం చేసే ఆచారం మొదట ఆర్యులలో బాగా విస్తరించింది. లోహ యుగానికి ముందు ఈ ఆచారం ఉండినా ఇంత విస్తృతంగా వ్యాపించడం అనేది జరగలేదు. లోహాన్ని మంటల్లో కరిగించటం వలన వ్యర్థ పదార్థాలు తొలిగి శుద్ధ లోహం తయారవుతుంది. అలానే దహనం వల్ల శరీరం పరిశుద్ధం అవుతుందనే భావం దీని ద్వారానే ప్రబలింది. అగ్నిని పవిత్ర విషయంగా పూజించారు. ఇరానియన్లలో కూడా అగ్ని దైవానికే ప్రథమ పూజ. అగ్ని వైదిక దైవమని వేరే చెప్పనవసరం లేదు. అపరిశుభ్రమైన మృతదేహాన్ని అగ్ని స్పర్శ శుద్ధి చేయగలదనే భావన ఋగ్వేద కాలంనాటి ఆలోచనల్లో విప్లవాత్మకమైనది. ఇరానియన్లు ఆ తర్వాత కాలంలో శవాలను పొంత గద్దలకు, జంతువులకు వదిలేవారు. అవి మాంసాన్ని తొలగించి తినేవి. అయినా ఇలా శవాల్ని వదిలిపెట్టే "దఖ్మా"అనే వేదికకు దహన వాటిక అనే అర్థమే ఉండేది. క్రీస్తు శకం 10వ శతాబ్దం వరకు భారతదేశంలో మనం ఆర్యులని భావించే ప్రజలు కూడా ఇదే ఆచారాన్ని పాటించారు. దహన సంస్కారం మొదట్లోపురోహిత వర్గాలకు, రాజులకు మాత్రమే పరిమితం. ఆ తరువాతే కింది వర్గాల ప్రజలలో వ్యాపించింది. మిగిలిపోయిన ఎముకలకు, బూడిదకు రెండోసారి సంస్కారం జరిగేది. మొదట్లో వీటిని కుండల్లో పూడ్చి పెట్టే వారు. కొంతకాలం తర్వాత వీటిని పవిత్రమై నదుల్లో కలిపేసే ఆచారం వచ్చింది.

ఋగ్వేద కాలంలో కొందరు పురోహితులు తమ దారిద్ర్యం గురించి హృదయ విదారకమైన విలాపం ప్రకటించడం కనపడుతుంది. ఋగ్వేదంలో 4-19-13 రుక్కులో కడుపు దహించుకు పోయే ఆకలితో వండుకోవడానికి కుక్క పేగులు తప్ప మరేమీ లేవు. దేవతలలో నన్ను కరుణించే వాడు ఒక్కడు కనిపించటం లేదు. నా భార్యను పస్తులు ఉంచుతున్నాను. అప్పుడు ఇంద్రుడు నాకు మధు ఫలాలను

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

అందించాడు అని వామ దేవరుషి తన ఆకలి బాధని వ్యక్తపరుస్తాడు.

అలాగే ఋగ్వేదంలో మరొ ఋక్కులో(1-105) ఒక రుషి రాత్రిపూట చూసుకోక బావిలో పడి పోతాడు. ఆ బావి అడుగు నుండి ఇలా విలపించాడు. ఎండుకు పోయిన నా ప్రక్కటెముకలు నవతుల్లాగా కొట్లాడుకుంటున్నాయి. ఆకలిగొన్న ఎలుకలు తన తోకను తానే కొరక్కు తిన్నట్లు లోపల నన్ను కొరుకుతున్నాయి అని వాపోతాడు.

అలాగే 10-109 రుక్కులో ఒక రాజు బలవంతంగా ఎత్తుకు పోయిన ఒక బ్రాహ్మణుడి భార్యను తిరిగి ఇప్పించడానికి చదివిన మంత్రం ఉన్నది. మరో దయనీయమైన మంత్రం ఋగ్వేదం 8-102-19,21 లో అగ్నికి చేసిన ప్రార్థన. తన దగ్గర ఆవులు లేవని, కనీసం గొడ్డలి కూడా లేదని అందువల్ల తాను నెయ్యినో, మంచి కర్రలనో ఆహుతి ఇవ్వలేకపోతున్నానని చెదలు పట్టిన ఈ వంట చెరుకునే స్వీకరించమని ఆ పురోహితుడు అగ్నిని పూజిస్తాడు. ఈ రకమైన పురోహితుల విలాప కథలు ఆయా ఆర్య తెగలలో సంపూర్ణమైన, సరైన గుర్తింపు, సభ్యత్వం లేని వారి నిస్సహాయతను తెలియజేస్తుంది.

విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం ఋగ్వేద కాలానికి ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నది. పెద్ద సంఖ్యలను (పదులు, వందలు, వేలు) దశాంశ పద్ధతిని ఉపయోగించినట్లు ఋగ్వేదంలో ఉన్న అంకెలు తెలుపుతున్నాయి. కానీ ఇటీవల అధికారిక పాఠ్యపుస్తకాలలో చాలా పెద్ద సంఖ్యలో సున్నాను, అంకాల స్థాన విలువలను, సంఖ్యలను నిరూపించేలా ఆనాడే వాడినట్లు చూపటం అర్థరహితం. ఎందుకంటే ఆ కాలంలో అసలు లిపి అనేదే (అదే విధంగా సంఖ్యల చిహ్నాలు) లేదు. పొడుపు కథలా సాగిన ఋగ్వేద సూక్తం ఒక దానిలో (1-164-48) పురాతన పంచాంగం సూచనప్రాయంగా ఉన్నది. 3 ఋతువులు 12 మాసాలు (చాంద్రమానం), 360 రోజులు కలిగిన సంవత్సరాన్ని (సౌర) ఇది తెలియజేస్తుంది. సౌరమాన సంవత్సరాన్ని దాని యదార్థ నిడివికి వాస్తవంగా ఎలా సర్దుబాటు చేశారు. దాని ప్రారంభాన్ని ఏ విధంగా నిశ్చయించారు అన్న వాటికి ఎలాంటి ఆధారాలు లేవు. వివాహ సూక్తంలో (10-85-13) నక్షత్రాల గురించి పేర్కొన్నప్పటికీ, అయినాలు లేదా విషవత్తులను ఏ రకంగా నిర్ణయిస్తారన్న దానికి కూడా ఆధారం ఏది లేదు. రుగ్వేద రుషులు భూమిని గోళాకారంగా కాక చక్రంగా భావించారు.

వైద్యం గురించిన సమాచారం కూడా అత్యంత స్వల్పంగా దొరుకుతుంది ఋగ్వేదంలో. భైషజ్య-వైద్యుని ప్రస్తావన ఋగ్వేదంలో ఒకటి కంటే ఎక్కువ సార్లే వచ్చింది. ''వ్యాధి పాశకునిగా''అతను మొక్కలతోనూ, వనమూలికలతోను చికిత్స చేసేవాడు (ఋగ్వేదం 10-97). రోగ లక్షణాలను ఉపశమింప చేయడంలోనూ, గాయాలను మాన్పేందుకు ఉపయోగించే ఔషధ విలువలు ఉన్న మొక్కలను అనుభవం ద్వారా వారు గుర్తించి ఉంటారు. అయితే వ్యాధుల నివారణకుప్రార్థనలు మంత్రాలు ఎక్కువగా ఉన్నాయి. మంత్రాల ద్వారా స్తోత్రాల ద్వారా వ్యాధులు నయమవుతాయని భావించేవారు. కామెర్ల వ్యాధిని పోగొట్ట వలసిందిగా సూర్యుడిని (1-50-11,12), గర్భస్రావ నిరోధానికి అశ్వినీ దేవతలను ప్రార్థించడం (5-78-7,9) ఋగ్వేదంలో కనిపిస్తుంది.

ఋగ్వేద కాలంలో మంత్రానికి శక్తి ఉందని నమ్మేవారు. 10-162-1,2 మంత్రాలలో నీ గర్భమందున్న రోగాన్ని, యోని స్థానంలో ఉన్న రోగాన్ని ఈ బ్రహ్మతో (అంటే ఈ మంత్రంతో) నాశనం చేయుగాక. (10-162-1,2,3,4,5,6) లో రోగ నివారణ మంత్రాలు ఇలా నీ రెండు కన్నులు, రెండు ముక్కు రంధ్రాలు, రెండు చెవులు, గడ్డము, మెదడు, నాలుక నుండి తల వరకు ఉన్న యక్ష్మ (రోగం)ను పోగొడుతున్నాను. నీ మెడ నుండి, ధమనుల నుండి, స్నాయువుల నుండి, ఎముకల నుండి, రెండు ముంజేతుల నుండి, రెండు బాహువుల నుండి, రెండు భుజముల నుండి యక్ష్మను పోగొట్టు తున్నాను. నీ ప్రేవుల నుండి, గుద స్థానము నుండి, హృదయము నుండి, మూత్రాశయం నుండి, మాంస కండరాల నుండి యక్ష్మను పోగొట్టు తున్నాను. నీ తొడల నుండి, రెండు జానువుల నుండి, రెండు కాలి పిక్కల నుండి, రెండు మడమల నుండి, రెండు పిరుదుల నుండి, నడుము నుండి, మల స్థానము నుండి యక్ష్మను పోగొట్టుకున్నాను. నీ మూత్ర స్థానం నుండి, వెంట్రుకల నుండి, గోళ్ళ నుండి, శరీరము నుండి యక్ష్మను పోగొట్టు తున్నాను అని ఉంది. ఋగ్వేద రుషులు రోగ నివారణకు మంత్రాల మీద ఎక్కువ ఆధారపడేవారు అన్నది అర్థం అవుతుంది.

రుగ్వేదంలో అశ్లీలాన్ని సూచించే అనేక రుక్కులు మంత్రాలు ఉన్నాయి. 1-28-2 లో ఈ విధంగా ఉన్నది. వివృత జఘన అయినా ఒక యువతి రెండు తొడలు చీల్చుకొని ఉన్నప్పుడు అందులో.........

9-56-3 లో లో మంత్ర కారుడు కామాతురత అయిన కన్య తన విటుడుని పిలవడానికి ఇదే విధంగా వేళ్ళతో సైగ చేస్తుంది. అని అన్నాడు.

9-101-14 లో ఇలా ఉంది. వైదిక స్త్రీలు పూర్తిగా స్వచ్ఛందంగా ఉండేవారు ఒక చోట కుమారి కన్య విటుడిని పిలుస్తుంది. మరొకచోట వివాహిత తన విటుడిని ప్రార్థిస్తూ ఉండేది. విటుడు దొరికినప్పుడు యువతికి ఎలాంటి తృప్తి కలిగేది10-30-6 లో ఇలాంటి వర్ణనలు ఉన్నాయి.

9-1-34 లో ఇలా ఉంది. రెండు తొడల మధ్య వేలాడుతూ, పుష్టి కలిగి, లంబాయమానంగా ఉన్న........ దాన్ని చూసి శశ్వతి ఇలా అంది. ఆహా! ఎంతో అందంగా, భోగింప తగినదిగా ఉన్నదాన్ని......... కలిగి ఉన్నావు అని.

10-86-85 లో ఇలా ఉంది. ఏవిధంగా వంకర కొమ్ముల ఆబోతు ఉన్మాదంతో రంకె వేస్తూ రమిస్తుందో అదేవిధంగా నీవు కూడా నాతో రమించు!

ఇలాంటి మంత్రాలు అనేకం అధర్వ వేదంలో కూడా ఉన్నాయి.

**చాతుర్వర్ణ వ్యవస్థ: పురుష సూక్తం**

ఇదిఋగ్వేదం చివరి సూక్తాలలో ఉన్నది (10-90-12) ఈ రుక్కు పదో మండలంలో ఉన్నది

ఈ పదవ మండలంలో మొట్టమొదటిసారిగా

చతుర్వర్ణాలు గురించి పేర్కొనటం జరిగింది.

బ్రాహ్మనో స్య ముఖ మాసీద్, బాహూ రాజన్యకృతః

ఉరూ తదస్యయద్ వైశ్యః పద్భ్యామ్ శూద్రో అజాయతః

అంటే ఈ పురుషుని ముఖం బ్రాహ్మణుడు, బాహువులు క్షత్రియుడు, తొడలు వైశ్యుడు, కాళ్ల నుండి శూద్రుడుపుట్టాడు. ఆర్యులు సప్తసింధులో తాము చేసిన యుద్ధాల అనంతరం లొంగదీసుకున్న ప్రజలను శూద్రులుగా మార్చి సమాజంలో అట్ట అడుగు స్థానంలో ఉంచారు. ఈ రకమైన చాతుర్వర్ణ వ్యవస్థ ఋగ్వేద ఆఖరి కాలంలో ఏర్పడింది. ఇది యజుర్వేద కాలం నాటికి స్పష్టంగా నాలుగు వర్ణాలుగా సమాజం విభజితమై నది. ఈ శూద్రులకుఎలాంటి హక్కులు లేకుండా చేసి పై మూడు వర్ణాలకు సేవ చేయడమే వారి విధిగా, ధర్మంగా నిర్ణయించారు.

ఈ పురుష సూక్తం లోని పదవ రక్కులో ఆ విరాట్ పురుషుని నుండి గుర్రాలు, నోటిలో రెండువైపులా దంతాలు కల ప్రాణులు పుట్టాయి. ఆవులు, గొర్రెలు, మేకలు ఆయన నుండి పుట్టాయి ❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 18, issue : 10 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# మీడియా స్వేచ్ఛలో పడిపోతున్న భారత ర్యాంకు




గత కొన్ని సంవత్సరాలుగా భారత దేశంలోని పౌరులు అనుభవిస్తున్న స్వేచ్ఛ క్రమంగా తగ్గిపోతోంది. అమెరికాకు చెందిన ఫ్రీడమ్ హౌస్ సంస్థ వరుసగా రెండో సంవత్సరం కూడా భారత దేశానికి “పాక్షిక స్వేచ్ఛ” ఉన్న దేశంగా ప్రకటించింది. ఇది భారత దేశాన్ని ఈ విషయంలో నైరుతి ఆఫ్రికాలోని మాలవీ దేశం, లాటిన్ అమెరికాలోని బలీవియా దేశాల సరసన చేర్చింది. 2018లో భారత దేశంలో పరిస్థితులు బాగా దిగజారిపోయాయని జర్నలిస్టుల రక్షణ కమిటీ (సిపిజె) అనే మీడియా పరిరక్షణ సంస్థ పేర్కొన్నది. ఐక్యరాజ్య సమితికి చెందిన విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ (యునెస్కో) లెక్క ప్రకారం 2020లో భాతర దేశంలో ఆరుగురు జర్నలిస్టులను వధించారు. 2021లో అయిదుగురిని చంపారు.

ఉగ్రవాదం, దేశ ద్రోహం సెక్షన్ల కింద తప్పుడు కేసులను బనాయించి భారత దేశంలో మీడియా స్వేచ్ఛను అంతకంతకూ హరిస్తున్నారని హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్ఆర్డబ్ల్యు) పేర్కొంది. ప్రభుత్వాన్ని విమర్శించే మీడియా సంస్థలు, స్వతంత్ర మీడియా సంస్థల మీద దాడులకు దిగుతున్నారని, వారి పని ప్రదేశాలను ధ్వంశం కూడా చేస్తున్నారని నివేదిక పేర్కొంది. 40 మంది జర్నలిస్టుల మీద నిఘా వేసినట్లు పెగాసస్ ప్రాజెక్టు వెల్లడించింది.

2021లో దేశంలో కనీసం ఆరుగురు జర్నలిస్టులను చంపారనీ, 108 మంది మీద దాడులు చేశారనీ, 13 మీడియా సంస్థలు, వార్తాపత్రికల మీద దాడులు చేశారని రైట్స్ అండ్ రిస్క్స్ ఎనాలిసిస్ గ్రూప్ విడుదల చేసిన ఇండియా ప్రెస్ ఫ్రీడమ్ నివేదిక తెలిపింది. జమ్మూ-కాశ్మీర్‌లో 25, ఉత్తర ప్రదేశ్‌లో 23, మధ్య ప్రదేశ్‌లో 16, త్రిపురలో 15, ఢిల్లీలో 8, బీహార్‌లో 6, అస్సాంలో 5, హర్యానా, మహారాష్ట్రల్లో 4 చొప్పున, గోవా, మణిపూర్‌లో 3 చొప్పున, కర్నాటక, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో రెండేసి చొప్పున, ఆంధ్ర ప్రదేశ్, చత్తీష్ఘర్, కేరళల్లో ఒక్కోటి చొప్పున మీడియా సంస్థలు దాడులకు గురయ్యాయని నివేదిక తెలిపింది.

ప్రముఖ మీడియా రక్షణ సంస్థ అయిన రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ నివేదిక ప్రకారం మీడియా స్వేచ్ఛకు సంబంధించి ప్రపంచంలోని 180 దేశాలను సర్వే చేయగా భారత దేశం 2009లో 105వ ర్యాంకులో ఉండేది, 2019 నాటికి దాని పరిస్థితి 140వ ర్యాంకుకు దిగజారిపోయింది. పొరుగునున్న భూటాన్ (80), నేపాల్ (106), ఆఫ్ఘనిస్తాన్ (120), మ్యాన్మార్ (138) కన్నా తక్కువ స్థాయిలో ఉంది. అంతేకాదు 2020-21 నాటికి భారత్ ర్యాంకు 142కు 2022 నాటికి 150 స్థానానికి పడిపోయింది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు..........................................................

వీధి.....................................................................

గ్రామం.................................................................

మండలం లేదా పట్టణం...........................................

జిల్లా....................................................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.